14-4Pg1exHMNWJQE.qxd:14-4Pg1exHMNWJQE.qxd 14/04/25 12:00 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-4-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 72 పేజీలు: 12 వెల: 6.50

యుఎస్ సందర్శన ఓ హక్కుకాదు విదేశాంగ మంత్రి మార్కో రుబియో


ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పి పంపిస్తున్న పాకిస్థాన్

9లో

# విశ్వనగరంగా 'అమరావతి'

## రూ. 31 వేల కోట్ల పనులకు టెండర్లు

### రాజధానికి అదనంగా 30 వేల ఎకరాలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అత్యంత ఆధునీకంగా ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.ఇందుకు కోసం దాదాపు అన్ని దశలలో విస్తృత కార్యచరణ చేపట్టినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. భవనాల నిర్మాణం వేగవంతంగా అవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీతో రాజధాని పనులు పునర్ప్రారంభిస్తామన్నారు.ఆ మేరకు సిఎం చంద్రబాబు ఒక సమాచార పత్రాన్ని విడుదల చేసారు.రాజధాని నిర్మాణానికి సంబంధించి తీసుకుంటున్న చర్యల కార్యచరణ వివరించారు.ఈ పత్రంలోని అంశాలను అనుసరించి అభివృద్ధి చేస్తూనే మరోవైపు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసేలా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.మరో 30వేలఎకరాల మేర సమీకరించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్లకు అనుసంధా నంగా ఏర్పాటు అయ్యే ప్రాజెక్టుల కోసం ఈ స్థాయిలో భూ సమీకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ఈ సమీకరణ ప్రక్రియ చేపట్టేందుకు సీఆర్డీఏ ప్రణాళికలు చేస్తోంది. రాజధాని భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణ పనులతో పాటే విస్తరణ కోసం అమరావతి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. కొత్తగా మరో 30 వేల ఎకరాలకు పైగా సమీకరణ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టుతో పాటు అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం ఈ స్థాయిలో భూ సమీకరణ అవసరంఅని సీఆర్డీఏ భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ఈ సమీకరణ ప్రక్రియ చేప్టటేందుకు ప్రణాళికలు సిద్ధం అవు తున్నాయి. ఇప్పటికే 33 వేల ఎకరాల్లో నిర్మాణం పనులు ప్రారంభించిన సీఆర్డీఏ, రాజధాని భవిష్యత్ అవసరాల దృష్ట్యా అదనంగా భూమిని సమీకరించనున్నట్టు తెలుస్తోంది.

రాజధాని విస్తరణపై దృష్టిపైనే ప్రభుత్వంపై పూర్తి దృష్టి పెట్టింది,.రాజధాని అభివృద్ధి చేస్తూనే రెండో వైపు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవలే రూ.31 వేల కోట్ల విలువైన పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను వివిధ ఏజెన్సీలకు సిఆర్‌డిఏ అప్పగించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు కూడా పనుల ఆధారంగా విడతలవారీగా నిధుల్ని మంజూరు చేస్తున్నాయి. రాజధాని పనులు వేగం అందుకోగానే ఈ విస్తరణపై కూడా దృష్టి పెట్టాలని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే రాజ ధానిలో భవిష్యత్ ప్రాజెక్టుల కోసం మరో 30 వేల ఎకరాలకుపైగా భూసమీకరణ చేసేందుకు ఆలోచన చేస్తోంది.

అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఈ భూముల సమీకరణకు ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రాజధాని నగరం విస్తరణతో పాటు, భవిష్యత్ అవసరాల నిమిత్తం భూ సమీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు వెలుపల ఉన్న 20కిపైగా గ్రామాల్లో ఈ భూసమీకరణ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సమీకరణకు సంబంధించి సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేస్తోంది.

అమరావతి రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఎపి ఏవియేషన్ కార్పొరేషన్ టెక్నో ఫీజిబిలిటీ నివేదికను సిద్ధం చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ నివేదికను త్వరిత గతిన రూపొందించి కేంద్రానికి పంపనుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి దీనిపై గ్రీన్ సిగ్నల్ వచ్చాక ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అమరావతిలోని ఇ13 రోడ్డుని చెన్నై కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్16)తో అనుసంధా నించేందుకు, ఇ15 రోడ్డుని మంగళగిరి లోని పాతబస్టాండ్ వరకు విస్తరించేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) టెండర్లు పిలిచింది. ఇ15కి రూ.70 కోట్లు, ఇ13కి రూ.384.78 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రహదారుల్ని జాతీయ రహదారి వరకు పొడిగించే ప్రతిపాదన >>2



# గడువు దాటితే 30 రోజుల్లో వెళ్లిపోవాలి

## హోంల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికాలో ఎక్కువ కాలం నివసిస్తున్న విదేశీ జాతీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరికలు జారీ చేసింది. 'అమెరికాలో 30 రోజులకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి' అని ఎక్స్‌లో సందేశం ఉంచింది. 'సొంతంగా అమెరికాను వీడటమే ఉత్తమమైన మార్గం. మీ సామాను సర్దుకొని విమానం ఎక్కండి. మీకు ఎటువంటి నేర నేపథ్యం లేకపోతే అమెరికాలో సంపాదించుకున్న సొమ్మును దాచుకొని బయల్దేరండి' అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. ఇలాంటి వారు విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే.. రాయితీ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు చేసింది. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకున్న >>2

# ఐఎఎస్‌ల బదలీలు

## ఆర్పీ సిసోడియా స్థానంలో జయలక్ష్మి

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో తొమ్మిది మంది సీనియర్ ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదలీ చేసింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బదలీ అయ్యారు. చేనేతశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సిసోడియాను నియమించారు.రెవెన్యూశాఖలో విభాగపరంగా అనేక అభియోగాలు ఆర్పీ సిసోడియా పైవచ్చాయి. రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సైతం సీసోడియా పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం,.ఈ క్రమంలో ఆయనను చేనేతశాఖకు బదలీ చేసారంటున్నారు. పలువురు సీనియర్ ఐఎస్ సిసిఎల్ఎ ప్రత్యేక >>2



పేలుడు ధాటికి పూర్తిగా ధ్వంసమైన బాణాసంచా కేంద్రం

# బాణాసంచా పరిశ్రమలో భారీ పేలుడు

## 8 మంది మృతి, 8 మందికి గాయాలు

### అనకాపల్లి జిల్లాలో ఘోర ప్రమాదం

**అనకాపల్లి, ఏప్రిల్ 13, ప్రభాత వార్త :** అనకాపల్లి జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. కోటివురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద సంఘటనలో 8 మంది మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. స్థానికులు పరుగున వెళ్లి చూసేసరికి బాణా సంచా తయారీ కేంద్రం తునా తునకలై క్షతగాత్రుల రోదనలతో భయానకంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. వారికి స్థానికులు సహకారం అందించారు. క్షతగాత్రులను హుటాహుటిన కోరవురట్ల పీహెచ్ సీకీ, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అసలు ప్రమాదం ఏ విధంగా జరిగిందని ఎవరూ చెప్పలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మరణించిన మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం 15 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం జరిగిందని, క్షతగాత్రులను మెరుగైన వైద్య నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి మరియు విశాఖపట్నం కె.జి.హెచ్. తరలించడం జరిగిందని వారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని ఆమె తెలిపారు. ప్రమాద సంఘటన ప్రదేశాన్ని ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా సందర్శించారు. దురదృష్టకర సంఘటన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, సహాయక చర్యలపై ఆరా తీశారని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి అచ్చెన్నాయుడు**

అనకాపల్లిజిల్లాలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అనకాపల్లిజిల్లా అధికారులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. >>2



# భూమన ఆరోపణలపై క్రిమినల్ కేసు!

## టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** గత వైఎస్సార్సీ ప్రభుత్వంలోని టిటిడి పాలకమండలి పూర్వ ఛైర్మన్‌గా వ్యవహరించిన భూమన కరుణాకర్‌రెడ్డి కమీషన్‌లు తీసుకుని పనులు చేశాడని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన ప్రకటన చేశాడు. భూమన పెద్ద అవినీతిపరుడని, గతంలో టిటిడిలో అన్నీ స్కాంలకే పాల్పడ్డాడన్నారు. అసలు భూమన కరుణాకర్‌రెడ్డి హిందువే కాదని చెప్పడం హాట్‌టాఫిక్‌గా మారింది. ఆయన హయాంలో గోవులకు పురుగుల దాణా పెట్టారని, అనారోగ్యం, వృద్ధాప్యంతో గోవులు మృతి చెందాయే తప్ప టిటిడి సిబ్బంది నిర్లక్ష్యం లేదని తెలిపారు. సస్పెన్షన్‌కు గురైన మాజీ గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డితో కలసి మాజీ ఛైర్మన్ మార్ఫింగ్ ఫోటోలు విడుదల చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. >>2



# రాజకీయాల్లోకి వస్తున్నా!

## ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఎబివి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 13( ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు వల్ల అనేక వ్యవస్థలు, ఎంతో మంది తీవ్రంగా నష్టపోయారని అందుకే ఇకపై జగన్ నెవర్ ఎగైన్ అన్నదే తన నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు మాజీ ఇంటిలిజెన్స్ ఛీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన పలు ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావించారు. జగన్ మళ్లీవస్తే రాష్ట్రం అధోగతి పాలవుతోందన్నారు. త్వరలోనే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు. తన జీవితంలో కాళ్లు, చేతులు >>2

# అందరికీ అందుబాటులో ఆధునిక వైద్యం

## యేడాదిలోగా 100 పడకల ఆసుపత్రి

### మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునీక వైద్యం ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం కీలక లక్ష్యమని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రజలకు వైద్యంతో పాటు, ఆయా వ్యాధులు నిర్ధారించే పరీక్షాశాలలు(ల్యాబ్స్)ను అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు.ఈ క్రమంలోనే మంగళగిరి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అనుసరించి 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్నారు.ఏడాదిలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని రావడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతదేశానికే ఆదర్శంగా మంగళగిరి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మంగళగిరి సమీపం చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు కూటమి నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోఛ్చారణల మధ్య కూటమి నేతలతోకలిసి మంత్రి నారా లోకేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భవన నమూనా చిత్రాలను పరిశీలించి నేతలకు వివరించారు. కూటమి నేతలతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



ఆదివారం టిడ్కో కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్ శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి లోకేష్

1984లో స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు వైవీసీ(యార్లగడ్డ వెంకన్న చౌదరి) క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్ సెల్ఫీ దిగారు. మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల నేరవేరుతుందని వ్యాఖ్యానించారు.మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల. ఆ కలను నెరవేర్చే అవకాశం మనకు వచ్చింది. అందరి సహకారంతో నిర్మిస్తాం. మంగళగిరి 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేయాలని ఇక్కడి ప్రజలను నన్ను కోరడం జరిగింది. ఇప్పుడున్న స్థలంలో కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సువిశాలప్రాంగణం ఉండాలనేఆలోచనతో ఈ ప్రాంతాన్ని >>2

# అనకాపల్లి ఘటన మృతులకు రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా


## పేలుడు ఘటనపై సమగ్ర విచారణ: హోంమంత్రి అనిత

**విశాఖపట్నం,ఏప్రిల్, 13 ప్రభాతవార్త:** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణాసంచా పరిశ్రమలో పేలుడు ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ప్రమాద ఘటనలో ఎనిమిది మంది మృతి చెందడం తీవ్ర విషాదకరమని ఆమె పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించినట్లు సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో స్పష్టం చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు చొప్పున ఆయా కుటుంబాలకు పరిహారంగా అందించనున్నట్లు హోంమంత్రి అనిత ప్రకటించారు. ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా స్పందించినట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు కేంద్రం మరణించిన ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు స్పష్టంచేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ సాయానికి అదనమన్నారు. కోటవురట్ల మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో >>2



# కుమారుడితో హైదరాబాద్ చేరుకున్న డి.సిఎం పవన్

**విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్న సంగతి తెలిసిందే. పవన్ తన సతీమణి అన్నాలెజినోవా, కుమారుడు మార్క్‌శంకర్, కుమార్తె పొలెనా అంజనా పవనోవాతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. తన కుమారుడిని పవన్ ఎత్తుకుని ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ తాజాగా పవన్ కల్యాణ్‌ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసి మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన రాజకీయ నాయకులు, జనసేన నేతలు, అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రధాని మోడీకి పవన్ కృతజ్ఞతలు చెప్పారు. సింగపూర్ అధికారులు సింగపూర్‌లోని భారత హైకమిషన్ అధికారులు సమన్వయంతో అందించిన సాయం క్లిష్ట సమయంలో ఎంతో భరోసా ఇచ్చిందన్నారు. ఇవాళ అన్నా లెజినోవా శ్రీనివాసుడికి మొక్కులు చెల్లించుకునేందుకు తిరుపతి >>2



# మండుతున్న ఎండలు

## ఒక మోస్తరు వర్షాలున్నాయంటున్న వాతావరణ శాఖ

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. జనం బయటకు రావాలంటే భయపడుతున్నారు.ఎండ తీవ్రత రోజురోజుకు మరింత పెరుగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరినట్టు వెల్లడించింది. గడచిన 24 గంటల్లో పల్నాడు జిల్లా రావిపాడులో 43.7 డిగ్రీలు, ప్రకాశం జిల్లా దరిమడుగులో 43.4 డిగ్రీలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 43 డిగ్రీలు, తిరుపతి జిల్లా రేణిగుంటలో 42.8డిగ్రీలు,, తూర్పు గోదావరి జిల్లా చిన్నాయిగూడెంలో 42.6 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రకాశంలో 22 చోట్ల, బాపట్లలో 18, పల్నాడు 17, నెల్లూరు 13, ఎన్టీఆర్ 8, ఏలూరు 7, గుంటూరు 7, తిరుపతి 7, కృష్ణా జిల్లాల్లో 6 ప్రాంతాల్లో, తదితర జిల్లాల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 119 ప్రాంతాల్లో 41 ది కు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్ అయినట్లు ఎపిఎస్ డిఎంఎవెల్లడించింది. ఆదివారం మొత్తం 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, 67 మండలాల్లో వడగాలుల నమోదయ్యాయినట్లు >>2

14-4pg2exHMNWJQE.qxd:14-4pg2exHMNWJQE.qxd 14/04/25 11:57 PM Page 1





రాజస్థాన్‌లోని కోటలో నిర్మించ తలపెట్టిన రాజ్యాంగపార్క్ స్థల పరిశీలన చేస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

# పరిశ్రమలో భారీ పేలుడు

>> క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. సహాయక చర్యలు మరింత వేగవంతం చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పేలుడుపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపండి: మంత్రి కొల్లు రవీంద్ర**

కోటవురట్ల బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదంపై ఇంఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కార్మికుల మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షత గాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని, ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. మృతులు మరింతగా పెరిగే అవకాశం ఉందనడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పేలుడుపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని అన్నారు.

**అనకాపల్లి విషాదం పై ప్రధాని దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లాలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో 8 మంది మృతి చెందడం పట్ల ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన ఘటన దురదృష్టమని, బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని తెలిపారు. కేంద్రం తరపున మృతి చెందిన కుటుంబాలకు 2 లక్షలు, గాయపడిన కుటుంబాలకు 50 వేల రూపాయలు చొప్పున అందచేస్తామని హామీ ఇచ్చారు. కాగా మృతుల కుటుంబాలకు 15 లక్షల రూపాయలు సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# రాజకీయాల్లోకి వస్తున్నా!

>> ఆడినంత వరకు సమాజంకోసం పనిచేస్తానని తన రిటైర్మెంట్ పంక్షన్‌లో చెప్పానని, అదే కొనసాగిస్తానన్నారు. రాజకీయాల్లోకి రావడం వెనుక ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రయత్నిస్తానన్నారు. గత అయిదేళ్లపాలనలో జగన్ పార్టీ విధ్వంసం సృష్టించిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం కోలుకోలేని దెబ్బ తిందని, ఆర్థిక సామాజిక విధ్వంసం కొనసాగిందన్నారు. వైసీపీ వాళ్లకు సంఘంలో ఏమాత్రం గౌరవం లేదన్నారు. జగన్ ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ రాకూడదని, ప్రజల అయిదేళ్ల ఎంతో పోగొట్టుకున్నారన్నారు. రాజకీయాలు అంటే కేవలం సంపాదన అనుకనే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. జగన్ ఒక మోనాస్టార్ అంటూ అక్రమాలు చేసే వారికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. కులాలు, వర్గాలుగా ప్రజలను విడదీశాడని, కేవలం తన స్వార్థం కోసం బలిపెడతాడని ఇంతటి విపరీత మనస్తత్వం కలిగిన జనగ్‌ను ఆయన వెంట ఉన్న నేతలు వీడాలని సూచించారు. తను ప్రస్తుతం ఏపార్టీలోనూ లేనని, అలా అని పార్టీ పెట్టే ఆలోచన కూడా లేదన్నారు. కోడికత్తి శ్రీనుకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. తన అనుభవంతో నిలబెడతానని, జగన్ బాధితులకు అండగా ఉండడంతోపాటు జగన్ అక్రమాలు, అన్యాయాలు బట్టబయలు చేస్తానన్నారు. జగన్‌పై పోరాడే విషయంలో వ్యక్తిగతమైనది ఏమీ లేదని, జగన్ సమాజానికి చేసిన కీడుపై మాత్రమే పోరాటం చేస్తానన్నారు.

# ఐఏఎస్‌ల బదిలీలు

>> ప్రధాన కార్యదర్శి జయలక్ష్మికి రెవెన్యూ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా ఐటీశాఖ కార్యదర్శి కె.భాస్కర్‌కు ఎపిహెచ్‌ఆర్డీఐ డైరెక్టర్‌గా పూర్తి బాధ్యతలు ఇచ్చారు. ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్‌కు ఎపి హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. రైతు బజార్ల సిఇఒగా మాధవీలతకు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సంస్థ సంఘ కార్యదర్శిగా గౌతమి, ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్‌కుమార్, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# విశ్వనగరంగా 'అమరావతి'

>> లేదు. అమరావతిలోకి బయటి ప్రాంతాల నుంచి సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ఇ5, ఇ11, ఇ13, ఇ15 రహదారుల్ని విస్తరించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డీపీఆర్‌లు రూపొందించే బాధ్యత లీ కన్సల్టెన్సీకి అప్పగించింది.

రాజధానిలో పశ్చిమ బైపాస్ రహదారి నుంచి మొదలయ్యే ఇ15 రోడ్డుని మంగళగిరిలోని పాతబస్టాండ్ వద్ద పాత మద్రాసు రహదారితో అనుసంధానిస్తారు. రాజధాని సరిహద్దు నుంచి మంగళగిరిలోని పాత బస్టాండ్ వరకు రోడ్డు పొడవు 2.3 కి.మీ.లు వస్తుంది. దీన్ని మంగళగిరిలో పాత మద్రాసు రహదారితో అనుసంధానించేందుకు అక్కడో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. దానితో కలిపి మొత్తం పొడవు 3.52 కి.మీ.లు వస్తుంది.

ఇ13 రహదారి రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం యర్రబాలెం దగ్గర ఆగిపోతుంది. ఆ రోడ్డును ఇప్పుడు ఎయిమ్స్‌కు ఉత్తరం దిక్కు సరిహద్దుని ఆనుకుని జాతీయ రహదారి వరకు పొడిగిస్తారు. డిజిపి ఆఫీసుకు దగ్గర్లో ఎన్‌హెచ్16తో దీన్ని అనుసంధానిస్తారు. అక్కడ ట్రంపెట్ ఆకారంలో ర్యాంప్‌లు, లూప్‌లు నిర్మిస్తారు. వాటితో కలిపి మొత్తం 7.2 కి.మీ. పొడవున రోడ్డు వస్తుంది. ఇ13, ఇ15 రహదారుల్ని రాజధాని వెలుపల భాగంలో కూడా వరద నీటి డ్రెయిన్‌లు, యుటిలిటీ డక్ట్‌లు వంటి అన్ని సదుపాయాలతో నిర్మిస్తారు.

**ఇ5, ఇ11 రహదారుల విస్తరణ :**

ఇ5, ఇ11 రహదారుల విస్తరణకు మలి దశలో టెండర్లు పిలవనున్నారు. ఈ రెండు రోడ్లను ఎన్‌హెచ్16తో అనుసంధానిస్తారు. భూసేకరణ అవసరం లేకుండా ఈ రహదారుల్ని తాడేపల్లిలోని కొండల్ని ఆనుకుని తీసుకెళ్లి ఎన్‌హెచ్16లో కలపాలన్నది ఆలోచన. ఇ5 రహదారి ప్రతిపాదిత మార్గంలో కొంత అటవీ భూమి ఉంది. అక్కడ రోడ్డు వేయాలంటే కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అనుమతి కావాలి. ప్రస్తుతం సంప్రదింపుల ప్రక్రియ జరుగుతోంది. అటవీశాఖ అనుమతివ్వడాన్ని బట్టి ఆ రహదారి అలైన్‌మెంట్‌ను సిద్ధం చేయనున్నారు. ఇ11 రహదారికి సంబంధించి డిపిఆర్ సిద్ధమవుతోంది. ఆ వెంటనే దానికీ టెండర్లు పిలుస్తారు. ఇక రాజధానిలో ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి సిఆర్‌డిఎ (క్రడా) అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలో అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోడీ రానున్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ తరఫున పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిగా అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను నియమించారు. పర్యటనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేయడంతో పాటు ప్రధాని, ముఖ్యమంత్రి కార్యాలయాలు, జిఎడి, గుంటూరు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకునేందుకు నియమించారు. ఈ నెల మూడో వారంలో ప్రధాని పర్యటనకు రాజధానిలోని సచివాలయం వెనక వైపు ఉన్న 120 ఎకరాల ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వేదికపై నుంచి రూ.లక్ష కోట్ల విలువైన పనుల ప్రారంభంతో పాటు పెట్టుబడులకు శ్రీకారం చుట్టనున్నారు. ఎటువంటి లోపం తలెత్తకుండా సిఆర్‌డిఎలో పలువురు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వేదిక ప్రదేశాన్ని చదును చేసే బాధ్యతలను సీఈ ధనుంజయకు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసే పనిని హౌసింగ్ సిఇ శ్రీనివాసులు, శిలాఫలకాలు, పైలాన్ ఏర్పాటు బాధ్యతలను మరో సిఇ జీవీ పల్లంరాజుకు, ఎడిసిఎల్ సిఇ ప్రభాకర్‌రావుకు అప్రోచ్ రోడ్ల మరమ్మతుల పనులు అప్పగించారు. ఐదు లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చినట్లు గృహ సముదాయాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి, గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని సీఎం గతంలోనే ఆదేశించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి ఇవ్వాలని సదుద్దేశంతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇతర దేశాల్లోనూ పలు నమూనాలు పరిశీలించి 201419 మధ్య టిడ్కో ఇళ్లను ప్రారంభించింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 గృహాలు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిందన్నారు.

# ప్రధాని మోడీ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో వచ్చే వారంతం లోపు పర్యటించే అవకాశాలున్నాయి,ఆయన పర్యటన తేది ఖరారు కావాల్సి ఉంది.అయినప్పటికి ఎరాజధానిలో ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి సిఆర్‌డిఎ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల మూడో వారంలో ప్రధాని పర్యటనకు రాజధానిలోని సచివాలయం వెనక వైపు ఉన్న 120 ఎకరాల ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వేదికపై నుంచి రూ.లక్ష కోట్ల విలువైన పనుల ప్రారంభంతో పాటు పెట్టుబడులకు శ్రీకారం చుట్టనున్నారు. ఎటువంటి లోపం తలెత్తకుండా సిఆర్‌డిఎలో పలువురు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వేదిక ప్రదేశాన్ని చదును చేసే బాధ్యతలను సిఇ ధనుంజయకు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసే పనిని హౌసింగ్ సిఇ శ్రీనివాసులు, శిలాఫలకాలు, పైలాన్ ఏర్పాటుబాధ్యతలను మరో సిఇ జీవీ పల్లంరాజుకు, ఎడిసిఎల్ సిఇ ప్రభాకర్ రావుకు అప్రోచ్ రోడ్ల మరమ్మతుల పనులు అప్పగించారు. ఈ నెలలో అమరావతి పనుల పునః ప్రారంభానికి ప్రధాని మోడీ రానున్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ తరఫున పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిగా అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను నియమించారు. పర్యటనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేయడంతో పాటు ప్రధాని, ముఖ్యమంత్రి కార్యాలయాలు, జిఎడి, గుంటూరు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకునేందుకు నియమించారు.

# గడువు దాటితే 30 రోజుల్లో వెళ్లిపోవాలి

>> వారు ఒక్కరోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5,000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని, వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది. ఈ నిర్ణయం నేరుగా హెచ్1బి, విద్యార్థి పర్మిట్లపై ఉండేవారికి వర్తించదు. కానీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో ఉండిపోయే వారిపై మాత్రం దీనిని కచ్చితంగా అమలు చేయనున్నారు.



లక్నోలో ఆదివారం జరిగిన బైశాఖి మరియు ఖల్సా సజ్నా దివస్‌లో పాల్గొన్న యుపి సిఎం ఆదిత్య నాథ్

# రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా

>> ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి గల కారణం బాణాసంచా తయారు చేస్తున్నప్పుడు మంటలు చెలరేగడంతో పెద్దయెత్తున పేలుడు జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాదం ఘటన గురించి తెలుసుకున్న హోంమంత్రి అనిత హుటాహుటిన అక్కడికి వెళ్లి ఘటనా స్థలాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సహా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి హోంమంత్రి పరిశీలించారు. అగ్నిప్రమాదంపై స్థానికులు, అధికారులతో హోంమంత్రి స్వయంగా మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారన్నారు. చోడవరం, రావికమతం, నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది తక్షణం వచ్చి ఎగసిపడే మంటలను అదుపులోకి తెచ్చారన్నారు.

అగ్నిప్రమాదంపై సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేశ్ ఫోన్ చేసి ఆరా తీశారని హోంమంత్రి అనిత వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని చెప్పారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇచ్చేదని.. సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో ఇచ్చిన ఆదేశాలతో రూ.15 లక్షల పరిహారం ప్రకటిస్తున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. బాధితుల వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని హోంమంత్రి హామీ ఇచ్చారు. ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని హోంమంత్రి తెలిపారు. వీరిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. స్థానికులు, అధికారులు క్షతగాత్రులను ఘటన జరిగిన వెనువెంటనే సహాయక చర్యల్లో పాల్గొని ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. నర్సీపట్నం, విశాఖలోని కేజీహెచ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని హోంమంత్రి అనిత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తో కలిసి పరామర్శించారు.

విశాఖ పరవాడ జవహర్‌లాల్‌నెహ్రూ ఫార్మాసిటీతో పాటు అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా సంస్థల్లో చోటుచేసుకుంటున్న వరుస భారీ ప్రమాదాల నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో బర్న్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత వెల్లడించారు. మండే గుణం కలిగిన ఫార్మా, రసాయన కంపెనీల్లో భద్రత ఎంత ముఖ్యమో కార్మికుల క్షేమం కూడా అంతే ముఖ్యమన్నారు. కేజీహెచ్ సిఎస్ ఆర్ బ్లాక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో చికిత్స పొందుతున్న బాధితులను హోంమంత్రి అనిత పరామర్శించారు. దుఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు ఆమె ధైర్యం చెప్పారు. ఐదుగురు క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించే విషయంలో వైద్యులు ప్రాధాన్యత తీసుకోవాలన్నారు. ప్రమాదంలో గాయపడిన ఒక్కొక్కరినీ పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి అడిగి తెలుసుకున్నారు.అనకాపల్లి, అచ్యుతాపురం సెజ్ వంటి పారిశ్రామిక ప్రాంతాలున్న నేపథ్యంలో జిల్లాలో త్వరలో బర్నల్ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వం అండగా ఉంది..త్వరలోనే క్షేమంగా బయటకి వస్తారని వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులను హోంమంత్రి ఓదార్చారు. తన సొంత నియోజకవర్గమైన పాయకరావుపేటలో భాగమైన కోటవురట్లలో జరిగిన ప్రమాదంపై పిఎం, సిఎం, డిప్యూటీ సిఎం, ఐటీ మంత్రి లోకేశ్ వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల హోంమంత్రి అనిత ఎక్స్ వేదికగా స్పందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంస్కరణలతోనే మంచి ఫలితాలు

**విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యారంగంలోను తమ ప్రభుత్వం అత్యుత్తమ సంస్కరణలను తీసుకుని వచ్చిందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఇంటర్‌లోనే ఈ ఏడాది మనం సాధించిన ఫలితాలు ప్రభుత్వ నిర్ణయాలను బలపరుస్తున్నాయన్నారు. ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు గత దశాబ్ద కాలంలోనే ఎన్నడులేనంతగా ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం 69 శాతం ఉత్తీర్ణతతో గతేడాది కంటే 11 శాతం, మొదటి సంవత్సరంలో 47 శాతం ఉత్తీర్ణతతో 9శాతం పెరుగుదల నమోదైందని ఎక్స్‌లో శనివారం పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన ఇంటర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్య వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు మెరుగైన ఫలితాన్ని ఇస్తున్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం , తరగతుల వారీ వాట్సప్ గ్రూపులు, కేంద్రీకృత మదింపు, పర్యవేక్షణ, కేర్‌టేకర్ విధానం తదితరాలు విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించడానికి దోహదం చేశాయి అని పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత పెరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు.. గత పదేళ్లతో పోల్చి చూస్తే ద్వితీయ సంవత్సరంలో ఈసారే అత్యధికంగా 69% మంది పాస్ అయ్యారు. ప్రథమ సంవత్సరం పరంగా 2016లో గరిష్ఠంగా 54% ఉత్తీర్ణులు కాగా 2015లో 47%, ఈసారి కూడా 47% ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరంలో 50314 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 23799 మంది పాస్ అయ్యారు. సెకండియర్‌లో 39783 మందికిగానూ 27276 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉంది. జిల్లాల వారీగా చూస్తే ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 70%,81% ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. హైస్కూల్ ప్లస్ విద్యాసంస్థల్లో ఇంటర్ ఫస్టియర్‌లో కేవలం 34% ఉత్తీర్ణత నమోదైంది.

# హైదరాబాద్ చేరుకున్న డి.సిఎం పవన్

>> వెళ్లనున్నారు. సోమవారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తన కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదం నుంచి బయటపడినందుకు స్వామి వారికి మొక్కులు తీర్చుకోనున్నారు.

**ప్రధాని మోడీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు**

మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచారని, సింగపూర్‌లోని అధికారుల ద్వారా అందించిన సహాయం మరువలేనిదన్నారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్న పవన్, ప్రధాని మోడీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తాను విశాఖ మన్యంలోని అడవితల్లి బాట కార్యాక్రమంలో ఉండగా తనకు ప్రమాద సమాచారం అందిందని, సకాలంలో జోక్యం చేసుకుని తన కుటుంబానికి అపారమైన శక్తిని, ఉపశమనాన్ని కలిగించారంటూ ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

**హిందూ సాంప్రదాయాలు పాటిస్తా:డిక్లరేషన్ ఇచ్చిన డిప్యూటీ సిఎం భార్య**

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భార్య అన్నాలెజినోవా ఆదివారం రాత్రి కుమారుడు మార్క్‌శంకర్‌తో కలసి తిరుమలకు వచ్చారు. గాయత్రి సదన్ విశ్రాంతి భవనం వద్ద డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్ స్వాగతం పలికారు. కాగా ఆమె హిందూ సాంప్రదాయం పాటిస్తూ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. ఆమె తలనీలాలు సమర్పించారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం బారినుండి సురక్షితంగా బయటపడి కోలుకోవడంతో ఆమె ఆపదమొక్కులవాడికి మొక్కులు తీర్చుకునేందుకు చేరుకున్నారు.

# అందరికీ అందుబాటులో ఆధునిక వైద్యం

>> ఎంపిక చేయడం జరిగింది. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా మంగళగిరి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దుతాం, వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై అనేకసార్లు సమీక్షించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే భవన నమూనాలు ఖరారు చేయడం జరిగింది. జోనింగ్, స్టాఫింగ్, మెరుగైన సౌకర్యాలు అందిస్తాం. అమరావతి పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ఆర్థో, డయాలసిస్ సెంటర్ వంటి వాటిని అందుబాటులోకి తీసుకువస్తాం. తలసేమియా, డీ అడిక్షన్ సెంటర్ ను కూడా ఏర్పాటుచేస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా రెండో కేబినెట్ మీటింగ్ లోనే మంగళగిరికి వంద పడకల ఆసుపత్రిని కేటాయించడం జరిగింది.అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల ముందు మంగళగిరి ప్రజలకు ఇచ్చిన హామీలను పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. మంగళగిరి ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగానే మంగళగిరిని అభివృద్ధి చేస్తాం.

**మంగళగిరి అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలి**

మంగళగిరి అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలి. ప్రజలపై కూడా బాధ్యత ఉంది. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలి. మంగళగిరిని చెత్తరహిత నగరంగా నిలపాలి. మంగళగిరిలో వెయ్యి టన్నుల చెత్త బయటపడింది. స్వచ్ఛతలో కూడా మంగళగిరి నెం.1గా ఉండాలంటే ప్రజల సహకారం కావాలి. పారిశుద్ధ్య కార్మికులు కూడా బాగా పనిచేస్తున్నారు. ఏడాది సమయం ఇస్తున్నా. తర్వాత నేనే కర్ర పట్టుకుని తిరుగుతా. ఎవరి ఇంటి ముందైనా చెత్త ఉంటే వారితో పాటు నేను కూడా చెత్త ఎత్తుతా. స్వచ్ఛత, ఆరోగ్యంలో నెం.1గా ఉండాలంటే ప్రజల సహకారం చాలా అవసరం. మంగళగిరి ప్రజలకు డయాబెటిస్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్ చాలా ఎక్కువగా ఉంది. ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌ల ద్వారా ఈ విషయం తెలిసింది. ప్రతిరోజూ వాకింగ్ చేయాలని చెప్పా. పార్క్‌లు కావాలని అడిగారు. ఇటీవల ఎస్ఎల్ఎన్ పార్క్‌ను ప్రారంభించాం. మంగళగిరిలో 30 పార్క్‌లు, చెరువులు అభివృద్ధి చేస్తాం. కల్యాణ మండపాలు నిర్మిస్తాం. వంద పడకల ఆసుపత్రిని ఏడాదిలోగా పూర్తిచేస్తాం. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తాం. భారతదేశానికే ఆదర్శంగా వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దుతాం. మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల. ఆ కలను నెరవేర్చే అవకాశం మనకు వచ్చింది. అందరి సహకారంతో నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, హాస్పిటల్ డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, డాక్టర్ మాగంటి ప్రసాద్, డాక్టర్ రాజు నాయుడు, డాక్టర్ శ్రావణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు

>> శ్రీకాకుళం జిల్లాలో 7 మండలాలు, విజయనగరం 11, పార్వతీపురం మన్యం 10, ఏలూరు జిల్లాలో భీమడోలు, ఎన్టీఆర్ జిల్లాలో జి.కొండూరు మండలాల్లో తీవ్ర వడగాలులు, అలాగే 67 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇకసోమవారం 12 మండలాల్లో తీవ్ర, 19 మండలాల్లో వడగాలులు వీచేందుకు అవకాశం ఉందన్నారు.

ఇప్పటి వరకు కడప జిల్లాలోని అట్లూరులో అత్యధికంగా 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఆ తర్వాత ప్రకాశం జిల్లాలోని గుంటుపల్లిలో 41.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా దొర్నిపాడు, పల్నాడు జిల్లా రావిపాడు 40.9 డిగ్రీలు, నెల్లూరు జిల్లా అయ్యవరెడ్డిపాలెంలో 40.7డిగ్రీలు,, ఏలూరు జిల్లా కామవరపుకోట, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.6 డిగ్రీలు, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 25 ప్రాంతాల్లోనూ 40డిగ్రీలు, పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ వెల్లడించింది.

ఇదే సందర్భంలో ఆగ్నేయ మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాలలో విదర్భ మీదుగా తెలంగాణ మధ్య ప్రాంతాల వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి ఒక ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాం మధ్య ప్రాంతాలు, దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఎలా ఉన్నాయంటే .. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ - యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40-50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది.

మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. రాయలసీమలో ఈరోజు, రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రాగల రెండు రోజుల్లో వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. తరువాత మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశముంది. రాయలసీమలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలో గణనీయమైన మార్పులేదు. తర్వాతి మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పముగా తగ్గే అవకాశముంది.

## వారం - వర్జ్యం

తేది : 14-04-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి ఉ.8.25
స్వాతి రా.12.13
వర్జ్యం ఉ.6.30-8.18
దు.ము.12.34-1.24, 2) మ.3.04-3.54
శుభసమయం : ఉ.9.20-10.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఋణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. ఖర్చులు పెరుగుతాయి.

**కర్కాటకం :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి.ప్రయాణాలు. వస్తుసేకరణ.

**సింహం:** కీలక నిర్ణయాలలో నిర్లక్ష్యం తగదు. ఖర్చులు పెరిగినా అధిగమించి ముందుకుసాగుతారు.

**కన్య :** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తువులు లాభిస్తాయి. వాహనయోగం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. కొత్తకార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఊహించని సంఘటనలు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

**కుంభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**మీనం :** బంధువర్గంతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆరోపణలపై క్రిమినల్ కేసు!

>> టిటిడిని టార్గెట్ చేయడంతోదేవుడు ఆయనను శిక్షిస్తాడని వ్యాఖ్యానించారు. గత పాలకమండలి ఇంజనీరింగ్ విభాగంలో అన్నీ అక్రమాలేనని, ఇప్పటికీ కాంట్రాక్టర్లు మేము కమీషన్లు ఇచ్చాము బిల్లులు రాలేదని చెబుతున్నారని నాయుడు తెలిపారు. తిరుపతిలోని టిటిడి గోశాలలో వందల ఆవులు మృతిచెందాయని, ఈ ఘటన గోప్యంగా ఉంచారని ఇటీవల భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాతో వ్యాఖ్యలు చేయడం పెద్ద సంచలనం కలిగించింది. దీనిపై ఆదివారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర యాదవకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, శాప్స్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, టిడిపి మీడియావిభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, నగరపాలకసంస్థ ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణతో కలసి నిజనిర్ధారణ కమిటీగా ఎస్వీగోశాలను తనిఖీ చేశారు. టిటిడిపై,ఎస్వీగోశాలలో ఆవులు మృతిచెందాయనే అసత్య ఆరోపణలను ఖండించారు. గత ఐదేళ్లలో టిటిడి ధార్మికసంస్థను ధనార్జనసంస్థగా మార్చుకున్నారని ఆరోపించారు.టిటిడిని అప్రతిష్ట చేయడానికి వైఎస్సార్సీ నేతలు పాల్పడటం సిగ్గుచేటన్నారు.కమీషన్ల కోసం భక్తులకు వసతిసౌకర్యంగా ఉన్న భవనాలను కూలదోసిన ఘనత కరుణాకర్‌రెడ్డిదేనన్నారు. గోవుతో రాజకీయం చేయడం మంచిదికాదని హెచ్చరించారు. కల్తీనెయ్యి కేసును మరుగునపెట్టడానికి టిటిడిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని టిటిడిపై, ఎస్వీ గోశాలపై, ఛైర్మన్ బిఆర్‌నాయుడుపై అసత్య ఆరోపణలు చేస్తున్న భూమనపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తనదైన శైలిలో ప్రకటించారు.

# అబద్ధాలతో బురదజల్లితే రాజకీయజీరో అవుతావు

## దైవసంస్థపై ఆరోపణలు చేస్తే ఊరుకోను

### ఎస్వీగోశాల తనిఖీల్లో టిటిడి ఛైర్మన్ నాయుడు





**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన హిందూ ధార్మికసంస్థపై, టిటిడి ఎస్వీగోశాలలో గోవుల సహజమరణాలను సొంత రాజకీయాల కోసం కుట్రలు చేస్తే రాజకీయ జీరో అవుతావని మాజీ ఛైర్మన్,వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీరుపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మండిపడ్డారు. ప్రతిరోజూ అసత్యఆరోపణలు, పచ్చి అబద్దాలతో దైవసంస్థపై బురదజల్లి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే దేవుడు క్షమించడని అన్నారు. తనపై వ్యక్తిగతంగా ఏమైనా ఉంటే ఆరోపించుకోగానీ దైవసంస్థమీద అసత్యఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. తిరుపతి ఎస్వీ గోశాలలో వంద గోవులు మరణించాయని మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆదివారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు గోశాలను తనిఖీ చేశారు. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర యాదవకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, శాప్స్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, టిడిపి మీడియావిభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, నగరపాలకసంస్థ ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణతో నిజనిర్ధారణ కమిటీతో పరిశీలించారు. అక్కడ ఆవులను ,వాటికి అందుతున్న పచ్చిగడ్డి, దాణా, మంచినీరు తదితర వాటిని స్వయంగా గమనించారు. అంతేగాక గడ్డిని ఆవులకు తినిపించారు.ఆవుదూడను చేతిలోకి తీసుకుని రైతుబిడ్డగా నిరూపించారు. తనకు వ్యవసాయం, రైతు కష్టాలు తెలుసునని, గోమాతలను దేవునితో సమానంగా పూజిస్తామని అన్నారు. గోశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, గోవులకు ఎప్పటికప్పుడు దాణా, అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఎక్కడో మృతిచెందిన గోవుల ఫోటోలను,గత పాలనలో గోశాలో మరణించిన గోవుల ఫోటోలను చూపి అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో టిటిడి ఛైర్మన్‌గా ఉన్న ఆయన కాలంచెల్లిన మందులు, పురుగులు పడ్డదాణా పంపిణీచేసినట్లు ఆయన పాలనలో విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఈ సందర్బంగా అప్పటి విజిలెన్స్ నివేదికను, అందుకు సంబంధించిన ఫోటోలును మీడియాకు చూపారు. గోశాలలో గోవుల సహజమరణాలను రాజకీయాల కోసం వాడుకునే కుట్రదారుడు భూమన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు దేవుడంటే భయంలేదని, భక్తిలేక రోజూ ఏదో ఒక అబద్దం మాట్లాడుతున్నారని, టిటిడి సంస్థపై ఏదైనా నిజాలు చెబితే సరిదిద్దుకుంటామన్నారు. తాను టిటిడి ఛైర్మన్ అయ్యాక ఒక్కరూపాయి కూడా అవినీతి మరకలేకుండా ఛైర్మన్‌గా సేవలందిస్తున్నానని బిఆర్‌నాయుడు తెలిపారు. గతంలో కమీషన్ల ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి అపకీర్తి మూటగట్టుకున్నారని విమర్శించారు. గోవులన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయని, వాటికి పౌష్టికాహారమైన దాణా కూడా అందిస్తున్నారని తెలిపారు.

## తిరుమల సమాచారం



# భూమనకు మంచి బుద్ధిని ప్రసాదించుస్వామి

## అవాస్తవాలు ప్రచారంచేస్తే మూల్యం చెల్లించుకోకతప్పదు


### అలిపిరిలో టిడిపి నేతలు గోపూజలు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** దేవుడితో రాజకీయాలు చేస్తున్న గత ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డికి మంచి బుద్దిని ప్రసాదించాలని, అవాస్తవాలు ప్రచారంచేస్తున్న ఆయన తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని టిడిపి నాయకులు హెచ్చరించారు. ఎస్వీగోశాలలో గోవులు మరణించాయని అసత్య ప్రచారంచేసిన ఆయనకు "కరుణ" లేదని, దేవునితో కూడా రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. గోశాలలో ఆవులు మరణించాయనే ఆరోపణలపై తిరుపతి టిడిపి నాయకులు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్‌రమణ, మధుబాబు, రఫీ, ఐఎస్ ఖాజా, లక్ష్మీ, ప్రమోద్‌తో కలసి అలిపిరి పాదాలమండపం వద్దవున్న గోశాలలో గోవులకు పూజలు చేసి నమస్కరించారు. ఆయనకు కరుణామయుడు పూనినట్లు టిటిడిపై అసత్యఆరోపణలు చేసి పాపం మూటగట్టుకున్నాడన్నారు. ఆయనకు మంచి బుద్దిని ప్రసాదించాలని వేడుకున్నారు.

## ఆటోను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

# ముగ్గురు దుర్మరణం:11 మందికి తీవ్ర గాయాలు

### సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి





గాయపడిన వారిని పరామర్శిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

**హిందూపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయిజిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడికొండ శిర జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మందిలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. గుడికి వెళ్లి వస్తున్న పెను ప్రమాదానికి గురైన భక్తులు వివరాలు ఇలా ఉన్నాయి. పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన 14 మంది అపే ఆటోలో హిందూపురం మండలం కొటిపి గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయానికి శనివారం వచ్చి పూజలు, భజనలు నిర్వహించారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వీరంతా ఇక్కడికి వచ్చారు. ఆలయంలోనే రాత్రి నిద్ర చేసి తెల్లవారుజామున దొడగట్ట గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో పరిగి మండలం ధనాపురం గ్రామం పరిసరాల్లోకి రాగానే ఆటోను గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. అత్యంత వేగంగా వచ్చి వాహనం ఢీకొన్నందున ఆటో నుజ్జునుజు అయి పక్కనే కంపచెట్లలో పడిపోగా అందులో ఉన్న 14 మంది చెల్లా చదురుగా పడిపోయారు. అలివేలమ్మ(40), సాకమ్మ(70), వెంకటలక్ష్మ మ్మ(60) లు ఘటనాస్థలిలోనే దుర్మరణం చెందారు. గాయపడిన 11 మందిలో ఏడుగురు పరిస్థితి విషమంగా ఉండగా నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుల వివరాలు అంజన్ రెడ్డి(53), ప్రమీల(43), పాపమ్మ(65), విజయ్(18), బాబు(34), అభినవ్ (14), అనిల్ కుమార్(12),అంజనమ్మ(60), రూప(19), యశ్వంత్ రెడ్డి(20), సుజాత(45) ఉన్నారు. దుర్ఘటన సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు హుటా హుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యల్లో పోలీసులు పాల్గొన్నారు. పరిగి ఎస్ఐ రంగడు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టామని వివరించారు. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్‌కుమార్ పలువురు నాయకులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. అదే విధంగా ఎంపీ పార్థసారథి, ఆర్.డి.ఓ. ఆనంద్ క్షతగాత్రులను పరామర్శించారు. ఘోర రోడ్డు ప్రమాదం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

# శ్రీవారి సేవలో మీనాక్షిచౌదరి



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సినీనటి మీనాక్షిచౌదరి అనుచరులతో కలసి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన మీనాక్షిచౌదరిని అభిమానులు చుట్టుముట్టి సెల్ఫీలకోసం ఎగబడ్డారు. ఇటీవల ఆమె సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో ప్రసిద్ధికెక్కింది. రానున్న రోజుల్లో పలు క్రేజీ ప్రాజెక్టులు ఎదురుచూస్తున్నాయని అన్నారు.

# శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి





**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వ రస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కల గాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక సిజె జస్టిస్ సుజోయ్‌పాల్, మహారాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, గజరాత్ జస్టిస్ మానవేంద్రరాయ్ వేర్వేరుగా తిరుమలకు వచ్చారు. ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శ నంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు.రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులుస్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.



# కుమారుడు మార్క్‌శంకర్‌తో తిరుమలలో అన్నాలెజినోవా

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ భార్య అన్నాలెజినోవా ఆదివారం రాత్రి కుమారుడు మార్క్ శంకర్‌తో కలసి తిరుమలకువచ్చారు. సిం గపూర్ లో జరిగిన అగ్నిప్రమాదం బారినుండి సురక్షితంగా బయటపడి కోలుకోవడంతో ఆమె ఆపద మొక్కులవాడికి మొక్కులు తీర్చుకునేందుకు చేరుకున్నారు. గాయత్రి సదన్ విశ్రాంతి భవనం వద్ద డిప్యూటీ ఇఒహరీంద్రనాథ్ స్వాగతం పలికారు. ఆమె తలనీలాలు సమర్పించుకుని, సోమవారం ఉదయం కుమారుడుతోకలసి శ్రీవారిని దర్శించుకుంటారు. టిటిడిఅధికారులు ఏర్పాట్లు చేశారు.

# ఎంబిబిఎస్ విద్యార్థుల మాల్ ప్రాక్టీస్‌పై విచారణ

**విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దార్థ వైద్య కళాశాలల్లో మళ్ళీ ఎంబీబీఎస్ విద్యార్థుల మాల్ ప్రాక్టీస్ కలకలం రేపింది.ఈ వ్యవహారంపై ఎన్టీఆర్ ఆరోగ్య.వైద్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జనరల్ మెడిసిన్ పరీక్ష రాస్తూ పట్టుబడ్డ ముగ్గురు విద్యార్థులు పట్టుబడ్డారు.నిన్న కుడా కమ్యూనిటీ మెడిసిన్ పరీక్ష రాస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. మాల్ ప్రాక్టీస్ కు పాల్పడిన విద్యార్థులను ఎన్నారై, నిమ్రా కళాశాల విద్యార్థులుగా గుర్తించారు. 160 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా ఇద్దరు పట్టుబడ్డారు. ఇటీవల ఘటనతో యునివర్సిటీ స్పెషల్ స్క్వాడ్‌ను రంగంలోకి దించింది. స్క్వాడ్ తనిఖీల్లో స్లిప్పులతో దొరికిపోయారు. ఇద్దరు విద్యార్థులు, విద్యార్థుల జవాబు పత్రాలను గుర్తింపు కార్డులను ఇన్విజిలెటర్లు స్వాధీనం చేసుకున్నారు. జవాబు పత్రాలను మాల్ ప్రాక్టీస్ కమిటీకి అధికారులు పంపించారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. వరుస మాల్ ప్రాక్టీసు ఘటనలతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో మెడికల్ పరీక్షల్లో స్క్వాడ్,ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసారు.అయితే ఈ వ్యవహారం ఎంబీబీఎస్ పరీక్షల్లో జరగడం రివాజుగా మారింది. ముందుగానే మాట్లాడుకుని విద్యార్దులకు కొన్ని విద్యా సంస్థలు మాల్ ప్రాక్టీస్‌కు ప్రోత్సహిస్తు న్నాయనే అభియోగాలున్నాయి.ఈ వ్యవహారంపై హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సీరియసయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

# భూమనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

## కూటమి నేతలు టిటిడి ఛైర్మన్ నాయుడుకు విజ్ఞప్తి



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో పవిత్రమైన ఎస్వీ గోశాలపై తప్పుడు ఆరోపణలు చేసిన, టిటిడి ప్రతిష్టను దిగజార్చేలా ఫోటో మార్ఫింగ్‌తో అబద్ధపు వ్యాఖ్యలు గుప్పించిన మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని టిడిపి,జనసేన,బిజెపి కూటమి నేతలు కోరారు. ఈమేరకు ఆయనపై క్రిమినల్ కేసుతో బాటు విచారణ చేయించి అరెస్టుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం గోశాలను తనిఖీ చేసిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు కూటమి నేతలు పులివర్తినాని, భానుప్రకాశ్‌రెడ్డి, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, రవినాయుడు, ఆర్‌సి మునికృష్ణ ఈ మేరకు ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన, ఫోటోలు మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేయడం దారుణమని,దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# బాణసంచా ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

## ఘటనపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లా, కోటవురట్లలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అగ్నిప్రమాద సమయంలో కర్మాగారంలో ఎంతమంది కార్మికులు ఉన్నారని, వారి పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందని సీఎం ఆరా తీశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఘటనపై విచారణ చేసి తనకు నివేదించాలని ఆదేశించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. అత్యవసరమైన అన్ని రకాల వైద్య సేవలు బాధితులకు అందేలా చూడాలని, బాధితుల ఆరోసి పరస్థితిని తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

**బాణా సంచా వైద్య ఆరోగ్య శాఖామంత్రి దిగ్భ్రాంతి**

కోటవురట్ల బాణసంచా తయారీ కేంద్రం అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై వైద్య ఆరోగ్య శాఖామంత్రి దిగ్భ్రాంతివ్యక్తం చేసారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్అనకాపల్లి జిల్లా, కోటవురట్లలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలదించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుం టామన్న మంత్రి గాయ పడిన వారిలో ఆందోళనకరంగా ఉన్న ఇద్దరికి యుద్ధ ప్రాతిపదికన చికిత్స అందించాలని ఆదేశించిన మంత్రి అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు బాధితులకందేలా చూడాలన్న మంత్రి సత్యకుమార్ యాదవ్బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని వైద్యాధికారుల్ని ఆదేశించారు.

# గుంటూరులో 11 మంది పోలీస్‌లను సస్పెండ్ చేయడం అరాచకానికి నిదర్శనం: పేర్ని నాని

**విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు కక్షసాధింపులకు ఇచ్చిన ప్రాధాన్యత,వాస్తవాలను గుర్తించడానికి ఇవ్వరని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ఆరోపించారు.మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరులో 11మంది పోలీస్‌లను సస్పెండ్ చేయడం చేస్తూ కూటమి పాలన అర్థం అవుతోందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీసులు ఈ చర్యలు గుర్తించాలని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో అధికారులను వాడుకొని వదిలేయడం సర్వసాధారణమని ఎస్సై, సిఐలు గమనించాలని ఆయన అన్నారు. చంద్రబాబు ఎవరినైనా ఎర వేస్తాడు, ఎవరినైనా బలిచేస్తాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. అధికారి, బంధువు, పోలీస్, కార్యకర్త ఇలా ఎవరైనా చంద్రబాబుకి ఒకటే. కార్యకర్తను మెప్పించడానికి 11 మందికి పనిష్మెంట్ ఇవ్వడం ఏంది? రెడ్ బుక్ చూసో, లోకేష్ మాటలను చూసో చంద్రబాబు మాటలను చూసో ఓవరాక్షన్ చేసేవారు ఉన్నారని ఆయన అన్నారు. దొంగ కేసులు పెట్టడం కొట్టడం తిట్టడం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉండండని ఆయన అన్నారు. ఈ తండ్రి కొడుకులను పవన్ కల్యాణ్ ను నమ్ముకుంటే మీకు ఏ గతి పడుతుందో మనకు పోలీస్‌లను చూస్తే అర్థమవుతుందని ఆయన తెలిపారు. మీరు హుందాతనం మర్చిపోయి. రెడ్ బుక్ రచయిత లోకేష్ ను చూసుకొని అడ్రస్ తెలియని పవన్ కల్యాణ్ చూసుకొని మీరు రెచ్చిపోతే తిప్పలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. కూటమి కార్యక ర్తలు మీరు జెండాలు మోయండి తప్పులేదు. పార్టీకి పనిచేయండి. కానీ మీకు విలువ లేదు, దిక్కులేదని అన్నారు. ఎమ్మెల్యేలు దోచుకునే పనిలో వారు ఉన్నారని అలాగే పవన్ కల్యాణ్ కూడా దోచుకునే పనిలో వారు ఉన్నారని పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు చేసారు.

# గోవుల మృతిపై సుప్రీంకోర్టుకు సుబ్రమణ్యస్వామి

## పిల్ దాఖలుకు కసరత్తు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో ఎంతో పవిత్రంగా నిర్వహిస్తున్న ఎస్వీ గోశాలలో వందల గోవులు మృతి చెందాయని, ఈ ఘటనను గోప్యంగా ఉంచారని వైసిపి నేత,మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలపై నిజానిజాలు కోసం సీనియర్‌న్యాయవాది, మాజీ ఎంపి సుబ్రమణ్యస్వామి సంచలన నిర్ణయం ప్రకటించాడు. గోశాలలో గోవులు ఎన్ని ఎలా మరణించాయనే వాస్తవం తెలియాలని, దీనిపై ఇప్పటికే కూటమి టిడిపి, బిజెపి, వైసిపి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నేపధ్యంలో సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టుకు వెళ్ళనున్నారు. గోవుల మృతి విషయం మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డిద్వారా తెలిసిందని, దీనిపై మరింత సమాచారం సేకరిస్తున్నానని సామాజిక మాధ్యంలో ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ప్రకారం గోసంరక్షణ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పూర్తిసమాచారంతో త్వరలోనే పిల్ దాఖలు చేస్తానని పేర్కొన్నారు.

# బాణసంచా ప్రమాదంపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై వైసిపి అధినేత వైఎస్.జగన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు మరణించడం, మరికొందరు తీవ్రంగా గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. మరణించినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడినవారి కుటుంబాలకు తోడుగా నిలవాలని వైసిపి నాయకులకు సూచించారు.

క్షతగాత్రులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్నిరకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ ఆదేశాలిచ్చారు.

# రేపటి నుంచి ముత్యాలమ్మ జాతర



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంలో శక్తి నిలయాలుగా బాసిల్లుతున్న ఆలయాల్లో ఒకటైన ముత్యాలమ్మ ఆలయంలో సాంప్రదాయపద్ధతుల్లో జాతర ఉత్సవం ఆదివారం రాత్రి చాటింపుతో జాతర ప్రారంభం అయ్యింది. ఈనెల 15వ తేదీన మంగళవారం ఉ.8గం.నుంచి 9గం.వరకు గెరిగ ఉత్సం, మైలముగ్గు, సాయంత్రం శేషపాన్పుముగ్గు, 16న ఉదయం 9గం.లకు పోతురాజు ముగ్గు, మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం, సాయంత్రం 3గం.లకు రేణుకాదేవి ముగ్గు, రాత్రి మహాకుంభం, 17న ఉదయం 8గంటలకు ముత్యాలమ్మ ముగ్గు, గంగపెట్టె ఊరేగింపు, రాత్రి 8గం.లకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. **మైలు ముగ్గులో అమ్మవారి దర్శనం ప్రత్యేకం:** ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని మైలు ముగ్గుగా తీర్చిదిద్దనున్నారు. ఈ మైలుముగ్గుకు విశేష పూజలను సాంప్రదాయపద్ధతుల్లో నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టనున్నారు. అమ్మవారి జాతరను పురస్కరించుకొని స్థానిక మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆలయ ఆవరణంలో పొంగళ్ళు పెట్టి సాంప్రదాయపద్ధతుల్లో మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ఆలయం ఆవరణలో విచ్చేసిన భక్తులకు అంబళ్ళు పంపిణికి ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ నలుమూలల నుండి భక్తజనాలు తరలి వచ్చి అమ్మవారి దివ్య దర్శనాన్ని దర్శించుకొని పూజలు జరిపించుకొనుటకు సన్నాహాలు చేపట్టారు.

# గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ స్వామిసేవకుడే

## భక్తులందరికీ మంచికలగాలి

### మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థానవిద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి అన్నమయ్య కీర్తనలను స్వరపరిచిన భక్తుడని, ఆయన లేని లోటు ఊహించుకోలేనిదని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం అన్నారు. ఆద్యాత్మికభావంతో టిటిడిలో వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పనచేసిన ఘనత ఆయనదేనన్నారు. అన్నమయ్య రచనలను వేల సంఖ్యలో గానం చేసి బాలకృష్ణప్రసాద్ ప్రసిద్దులయ్యారని అన్నారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగయ్యాయని, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత ఎంతో మెరుగుపడ్డాయని భక్తులు ఆనందం వ్యక్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. టిటిడి అధికారులు మరింతగా భక్తుల సేవలో తరించాలని ఆయన సూచించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు, అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

-మహాత్మాగాంధీ

# కాటేస్తున్న కల్తీ పాలు


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో కల్తీ రానురాను పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇదీ అని తేడాలేకుండా మొత్తం కల్తీమయంగా మారిపోతున్నది. మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంత ప్రమాదంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగే వారు,అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాలు తీసుకుంటున్నారు. కానీ కల్తీని నియంత్రించడం అటుంచి రోజురోజుకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవ జీవనానికి సవాల్‌గా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. కొందరు దళారులు, వ్యాపారులు లాభాలకోసం పప్పుదినుసులు, మసాలాలు, నిత్యావసర వస్తువుల సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. గత నెలలో హైదరాబాద్‌లో ఏకంగా కుళ్లిపోయిన మాంసం ఏకంగా క్వింటాళ్ల కొద్దీ అధికారుల దాడుల్లో పట్టుబడ్డాయి. ఈ మాంసం కుళ్లిన వాసన రాకుండా వెనిగర్ లాంటివి చల్లి హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇది ఏనాటి నుంచో జరుగుతున్నట్లు సమాచారం. ఇక పాలల్లో కల్తీ అదుపు లేకుండాపోతున్నది. వాస్తవంగా కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లోనే తీసుకువచ్చినా అమలు విషయం అంతగా పట్టించుకునేవారే లేకుండాపోయారు. భారత్ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. 1947లో వంటనూనెల నియంత్రణ చట్టం 1995లో నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం అన్నింటి కంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇక పాలల్లో కల్తీ ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయిందనే చెప్పొచ్చు. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని తీర్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పాలు, టీ తాగడం అలవాటు కావడంతో వినియోగం పెరుగుతున్నదనే చెప్పొచ్చు. పెరుగు, మజ్జిగా నిత్యం తీసుకోవడంతోపాటు పాలపదార్థాలతో తయారయ్యే స్వీట్లవాడకం కూడా పెరిగిపోతున్నది. 2024లో విడుదలైన గృహవినియోగ వ్యయ సర్వే నివేదిక ప్రకారం పప్పులు, తృణధాన్యాల కంటే ఎక్కువ డబ్బును పాలకోసం ఖర్చు చేస్తున్నారు. కానీ వారు ఆశించిన మేరకు స్వచ్ఛమైన పాలు లభించడంలేదు. ముఖ్యంగా చిక్కగా ఉండే పాలంటే ఇష్టపడుతున్నారనే బలహీనతను సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు భారీ ఎత్తున కల్తీకి పాల్పడుతున్న విషయం తరచుగా బయట పడుతున్నది. గ్లూకోజ్ ద్రావణం, రవ్వ,ఎసిటిక్ ఆసిడ్ వంటివి కలిపి నకిలీ పాలను తయారు చేస్తున్న ముఠా ఒకటి హైదరాబాద్‌లో పట్టుబడింది. ప్రమాదకరమైన మాల్టోడెక్స్‌ట్రిన్, పామాయిల్‌ను పేస్ట్‌లా చేసి పాలల్లో కలిపి అమ్ముకుంటున్న కొందరు దళారులు రాయలసీమ ప్రాంతాల్లో పట్టుబడ్డారు. తెలుగు రాష్ట్రాల్లోనేకాదు రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో అమ్ముతున్న పాలల్లో కూడా కల్తీ భారీగానే జరుగుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కల్తీ పాలతో ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సిన బాలబాలికలు అనేక రుగ్మతలకు గురవుతున్నారనే ఆందోళన వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం ఈ దుర్మార్గాన్ని అణచివేసింది.తగిన మార్గదర్శకాలను దాదాపు దశాబ్ద క్రితమే జారీ చేసింది. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కల్తీ రాయుళ్లకు జైలు శిక్షను ఆరు నెలల నుంచి సంవత్సరానికి పెంచాలని సూచించింది. కల్తీపాలను సేవిస్తే అజీర్తి సమస్యలతో ప్రారంభమయ్యే కడుపు నొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నారు. అంతేకాదు రసాయనికాలతో కూడిన పాలను దీర్ఘకాలం తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశం ఉందని కూడా వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ఇక పాలల్లో చిక్కదనంరావాలని, ఇటీవల కాలంలో ప్రొటీన్‌ను పెంచేందుకు ప్రమాదకరమైన మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి పాలద్వారా చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. ఈదురాఘాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికారగణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నం చేయాలి. అంతేకాదు మామూళ్ల కోసమో, అలక్ష్యంతోనో ఈ కల్తీని నిరోధించడంలో విఫలమవుతున్న అధికారులపై కూడా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్ కామూ

మనిషి జ్ఞానం కోసం అన్వేషించాలి తప్ప జ్ఞానం అతని కోసం అన్వేషించదు.



పాస్కల్

## ప్రజావాక్కు



### అతివేగం ప్రమాదకరం

**అతివేగం,** మద్యంసేవించి వాహనంనడపడం ఇలా ఎన్నో ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. సీసీటీవీ కెమెరాలు,ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటిప్రమాదాలకు సంబంధించిన ఎన్నో వీడియోలు సోషల్ మీడియాలో వేదికగా వైరల్ అవుతున్నాయి.అయినా ప్రజలలో మార్పు రావడంలేదు. ఈ మధ్య కాలంలో యువత బైక్‌లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ప్రమాదాలకుకేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్ర రవాణా శాఖవారు ఎన్ని పెట్టినా వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయు వేగంతో తమ మోటార్ బైక్‌లను నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. సెల్‌ఫోన్‌డ్రైవింగ్,ముగ్గురు, నలుగురుప్రయాణించడం వంటివి సర్వ సాధారణమైపోయాయి.

- సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సుప్రీం తీర్పు

**గవర్నర్‌కు** రాష్ట్రాలకు మధ్యజరుగుతున్న ఘర్షణ పూర్వక వాతావరణంలో సుప్రీమ్‌కోర్టు ఒకతీర్పునుఇచ్చింది. అయితే ఇది ఒంటెద్దు పోకడపోతున్న కేంద్ర ప్రభుత్వానికి షాక్ లాంటిది. తమిళనాడు, ఢిల్లీ,కాశ్మీర్,కేరళ, లాంటి రాష్ట్రాలలో అపరిమితమైన అధికారాలు చేలాయించవచ్చు అని, తామే సర్వం అని భావించి పని చేసిన గవర్నర్‌ల తీరుపై విమర్శలు గుప్పిస్తూనే వారి అధికార పరిమితులను మరొకసారి గుర్తు చేసింది, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే మిన్నఅని తన తీర్పు ద్వారా మరొకసారి రుజువు చేసింది అందుకుతనకుగల అసామ్యమైన అధికరణ142ను వాడుకొని తీర్పును ఇవ్వడం గొప్పతనాన్ని స్ఫూర్తిని చాటింది.

-భారత అవినాష్, జనగామ

### మద్దతు ధర కల్పించాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన కందులు, వేరుశనగ మార్కెట్ యార్డులకు తీసుకు రావడం జరిగింది.రైతులు మార్కెట్ యార్డులలో మద్దతుధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురు చూస్తున్నారు. కానీ సరైన ధరలేదని వాపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి రైతులనుంచి మద్దతుధరకుకొనుగోలు చేసేవిధంగా సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### బస్సులకు అనుమతి ఇవ్వాలి

**హన్మకొండ** జిల్లా నయీమ్ నగర్ పెద్ద మోరీపై ఏడు కోట్లతో నిర్మితమైన బ్రిడ్జి పనులు పూర్తయి ఆటోలు, కార్లు, ప్రైవేట్ వాహనాలు నెలరోజుల నుండి రాకపోకలుసాగిస్తున్నాయి. కానీ అధికారులు ఆర్టీసీ బస్సులను ఈబ్రిడ్జి మీద నుండి నడవకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్ధిపేట, సిరిసిల్ల, కరీంనగర్ వేములవాడకు వెళ్లే బస్సులు వయా ములుగు రోడ్డు పెద్దమ్మ గడ్డ హనుమాన్ నగర్ నుండి వెళ్లడం వల్ల అదనంగా డబ్బులు చెల్లించడంతోపాటు సమయం అంతా వృధా అవుతుంది. బ్రిడ్జి పనులు పూర్తయి అన్ని వాహనాలు నడుస్తుంటే ఆర్టీసీ బస్సులు ఎందుకు అనుమతించడం లేదో అర్థంకావడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నయీమ్ నగర్ బ్రిడ్జి మీద నుండి బస్సులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### పెన్షన్ పెంచండి

**పంతొమ్మిదివందల** యాభైనాలుగు చట్టం పార్లమెంట్ సభ్యులకు జీతాలు పెన్షన్ పెంచుటకు రూపొందించబడినది. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేరాయితీలను పునరుద్ధించుటకుఇప్పటికే రైల్వే టికెట్లలలో ఎక్కువ రాయితీలు కల్పిస్తున్నామనిపలు సందర్భాల్లో తెలియజేస్తున్నారు.ఉద్యోగుల జీతభత్యాలు పెంచుటకు రకరకాల కమిటీలను వేసి వాటి నివేదికలను పరిశీలించి పెంచుట సాధ్యంకాదని తెలియజేస్తుంటారు.కనీసం కరవు భత్యం కూడా సమయానికి ఇవ్వడంలేదు.1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయటంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెన్షన్ సమీక్ష చేసి పెంచుటకు నిర్ణయం తీసుకున్నా 27సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఒక్కసారి కూడా పెన్షన్ పెంపుదల చేయలేదు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

**కరీంనగర్** కార్పొరేషన్‌లోని ఆయా రోడ్లప్రాంతాల్లోఉన్న ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని వాటి స్థానంలో మంచిపూలు, పండ్లమొక్కలు నాటాలన్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటడం బాగుందని, కానీ కోనో కార్పస్ వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

-సింగు. లక్ష్మీనారాయణ చింతకుంట, కొత్తపల్లి, కరీంనగర్

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సాంకేతిక ప్రపంచం సంభ్రమాశ్చర్యం

*ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శతవిధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లను ఎలా వినియోగించుకోవాలో, అలా వినియోగించుకోవడం లేదు. విలాసాలకు, వినోదాలకు, రాజకీయ కార్యకలాపాలకు, శృంగార దృశ్యాల వీక్షణకు, బెట్టింగులకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను, మొబైల్ ఫోన్లను, నిర్మాణాత్మకంగా, సమాజ ప్రగతికి, వ్యక్తి గత అభివృద్ధికి, విద్యకు, ఉపాధికి, ఉన్నతమైన కెరీర్ నిర్మాణానికి సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవచ్చు.*



సుంకవల్లి సత్తిరాజు

చందమామ,బొమ్మరిల్లు కథల పుస్తకాల్లో చదివిన ఊహాత్మకమైన కథలు, కల్పనలు,మన చిన్నతనంలో మన పెద్దలు చెప్పిన విచిత్రమైన కథలు వర్తమానంలో వాస్తవ రూపం ధరిస్తున్నాయి. సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నాయి. వైర్‌లెస్ టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలు మానవాళిని ఒక అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకుపోతున్నాయి.కొన్నిదేశాలకు, కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక సాంకేతిక సేవలు నేడు ప్రపంచమంతా చక్కర్లు కొడుతున్నాయి. సాంకేతిక రంగం అందిస్తున్న పలు సేవలను ఆస్వాదిస్తున్న ప్రజల అనుభవాలను, అనుభూతులను గురించి వర్ణింపశక్యంకాదు. ఒకప్పుడు ఉత్తరాలద్వారా సమాచారం తెలుసుకునేవారు. టెలిఫోన్ ఆవిష్కరణతోకొంత వరకు సమాచార సేకరణ సాధ్యమైనప్పటికీ, అది కూడా పూర్తిగా అందరికీ అందుబాటులో ఉండేదికాదు. ఏది ఏమైనప్పటికీ టెలిఫోన్ ఆవిష్కరణ తర్వాత కాలక్రమంలో కమ్యూనికేషన్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రస్తుత ప్రపంచం డిజిటల్ యుగంలోకి ప్రవేశించింది. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) వేళ్ళూనుకుంటున్నది. డీప్ సేక్ ఎన్ విడియాకు పోటీగా సాంకేతిక విప్లవం సృష్టిస్తున్నది. గ్రోక్ సాంకేతికంగా ఇతర కృత్రిమ మేధస్సు సంబంధించిన సంస్థలకు సవాళ్ల విసురుతున్నది. ఎన్నో యూట్యూబ్ ఛానెల్లు విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఫుడ్ యాప్‌లు,రోడ్డు, రైల్వే, విమాన ప్రయాణాల కోసం ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థకు మొబైల్ ఫోన్లు వినియోగపడుతున్నాయి. ఆర్థిక వ్యవహారాల కోసం బ్యాంకులకు వెళ్ళవలసిన అవసరం లేదు. ఎ.టి.యం కార్డులతో పనిలేదు. బ్యాంకులకు వెళ్లి గంటల తరబడి క్యూలలో నిలబడే అవసరం అంతకంటే లేదు. ఆన్లైన్ ట్రాన్సాక్షన్ల కోసం నెట్ బ్యాంకింగ్, పేటీయం, ఫోన్ పే,గూగూల్ పేలు అందుబాటులోకి వచ్చి, అరక్షణం ఆలస్యం కాకుండా ఆర్థిక వ్యవహారాలు చక్కగా జరిగిపోతున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఫేస్బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, ఎక్స్ మొదలైనవి ప్రపంచాన్ని క్షణాల్లో మన ముందుంచుతున్నాయి. జరిగిన, జరుగుతున్న సంఘటనలపై ప్రపంచ ప్రజల అభిప్రాయాలను పంచుకోవడంలో సామాజిక మాధ్యమాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. నేడు సోషల్ మీడియాను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ. ఇంత బహుళ ప్రాచుర్యం పొందిన సోషల్ మీడియాను సుమారు 59శాతం మంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. 80శాతం పైగా అమెరికన్లు సాంఘిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారు. చైనాలో 100కోట్లమంది సోషల్ మీడియా యూజర్లున్నారు. చైనాలో ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య మిలియన్ల సంఖ్యలో ఉంది. అయితే ఇతర దేశాల్లో దీని వినియోగం ఎంతో అధికం. సోషల్ మీడియా ప్లాట్ ఫాం వ్యాపారాభివృద్ధి కోసం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం, ఉపాధి అవకాశాల కోసం, కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కోసం ఉపయోగపడుతున్నది. తమ ప్రతిభ కేవలం నాలుగు గోడల మధ్య నలిగిపోకుండా ప్రపంచానికి పరిచయం చేయడం కోసం చాలామంది సాంఘిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ధనార్జన చేస్తున్న వారు కోకొల్లలు. అవకాశాల కోసం ఎదురు చూసే వారికి సోషల్ మీడియా ఒక కొంగుబంగారం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు ప్రతీ రోజు సగటున సుమారు 2 గంటల సమయం వెచ్చిస్తున్నాడు. ప్రతీనెలలో సుమారు 70 గంటల సమయాన్ని సోషల్ మీడియాయాప్స్ కోసం వినియో




గిస్తున్నారు. 448కోట్ల జనాభా అనగా ప్రపంచ జనాభాలో సుమారు 55శాతంమంది ప్రజలు సోషల్ మీడియా ఎక్కౌంట్లు కలిగిఉన్నారు. ప్రతీరోజు బిలియన్ల సంఖ్యలో ప్రపంచంలోని పలువురితో ఆత్మీయంగా కలిసే అవకాశం సోషల్ మీడియా సుసాధ్యం చేస్తున్నది. యాపిల్ ఐ ఫోన్ సోషల్ మీడియా జాతకాన్ని ఓ మలుపుతిప్పింది. ఇప్పుడు దాదాపు అన్నిబ్రాండెడ్ ఫోన్లలో వివిధ అప్లికేషన్లు యూజర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ ద్వారా లభిస్తున్న రెవిన్యూలో సగానికిపైగా ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్ లదే. యు.ఎస్‌లో ఫేస్‌బుక్ తర్వాత స్థానం ఇన్‌స్టాగ్రాందే. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూ ట్యూబ్, టిక్‌టాక్, వాట్సప్,స్నాప్‌చాట్, ట్విట్టర్, పిన్ టెరెస్ట్,లింక్‌డ్ ఇన్‌లు బాగాప్రాచుర్యం పొందాయి. ఎవరికి వారు సోషల్ మీడియా సామ్రాజ్యానికి రారాజుల్లా వెలిగిపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలను సృష్టించి, తమ వ్యాపారాలను బిలియన్ల కోట్ల డాలర్లకు పెంచేసుకుంటూ కుబేరులుగా మారిపోయిన వారిని ఊహించుకుంటూ, మన సమయాన్ని వృథా చేస్తున్నాం. జి.బి.ల కొద్దీ డేటాను కొనుగోలు చేసి, అవసరం లేకున్నా మన ఖర్చులను పెంచేసుకుంటున్నాం. ఒకప్పుడు కారు చౌకగా లభించిన మొబైల్ డేటా నేడు విపరీతంగా పెరిగింది. అపరిమితమైన వాయిస్ కాల్స్ నేడుఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి.సెల్‌ఫోన్ ఖర్చులు సామాన్య ఫోన్ వినియోగదారులకు, స్మార్ట్‌ఫోన్ వినియోగ దారుల జేబులకు చిల్లుపెడుతున్నాయి.దూరాన్ని దగ్గర చేసి, టెక్నాలజీ సహాయంతో ప్రపంచాన్ని మన చెంతకు చేర్చి, మన అభిప్రాయాలను, మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన ఆచార వ్యవహారాలను మిగతా ప్రపంచానికి తెలియ చేసే దగ్గర దారి సోషల్ మీడియా.సాంఘిక మాధ్యమాలను వినియోగించడానికి మనకొక ఎలక్ట్రానిక్ పరికరం అవసరం. అది కంప్యూటర్ కావచ్చు. ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కావచ్చు లేక ట్యాబ్,మొబైల్ కావచ్చు.ఏదిఏమైనా నేటి కాలానికి అత్యంత సౌకర్యవంతమైన సాంకేతిక సాధనంగా మొబైల్ జన హృదయాలను దోచుకుని, మనల్ని ఒక అద్భుతమైన ప్రపంచానికి తీసుకుపోయింది.ఈ సంవత్సరం ప్రారంభానికి ప్రపంచంలో 5.5 బిలియన్ల మంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఒక అంచనా. ఇది ప్రపంచ జనాభాలో 64శాతంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శతవిధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లను ఎలా వినియోగించుకోవాలో, అలా వినియోగించుకోవడం లేదు.విలాసాలకు, వినోదాలకు, రాజకీయ కార్యకలాపాలకు, శృంగారదృశ్యాల వీక్షణకు, బెట్టింగులకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను, మొబైల్ ఫోన్లను, నిర్మాణాత్మకంగా, సమాజ ప్రగతికి, వ్యక్తిగత అభివృద్ధికి, విద్యకు, ఉపాధికి,ఉన్నతమైన కెరీర్ నిర్మాణానికి సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవచ్చు. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్న నేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టకమానవు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్ళకు కాసుల పంటగా మారింది. కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విద్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్‌చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి,డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాలపేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధరకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటియం పిన్ చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయమాటలు చెప్పడం, కెవైసి అప్ డేట్ కోసమంటూ ఓటిపి అడగడం, మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం,వాట్సాప్‌లలోలింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వలన లాభాల కంటే నష్టాలే అధికమని చెప్పక తప్పదు.భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మనిషిని మనిషిగా కాకుండా మరమనిషిగా మార్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు కళ్ళు తెరవాలి. మనిషిని మానసికంగా నాశనం చేసి, మరమనిషిగా తయారు చేస్తున్న సాంకేతిక పరమైన ఆవిష్కరణల విషయంలో జాగరూకత వహించాలి. ●

# ఆర్థిక వనరుల సమీకరణకు ఏది దారి?

గుర్రం రాంమోహన్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక వనరులు సమీకరణకు దారి కన్పించడంలేదు. ఎన్ని మార్గాలు అన్వేషించినప్పటికి మార్గాలు దొరకడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పీకల లోతు కష్టాలు ఎదుర్కొంటోంది.రూపాయి, రూపాయి ఒడిసి పట్టుకొని ఆర్థిక వనరులు ఖర్చుచేసినప్పటికీ నెల వచ్చేసరికి ఖజాన పెట్టె ఖాళీ ఏర్పడుతోంది.అప్పులు కట్టేందుకు మళ్ళీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఖర్చులు గణీయంగా తగ్గించుకున్నప్పటికీ, ఖజానాలో మిగులు కన్పించేపరిస్థితిలేదు.సంక్షేమ పథకాల అమలు కోసం, అప్పులకు వడ్డీ కట్టేందుకు ప్రభుత్వంకు అప్పులు తప్ప వేరేమార్గం కన్పించడంలేదు. వచ్చే ఆదాయం, ఖర్చులకు వ్యత్యాసం భారీగా ఉంటుంది. మార్కెట్లో అప్పులు పుట్టడంలేదు. అప్పులు ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం రథసారధి స్వయంగా ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టపరిస్థితి ఉందో విశిదమోతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి నెలనెల వచ్చే 18 వేల కోట్ల రూపాయలు వస్తోంది. ఖర్చు మాత్రం అధికంగా అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి నెలనెలకు 25వేల కోట్లనుంచి 30వేల కోట్లకు పైగా ఆదాయం వస్తే తప్ప ప్రభుత్వాన్ని నడిపించే పరిస్థితి లేదు. ప్రభుత్వం అబ్కారిశాఖ, రిజిస్ట్రేషన్స్ స్టాంపు శాఖ, వాణిజ్య పన్నులశాఖ, రవాణశాఖ నుంచి మాత్రమే ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వానికి వస్తున్న 18వేల కోట్ల ఆదాయంలో అప్పులకు వడ్డీ రూపేణ నెలనెల 6వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు నెలనెల 6వేల కోట్లు అంటే ఇక్కడే 12 వేల కోట్ల రూపాయలుపోతుంది. మిగిలిన 6 వేల కోట్ల రూపాయలు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్, ఇతర సంక్షేమ పథకాల కోసం, నీటి పారుదల, విద్యా, వైద్యం, పంచాయతిరాజ్, రోడ్ల భవనాల శాఖ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుఅవుతుంది. గత ప్రభుత్వం 7లక్షల 50వేల కోట్ల రూపాయలు అప్పులు




తేవడం వల్ల అప్పులు పెరిగాయని వడ్డీ భారం అధికంగా పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలకాలం వరకు దాదాపు ఒక లక్ష 52వేల కోట్లు తెచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తెచ్చిన అప్పుల్లో 80 వేల కోట్ల రూపాయలు అప్పులకు వడ్డీ చెల్లించగా, మిగత 72వేల కోట్ల రూపాయలు వివిధ ప్రభుత్వ పథకాలకు ఖర్చుచేసింది. నాలుగు శాఖల్లో అధిక ఆదాయం అబ్కారి శాఖ నుంచి వస్తోంది. రమారమి 36 వేల కోట్లనుంచి 40వేల కోట్ల రూపాయలు అబ్కారి నుంచి ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. భూముల క్రయ, విక్రయాలు తగ్గిపోవడం, రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడంతోపాటు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ 6వేలకోట్ల రూపాయలు తగ్గిపోయాయి. విద్యార్థులకు ఫీజు రియాంబర్స్మెంట్ క్రింద 5వేల కోట్లు రైతు భరోసా, రైతు రుణమాఫి క్రింద ఇంకా రైతులకు చెలించాల్సివుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల 1000 మందికి పైగా పదవి విరమణ పొందుతున్నారు. ఉద్యోగులకు 8వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సిఉంది. వేతన సవరణ, డి.ఎ.లు చెల్లించాలంటే వేలకోట్ల రూపాయలు కావాల్సిఉంటుంది. రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తోంది. ప్రతిరోజు రోడ్డు రవాణ సంస్థకు 14 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుండగా ఉచిత బస్సుప్రయాణంవల్ల ఆర్.టి.సి.కి ప్రతిరోజు 4కోట్ల రూపాయలు ఆదాయం వస్తోంది. ఆర్.టి.సికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు 300కోట్ల రూపాయలు అంటే ఇప్పటివరకు దాదాపు 4వేల కోట్లరూపాయలు చెల్లించడంతో భారంగా మారింది.3లక్షల కోట్ల రూపాయలు భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికి ఆదాయ మార్గం మాత్రం కన్పించడంలేదు. ఆదాయం లేకపోవడంవల్ల కేటాయింపులు,వ్యయంలో సైతం వ్యత్యాసం కనిపిస్తోంది. ఆదాయం సమాకూర్చుకోవడానికి అన్నిమార్గాలను ప్రభుత్వంసీరియస్‌గా అన్వేషించినప్పటికి ద్వారాలు కన్పించడంలేదు.భూములు విక్రయించడం,లీజుకు ఇవ్వడం,అప్పులు తెచ్చుకోవడం ప్రభుత్వానికి అనివార్యమైంది.గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలంవేసి వనరులు సమీకరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించగా,ఆదిలోనే హంసపాదంఅన్నట్టుగా అవరోధాలు ఎదురవుతున్నాయి. ఆదాయ మార్గాలు కన్పించడంలేదు.ఎన్నిమార్గాల్లో ప్రయత్నించినా ఆదాయంలేక ప్రభుత్వానికి వనరులసేకరణ గుదిబండగా మారింది. ●

# మాటల్లోనే మహిళా రక్షణ!



నాదెండ్ల శ్రీనివాస్

మహిళలపై జరుగుతోన్న హింస ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఎత్తున సాగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన అంటోంది ఐక్యరాజ్య సమితి. ప్రతి పదకొండు నిమిషాలకు ఓ మహిళ లేదా బాలిక మరణంఆమె సన్నిహితుల చేతుల్లోనే జరుగుతోం దంటున్నాయి ఐరాస నివేదికలు. మహిళలపై అనేక రూపాలలో జరిగే హింసలో అంతగా చర్చకు రానిది మాతృత్వ హింస. భారతదేశంలో అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. దీనివల్ల గౌరవప్రదమైన మాతృత్వహక్కు ప్రమా దంలో పడుతున్నది. మద్రాసు ఐఐటి జరిపిన ఒక పరిశో ధన ప్రకారం (ప్రైవేట్ ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు 40.9శాతం నుండి 47.4శాతానికి 6.6 శాతం పెరిగాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అసోం, ఒడిశా, తెలంగాణ,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని (ప్రైవేట్ అనుపత్రు లలో ఇవి 70శాతాన్ని మించిపోయాయి. సిజేరియన్ ప్రాణ రక్షక చికిత్సకానీ అనవసరపు సిజేరియన్ వల్ల తల్లీబిడ్డలకు పలు సమస్యలు ఎదురవుతాయి. రక్తం కోల్పోవడం, ఇన్ఫె క్షన్, కోలుకోవడానికి ఎక్కువ రోజులు పట్టడం, బిడ్డలకు పాలివ్వడంలో ఆలస్యం, తరువాతి గర్భధారణలో సమస్యలు వంటివి. ప్రతి వైద్యశాలలో గత సంవత్సరం సిజేరియన్ ప్రసవాల శాతాన్ని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధన విధిస్తే ఈ అంశంపై గర్భవతి విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకొనే అవకాశం కలుగుతుంది. అయితే మహిళలపై భౌతికంగానే కాదు ఆన్లైన్లోనూ వేధింపులు పెరుగుతున్నాయి. కట్టుబొట్టూ నడత అన్నింటినీ జడ్జ్‌చేస్తూ ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ తరహా వేధింపులు స్త్రీలను మానసికంగా కుంగదీస్తూ, కొన్నిసార్లు చావుఅంచుల వరకూ తీసుకెళ్తున్నాయి. కృత్రిమ మేధస్సు(ఎఐ)ను కూడా మహిళలను వేధించేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. ఇందుకు డీప్ ఫేక్‌ట్రెండ్ ఒక ఉదాహరణ.నగ్నచిత్రాలతో వేధింపులు ఎక్కువ కావటం వల్ల మహిళలు,ముఖ్యంగా బాలికలు,ఆత్మహత్య



చేసుకుంటున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. భారతదేశంలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఆర్థిక నేరాలతోపాటు నగ్నచిత్ర వేధింపులపై కూడా మరింత దృష్టి పెట్టాలి. సోషల్ మీడియాను ఒక సాధనంగా వాడుకుంటూ మహిళలను రాజకీయాల నుంచి దూరం చేయాలనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.అజ్ఞాతంగా కామెంట్ చేయగలిగే అవకాశం ఉండటంతో, ట్రోలర్లు ధైర్యంగా ఎలాపడితే అలా రాస్తున్నారు. మహిళల గురించి రాసేప్పుడు ఈధైర్యం ఇంకా ఎక్కువ ప్రదర్శిస్తున్నారు.కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో యువత తమ జీవిత భాగస్వామిని స్వేచ్ఛగాఎంపిక చేసుకునే హక్కును హరించారు. కులం లేదా ఆస్తి కారణంగా ప్రేమ వివాహాల విషయంలో మోసం చేసినా నేరంగా పరిగణించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.లవ్ జిహాద్ పేరిట మతాంతర వివాహాలపై కేసులు నమోదుచేసి జైలుకు పంపుతున్నారు. ఉత్తరప్రదేశ్తోపాటు దేశంలో,మన రాష్ట్రంలో కూడా పరువు హత్యలు పెరిగాయి. కుల,మత ఉన్మాదాలు వ్యాప్తి చెందుతున్నాయి. స్త్రీలపై అత్యాచారాలు, హింస పెరుగుతున్నాయి. దాంతో ఆడపిల్లల చదువుకు, ఉపాధికి ఆటంకాలు వస్తున్నాయి. యునెస్కో ప్రకారం ఆడపిల్లలు చదువును మానేయడానికి ముఖ్యమైన కారణం హింస అనిచెప్పింది. ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యావ్యవస్థ, భద్రత అవసరం.స్త్రీలపై ఆధిపత్యం కుటుంబ హింసను పెంచుతోంది. ఫలితంగా స్త్రీలు హింసకు గురవుతున్నారు. పైగా కుటుంబ నిర్వహణ భారం కూడా మహిళలపైనే పడుతోంది.దానితో వారుఅప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇక చట్టాల విషయానికి వస్తే సెక్సువల్ అఫన్సివ్ యాక్ట్ 2012, క్రిమినల్ లా అమెండ్ మెంట్ యాక్ట్2013, నిర్భయ చట్టం2013,పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, లైంగిక నేరాల నుంచి బాలలకు రక్షణ చట్టం 2012, బాల్య వివాహ నిరోధక చట్టం 2006, ఇలా ఎన్నోచట్టాలు.అయితే ఇవన్నీ ఎంతవరకు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయన్నది ప్రశ్నార్థకమే. మన రాజ్యాంగం మత విశ్వాసాల ఆధారంగానే స్త్రీలకు పర్సనల్ లా హక్కులు కల్పించింది. పితృస్వామ్యం, మతం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి రూపంలో మహిళల పట్ల అమలవుతున్న వివక్షనుకాదని స్త్రీలకు సమానత్వ హక్కులను కల్పించలేకపోయింది. వీటన్నిటికీ లోబడే చట్టాల రూపకల్పన జరుగుతోంది. అందుకనే గృహహింస నుండి రక్షణ చట్టం మొదలు నిర్భయ చట్టం దాకా ఎన్ని చట్టాలు చేసినా వివక్షను తొలగించలేకపోతున్నాయి. ●

## నేడు పొన్నేకల్లులో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు: సిఎం చంద్రబాబు రాక






సోమవారం సిఎం పర్యటన సందర్భంగా తాడికొండ మండలం పొన్నేకల్లు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు తదితరులు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## తిరుమలేశునికి మొక్కులు చెల్లించుకున్న డిప్యూటీ సిఎం సతీమణి అనా కొణిదెల

**గుంటూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామికి డిప్యూటీ సిఎం సతీమణి అనా కొణిదెల తన మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆమె టిటిడి నిబంధనల ప్రకారం డిక్లరేషన్ పత్రాలపై సంతకాలుచేశారు. ఇటీవల సింగపూర్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం నుంచి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దంపతుల కుమారుడు మార్క్





ఆదివారం సాయంత్రం గాయత్రి సదనంలో టిటిటి ఉద్యోగుల సమక్షంలో డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేస్తున్న డిప్యూటీ సిఎం సతీమణి కొణిదెల అనా .స్వామివారికి తలనీలాలు సమర్పించిన అనా కొణిదెల

శంకర్ ప్రాణాలతో భయటపడ్డారు. తమ బిడ్డకు దైవ కృపతో పునర్జన్మ లభించినట్లయిందని ఈసందర్భంగా కలియుగ దైవం వెంకటేశ్వరుడిని అన్నా కొణిదెల మొక్కుకున్నారు. శనివారం అర్ధరాత్రి సింగపూర్ నుంచి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, అన్నా దంపతులు తమ బిడ్డను తీసుకుని హైదరాబాద్‌కు చేరుకున్నారు. శ్రీవారి మొక్కులు చెల్లించుకునేందుకు అన్నా కొణిదెల తిరుమలకు చేరుకున్నారు. అనంతరం శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. పద్మావతి కళ్యాణ కట్టకు చేరుకుని అక్కడి భక్తులందరితోపాటు తలనీలాలు సమర్పించారు.

**సోమవారం తెల్లవారుజామున..శ్రీవారి దర్శనం:**

సోమవారం వేకువజామున శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోనున్నారు. సుప్రభాత సమయంలో స్వామివారిని అన్నా కొణిదెల దర్శించుకోనున్నారు.

## ఈదురు గాలులకు ఉక్కిరి బిక్కిరి అయిన ఉద్యాన పంటలు

### ..రాలిపోతున్న పూత..దిగుబడి తగ్గుతుందంటున్న రైతులు

యద్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : మొన్న చిగురించిన మొక్కలు..నిన్న పూత రాలటం..అకాల వరా ్షనికి..ఇలా రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతోంది మండల రైతాంగంపై ప్రకృతి చూపుతున్న పరిస్దితి. ముఖ్యంగా ఉద్యాన పంటలకు సంబంధించిన రైతుల పరిస్దితి గోటిచుట్టుపై రోకటి పోటులా మారింది. మండల పరిధిలోని అయా గ్రామాలలో సాగులో ఉన్న మామిడి, అరటి, మునగ తోటలు విధిలేని పరిస్థితులలో అప్పులు చేసిమరీ పంటలు సాగుచేసుకున్న రైతులపై ప్రకృతి కన్నెర్ర చేస్తుంది.









ఉద్యాన పంటలైన మునగ పైరును మండల పరిధిలోని కొత్తపాలెం, కొండవీడు, చెంఘీస్కాన్‌పేట, బోయపాలెం గ్రామాలలో సాగు చేస్తున్నారు. సరిఅయిన ఎదుగుదల లేక గిడసబారిపోతూ సరిఅయిన పూత రాక అంతంత మాత్రంగా పెరుగుతున్న మునగ పైర్లు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. క్రమేణా ముదురుతున్న ఎండలకు వున్నటువంటి ఒకటి అర పూతసైతం రాలిపోతుందని, దీనికి తోడు అకాల వర్షంతో పూత రాలిపోతుందని అయా గ్రామాల్లోని రైతులు వాపోతున్నారు. గత ఏడాది ఈపాటికే ఎంతో కొంత కాయలు చేతికి రావటంతో వాటిని అమ్ముకుంటూ కూలీలకు చెల్లించు కుంటూ కాలం వెళ్ళబుచ్చామని, నేడు పరిస్దితి భిన్నంగా ఉన్నదని తొలికోతలు కూడా రాలేదని, దీనివల్ల కూలీలకు కూడా చెల్లించటం కష్టంగా తయారు అయిందని, ఎకరాకు 18నుండి20వేల రూపాయలు కౌలు చెల్లించటం జరిగిందని, ఇతర వ్యవసాయానికి, పురుగు మందులకు, ఎరువులకు సుమారు 45వేల రూపాయలు అవుతున్నాయని, దీనికి తోడు సకాలంలో విద్యుత్ లేక నీరు అందించలేక పోవటంతో వడలి పోతున్న తరుణంలో ఇప్పుడు అకాల వర్షం, ఈ ఏడాది ముందుగానే ఎండలు ఎక్కువగా ఉండటంతో మొక్కలకు మరింత ఇబ్బందిగా ఉన్నదని వారంటున్నారు. గత ఏడాదిలాగా కూడా ఉండకపోవటంతో పూర్తిగా అప్పులఊబిలోకి కూరుకు పోతున్నామని, ఏమిచేయాలో తోచటం లేదని వారంటున్నారు. మార్చి మెదటి వారంలో విపరీతంగా విరగ బూసిన పూత సమయంలో అకాలంగా కురిసిన వర్షాలకు పూత అంతారాలిపోతుందని, మిగిలిన కొంత భాగంకు బూజు తెగులు, పురుగులు వ్యాప్తి అధికమై దిగుబడి అశాజనకంగా లేదని మామిడి రైతులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని యద్లపాడు, వంకాయలపాడు, కొండవీడు, కొత్తపాలెం, సంగం గ్రామాలలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ ప్రాంతములో అధికంగా బంగిన పల్లి, పెద్దరసాలు, మామూలు నాటు రకాలను సాగుచేస్తున్నారు. అయితే ఎక్కువ భాగం కౌలు రైతులు తోటలను కౌలుకు తీసుకొని ఫలసాయాన్ని అమ్ముకోవటం చేస్తున్నారు. వీరు కాపునుబట్టి ఒక్కొక్క చెట్టు 18వేల నుండి 25వేల రూపాయలు వరకు కౌలు కట్టవలసి ఉంటుందని, గత సంవత్సరం కంటే ఈ ఏడాది అధికంగా కౌలు చెల్లించటం జరుగుతుందని, గత సంవత్సరం దిగుబడి లేక అప్పులలో చిక్కుకున్నామని, నేడు అదే విధంగా తయారు అవుతుందని అంటున్నారు. కాసిన అరకొర కాయలు మాత్రం మచ్చ తెగులు అధికంగా కనిపిస్తుందని, దీనివలన కాయలు పూర్తిస్థాయిలో పాకానికి రాకముందే రాలిపోతుయాయని అంటున్నారు. మండల పరిధిలోని కొత్తపాలెం, కొండవీడు, కోట గ్రామాలల్లో అరటిని గత కొంత కాలం నుండి పండిస్తున్నారు. సకాలంలో వర్షాలులేక, సమయానికి విద్యుత్ సరఫరాకాక, పొలాలకు నీరు అందించలేక పోతున్నామని దీనివలన దిగుబడులు పూర్తిగా అంతంత మాత్రంగా ఉన్నప్పటికి ఒక మోస్తరు ధర అశాజనకంగా ఉండటం కొంత ఊరటచెందుతున్నా మంటున్నారు రైతులు. ఎకరాకు 50నుండి60వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండిస్తున్నప్పటికి గెలలు పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చే సమయంలో సకాలంలో నీరు అందించలేకపోతున్నామని, దానితో కొన్ని గెలలు పక్వానికి రాకపోవటం ధరలు నామమాత్రముగా పలకటంతో నట్టేట మునుగుతున్నా మంటున్నారు. ఒక ప్రక్క ఎరువులు, పురుగు మందులు ధరలు అకాశాన్ని అంటుతున్నాయని, కాని అరుంగాలం కష్టపడి చెమటోర్చి పంటలు పండిస్తున్నా కనీసం పెట్టుబడులు కూడా రావటం లేదని, ఇప్పుడు ఈదురుగాలులకు తోటలు దెబ్బతిన్నాయని, అవి మరలా అదునులోకి వచ్చేసరికి మళ్ళీ శ్రమించాలని అంటున్నారు. ఏది ఎమైనా ఈదురుగాలులకు అరటి, మామిడి, మునగ రైతులకు ఇబ్బందులు తెచ్చింది.


# అమరావతి వార్త



## నేడు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు: డిఆర్వో

గుంటూరు,ఏప్రిల్ 13, ప్రభాతవార్త ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న (సోమవారం) ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగదని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌ఎస్‌కె ఖాజావలి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పేర్కొన్నారు.

## ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు



యద్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, తేలికపాటి వర్షంతో అదివారం సాయంత్రం భీభత్సం సృష్టించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా ఉదయం నుండి తీవ్ర వేడిగాలులు వీచి చివరికి సాయంత్ర సమయానికి ఒక్కసారిగా వాతావరణం మారి భీభత్సం జరిగింది. దీని కారణంగా మండల పరిధిలోని బోయపాలెం నుండి సంగం గోపాలపురం వెళ్ళే మార్గంలో పెద్ద చెట్లు సైతం గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి.





**100 పడకల ఆసుపత్రికి మంత్రి లోకేష్ శంకుస్థాపన:** మంగళగిరి మండలం చినకాకాని వద్ద 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఆదివారం శంకస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్, చిత్రంలో గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

## త్వరలో రూ.300కోట్లతో మహానాడు కాలనీ రిటైనింగ్ వాల్ పనులు

### --మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

తాడేపల్లి,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : మహానాడు ప్రాంతంలో వరద ముంపు నివారణకు రూ.300కోట్లతో రిటైనింగ్ వాల్ మంజూరైందని,పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర విద్య,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొనా ్నరు.యర్రబాలెం డాన్ బోస్కో స్కూల్ ఆవరణలో మన ఇల్లు-మన లోకేష్ 5వ రోజు మహానాడు కాలనీ వాసులకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొని మాట్లాడుతూ మంగళగిరి ప్రజల దశాబ్దాల కల



వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసి ఇక్కడకు వచ్చా కేబినెట్ మీటింగ్‌లో నేను ప్రతిపాదించినప్పుడు రాష్ట్రంలోని 175నియోజకవర్గాల్లో వంద పడకల ఆస ్పత్రులు నిరి ్మంచాలని సిఎం చంద్రబాబు చెప్పారు.ఈరోజు మంగళగిరిలో చేసే ప్రతిపని రేపు రాష్ట్రమంతటా అమలవుతోంది.భూగర్భ డ్రైనేజీ,గ్యాస్,విద్యుత్ కోసం ప్రత్యేక ప్రాజెక్టు మంజూరైంది.జూన్ నెల నుంచి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం.

**--రెండు వారాల్లో పట్టాలకు రిజిస్ట్రేషన్ ..**

ఏడాది పూర్తయ్యే లోపు 3వేల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పట్టాలు అందజేస్తుంది.వెయ్యికోట్ల ఆస్తి ఇచ్చాం,రెండు వారాల్లో పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తాం,రెండేళ్ళలో అమ్ముకునే హక్కు కల్పిస్తాం,పిల్లలు ఆడుకునేందుకు పార్కులు,చెరువులు అభివృద్ధి చేస్తున్నాం,లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాం,ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చేందుకు పద్దతి ప్రకారం ముందుకు వెళ్తున్నాం.త్వరలో రాజధాని పనులు మొదలవుతున్నాయి.

**--లోకేష్ ఎమ్మెల్యే కావడం మంగళగిరి ప్రజల అదృష్టం ...**

--రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ...నారా లోకేష్ రాబోకే తరాలకు దికూ ్సచిగా నిలిచే గొప్ప నాయకుడు,పండుగ వాతావరణంలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.నాయకుడికి సేవ చేయాలనే చిత్తశుద్ధి,తపన అవసరం,జిఓ నెం 30 రావడానికి కారణం లోకేష్,డిసెంబర్ 24న రెగ్యులరైజేషన్ ప్రతిపాదన ఇచ్చారు.ఎటువంటి ఫీజులు లేకుండా పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు.మంగళగిరికే గాక రాష్ట్రానికి మార్గదర్శకులయ్యారు.లోకేష్ లాంటి నాయకుడు ఎమ్మెల్యే కావడం మంగళగిరి ప్రజల అదృష్టం,ప్రతి రాజకీయ నాయకుడిలో కుటుంబ సభ్యుడిని చూశారు.తప్పుచేసిన వారు సొంతపార్టీ వారైనా శిక్షించాలని నిర్ణయించిన ఆదర్శ నాయకుడు చంద్రబాబు,లోకేష్ అని అనగాని సత్య ప్రసాద్ ప్రశంసించారు.

## సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు... వివాహిత మృతి



మృతిచెందిన సిఫారా (ఫైల్)

నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేయడంతో మండలంలోని పమిడిమర్రు గ్రామానికి చెందిన మురికిపూడి సిఫారా ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిపై భర్త రాజేష్, ప్రజా సంఘాల నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుల నిర్లక్ష్యం వలనే సిఫారా కనుమూసిందని వారు ఆరోపించారు. తనకు సంబంధించిన అభ్యంతరకరమైన ఫోటోలు, వీడియోలు అదే గ్రామానికి చెందిన గోరంట్ల నాగరాజు అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగిందని రూరల్ పోలీసులకు మృతురాలు ఫిర్యాదు





మాట్లాడుతున్న రూరల్ సి.ఐ. మల్లికార్జున . పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం



నిందితుడు నాగరాజు

చేసింది. ప్రేమ పేరుతో తన వెంటపడి వేధించి తనను మానసికంగా నాగరాజు, అతని స్నేహితురాలు వేధించారని పోలీసులకు తన ఫిర్యాదులో వివరించారు. అయితే రూరల్ ఎస్.ఐ.లు చల్లా కిషోర్, అశోక్‌లు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. పైగా మృతురాలి వద్ద నుండి తన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నట్లు సంతకం చేయించుకోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలోనే ఆందోళనకు గురైన సిఫారా పురుగుమందు సేవించి బలవన్మరణానికి పాల్పడింది. కేవలం పోలీసుల నిర్లక్ష్య వైఖరి, నిందితులు నాగరాజు, అతని స్నేహితురాలు మొగిలి పార్వతీని వదిలివేసి ఫిర్యాదు చేసిన కుటుంబాన్ని పోలీసులు వేధించారని కుల నిర్మూలన పోరాటసమితి నాయకులు కృష్ణ ఆరోపించారు. ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ సెక్షన్ కూడా నమోదు చేయలేదన్నారు. పోలీస్‌స్టేషన్‌తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్ట్‌మార్టం వద్ద బాధిత కుటుంబం ఆందోళన నిర్వహించింది.

**నిందితులు ఎవరిని వదిలిపెట్టబోం : సి.ఐ. మల్లికార్జున**

సిఫారా బలన్మరణానికి కారణమైన వారిని ఎవరిని వదిలిపెట్టబోమని గ్రామీణ సి.ఐ. మల్లికార్జున స్పష్టం చేశారు. మృతురాలు, వారి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ సెక్షన్ కూడా ఈ కేసులో వర్తింపజేశామన్నారు. ఇప్పటికే కేసులో ఏ-2 గా ఉన్న మొగిలి పార్వతీని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఏ-1 నాగరాజు కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, సాధ్యమైనంత త్వరగా అతనిని అరెస్ట్ చేసి సాక్ష్యాలతో కోర్టులో హాజరుపరుస్తామని సి.ఐ. మల్లికార్జున వివరించారు.

## పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్ గా పర్యవేక్షణ చేయాలి : కమిషనర్

గుంటూరు తూర్పు, ఏప్రియల్ 13 ప్రభాతవార్త : గుంటూరు నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో విధులకు హాజరై పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్ గా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఏటి అగ్రహారం, చుట్టుగుంట, కెవిపి కాలనీ, లాల్‌పురం రోడ్డు, అరండల్‌పేట, శంకర్ విలాస్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సి న చర్యలపై సంబంధిత ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ



ఇప్పటికే నగరంలో పర్యవేక్షణ సౌలభ్యం కోసం శానిటరీ డివిజన్ల పెంపు చేసి, పారిశుద్ధ్య పనులకు అవసరమైన సామాగ్రిని అందించామన్నారు. కార్మికులను డివిజన్ల వారీగా రేషనలైజేషన్ చేశామని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల లేక ప్రజల నుండి పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఉదయం మస్టర్‌కి సకాలంలో హాజరవ్వడం, పారిశుద్ధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ప్రజారోగ్య అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వినుకొండలో ఇష్టారాజ్యంగా అక్రమ నీటి వ్యాపారం!

**వినుకొండ,ఏప్రిల్13,ప్రభాతవార్త:** వినుకొండ నియోజకవర్గంలో అక్రమ నీటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా అక్రమార్కులకు కనకవర్షం కురిపిస్తుంది. మనిషి ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేసే అంశాల్లో తాగే నీరు ప్రధానమైంది. వేసవికాలం ప్రారంభం కావడంతో భానుడు ఛండ ప్రచండమైన ఎండతో చెలరేగిపోతున్నాడు. భూగర్భ జలాలు అడుగంటి పల్లె పట్టణం అనే తేడా లేకుండా పాతాళానికి పైపులు వేసినా గుక్కెడు నీరు దక్కని పరిస్థితులు చూస్తున్నాం. కాలువలు,చెరువుల్లో ఉన ్న నీరు ఎండకు సలసలా కాగి రంగు మారి నోట్లో పోసుకొని ఉక్కిలిద్దామన్నా రోగాలు వస్తాయనే భయం వెంటాడుతోంది. సీజన్ ఎదైనా కానీ ప్రజలు ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి మినరల్ వాటర్ మాత్రమే తాగేందుకు మక్కువ చూపుతున్నారు. పేద,మధ్యతరగతి కుటుంబాలు సైతం గృహ అవసరాలకు పెళ్ళిళ్ళు,ఫంక్షన్లకు కూలింగ్ క్యాన్ వాటర్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. డిమాండ్ బాగా ఉండటంతో కొందరు అక్రమార్కులు ప్రజల అవసరాలు,బలహీనతలే పెట్టుబడిగా చేసుకొని మినరల్ వాటర్ పేరిట తాగే యోగ్యత లేని నీటిని డబ్బాల్లో నింపి ప్రజారోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. వినుకొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని బొల్లాపల్లి, నూజెండ్ల, ఈపూరు, శావల్యాపురం మండలాల్లోని గ్రామాల్లోనూ దాదాపుగా ఈ అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. ఎక్కడికక్కడ ఎటువంటి అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని 32 వార్డుల పరిధిలో ప్రతి వీధికి ఒక ప్లాంటు కనబడుతుంది. పట్టణ శివారు ప్రాంతాల్లో సైతం వాటర్ ప్లాంట్లు వెలిశాయి. వీటన్నింటికి సక్రమైన అనుమతులు ప్రమాణాలు ఉన్నాయా అంటే కొన్నింటికి మాత్రమే ఉన్నాయని





**మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్ విక్రయాలు..... పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు.. దెబ్బతుంటున్న ప్రజారోగ్యం... కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం ....**



చెప్పొచ్చు. వీటిని తనిఖీలు చేసి నియంత్రించాల్సి న సంబంధిత అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకున్న దాఖాలాలు ఎక్కడా లేవు. దీంతో తమను అడిగేవారు,ప్రశి ్నంచేవారు ఎవరు లేరన్న ధీమాతో విచ్చలవిడిగా బోరు నీళ్లనే నేరుగా అపరిశుభ్రమైన క్యాన్,బబుల్స్‌లో నింపి విక్రయిస్తూ జనాలను దారుణంగా దోపిడి చేస్తున్నారు. టీ స్టాల్స్ ,టిఫెన్ సెంటర్లు,పెద్ద హోటళ్ళు,రెస్టారెంట్లు,బార్లు,అపార్టుమెంట్లకు ఇలా ఇంటింటికి ఆటోల్లో డోర్ డెలివరీ సప్లయ్ చేస్తూ ప్రజల గొంతులో గరళం నింపుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా డిమాండ్‌ను బట్టి నాణ్యత లేని 20 లీటర్ల నీటిని 15 రూపాయలు,కూల్ క్యాన్ అయితే 30 రూపాయలు,కొన్ని ప్రాంతాల్లో అయితే 40 రూపాయలు వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉరుకు,పరుగు జీవితంలో పడి క్యాన్‌లో ఉన్నది మినరల్ వాటరా లేదా జనరల్ వాటారా అని ప్రజలు పట్టించుకోవడం లేదు. సరిగా శుద్ధి చేయని నీటిని డబ్బు పెట్టి కొనుక్కొని మరీ జబ్బులు పాలవుతున్నారు. మోకాళ్ళ నొప్పులు,కీళ్ళనొప్పులు,జీర్ణకోశ తదితర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నారు. చర్యలు తీసుకోవాల్సి న అధికారులు మిన్నకుండిపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేసి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సి న బాధ్యత అధికారులపై ఉంది.

# విజయవంతమైన అనన్య హాస్పటల్ ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : అనన్య హాస్పటల్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వివరాలను హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు. వైద్య శిబిరానికి పట్టణ, పరిసర ప్రాంతాల నుండి 300 మందికి పైగా రోగులు హాజరైనట్లు తెలిపారు. బిపి, షుగర్, థైరాయిడ్, నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, దీర్ఘకాలికంగా ఉన్న ఊపిరితిత్తులకు సంబంధించి ఉన్న ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అదే విధంగా నరాల సమస్యలు, కీళ్ళ వాతం, రక్తహీనత, కాళ్ల వాపులు తదితర జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ సింగరాజు విద్య వైద్యసేవలను అందించారని తెలిపారు. ఈసిజి, షుగర్, చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు.



నోట్ : ఈ వార్తకు ఫోటోను వాడగలరని మనవి.

# ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించిన శ్రీకృష్ణచైతన్య విద్యార్థులు

నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఇంటర్ ఫలితాల్లో శ్రీకృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ కొల్లి బ్రహ్మయ్య ఆదివారం అభినందించారు. వివరాలను ఈ సందర్భంగా వారు తెలియజేశారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో సి.హెచ్. తేజశ్విని 465/470, షేక్.గౌషా 465/470, షేక్.రేష్మ 464/470, బైపిసిలో జి.గాయత్రి 432/440 మార్కులు సాధించారు. 470 మార్కులకు గాను తమ కళాశాల విద్యార్థులు 35 మంది 400లకు పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో బి.గోపిచంద్ 987/1000, శ్రీకాంత్ 984/1000, షేక్.మసూద్ 982/1000, బైపిసి విభాగంలో ఐ.శ్రావణశ్రీ 983/1000, షేక్.షాహీన 967/1000, కె.శ్రావణి 946/1000 మార్కులు అత్యుత్తమంగా సాధించారు. మొత్తం 31 మంది విద్యార్థులు 1000 మార్కులకు గాను 900లకు పైగా మార్కులను సాధించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులను ఛైర్మన్ కొల్లి బ్రహ్మయ్య అభినందించారు.



# మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణదాతలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అభినందన

నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న దాతలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ఆలయ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవిదేవి, సిబ్బంది ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి రూ.2,50,000 లు అందజేసిన మారెళ్ళ శ్రీనివాస్ - సౌజన్య, వారి కుమార్తె చందనలను అభినందించారు. అదే విధంగా రూ.1,00,000 లు అందజేసిన పెరుమాళ్ళ సత్యనారాయణ - ఆదిలక్ష్మి దంపతులను అభినందించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములుగా భక్తులు నిలవడం సంతోషమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.



# హైవే రోడ్డు రైతులకు ఎకరాకు రూ.కోటి 60 లక్షలు

నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : చీరాల ఓడరేవు బైపాస్ రోడ్డుకు సంబంధించి నాలుగు పంచాయితీల పరిధిలోని భూములకు సంబంధించి రైతులకు ఎకరాకు రూ.కోటి 60 లక్షలు చెల్లించేందుకు అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వివరాలను ప్రజా సంఘాల నాయకులు నల్లపాటి రామారావు, కంభాల ఏడుకొండలు, బాదుగున్నల శ్రీనివాసరావులు తెలియజేశారు. ఓడరేవు నుండి నకరికల్లు వరకు బైపాస్ రోడ్డును నిర్మిస్తున్న నేపథ్యంలో గత నెలలో రైతులతో అధికారులు చర్చలు జరిపారు. ఈ మేరకు జొన్నలగడ్డ, గుంటగార్లపాడు, కేసానుపల్లి, రావిపాడు, రైతులకు ఎకరాకు రూ.కోటి 60 లక్షలను చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. మార్చి నుండి ఇప్పటివరకు వడ్డీ పది శాతం కలిపి ఇచ్చే విధంగా అధికారులు సుముఖత వ్యక్తం చేశారని నాయకులు తెలియజేశారు.




# రొంపిచర్లలో ఘనంగా మట్టల ఆదివారం

రొంపిచర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రొంపిచర్లలోని ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ దేవాలయంలో ఘనంగా మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. క్రైస్తవులు మట్టలను చేతబూని క్రీస్తు పాటలను ఆలపించారు. రొంపిచర్ల ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో పాస్టర్ బుచ్చయ్య మట్టల ఆదివారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో అత్యుత్తమ జనరల్ వైద్యసేవలు



నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : శ్రీ రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో అత్యుత్తమ జనరల్ వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ పాములపాటి మణిశ్రీ ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వివరాలను ఆమె తెలియజేశారు. జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్‌కు సంబంధించి ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఉబ్బసం, దగ్గు, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, పాయిజన్ కేసులు, రక్తహీనతకు వైద్యచికిత్స అందుబాటులో ఉందన్నారు. అదే విధంగా షుగర్, థైరాయిడ్, వడదెబ్బ, జలుబు, టీబీ, కామెర్లు, గుండె సంబంధిత వ్యాధులు, హైపో థైరాయిడ్ వంటి అనారోగ్య సమస్యలకు చికిత్సను రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అందిస్తుందన్నారు. జనరల్ సర్జరీ వైద్యసేవలు, పిడియాట్రిక్, నియోనేటల్ వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య వైద్యసేవలతో పాటు ఇహెచ్ఎస్, అన్ని రకాల ఇన్సూరెన్స్ పరిధిలో నగదు రహిత చికిత్స అందజేస్తున్నట్లు తెలియజేశారు.

# రెంటచింతలలో భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

రెంటచింతల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ప్రతిఒక్కరూ ప్రేమ, ఆప్యాయతలతో జీవించాలని స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ దేగల దేవానంద్ ఉపదేశించారు. మండల కేంద్రంలోని కానుకమాత దేవవాలయం, లూథరన్ చర్చిలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీస్తు మందిరాల్లో ఆదివారం మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి క్రైస్తవ మందిరాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ఆరాధనల్లో పలువురు వాక్యోపదేశకులు యేసుక్రీస్తు పునరుత్థానం గురించి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసి దైవ సందేశాలు అందజేశారు. యేసుక్రీస్తు జీవించచిన కాలంలో ఆయన భూమిపై గడిపిన చివరి వారంలో యెరూషలేము ప్రయాణాన్ని మట్టల ఆదివారంగా అభివర్ణిస్తారని స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ దేగల దేవానందం పేర్కొన్నారు. స్థానిక చర్చి ఆవరణ నుంచి ఆదివారం పిల్లలు, పెద్దలు, వృద్ధులు యేసు సిలువతోపాటు ఈత మట్టలు చేతబట్టి స్తుతి గీతాలాపన చేస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. యేసుప్రభువు జెరూసలెం పట్టణంలో జయోత్సవంగా ప్రవేశించినప్పుడు అక్కడి ప్రజలు ఆయనను గాడిదపై ఊరేగింపుగా తీసుకువస్తూ పెద్దఎత్తున వివిధ రకాల చెట్ల మట్టలతో ఘనస్వాగతం పలుకుతారు. దీనినే క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేకు ముందు మట్టల పండుగగా ఆచరిస్తారు. పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని విశ్వాసులు ఈత మట్టలను చేత పట్టుకుని క్రీస్తు ఆరాధన గీతాలను ఆలపిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



# పల్నాడు జిల్లా వార్త



# ఘనంగా ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీసాయి వృద్ధాశ్రమంలో ఆదివారం గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పట్టణ కాపు సంఘం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే యరపతినేనికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ మాట్లాడుతూ ప్రజల మనిషి యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు వృద్ధుల సమక్షంలో నిర్వహించడం ఆనందగా ఉందన్నారు. గత 35 యేళ్లగా గురజాల నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, గెలిచినా, ఓడినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మాస్ లీడర్ యరపతినేని అని కొనియాడారు. గురజాల నియోజకవర్గంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఎంతో అభివృద్ధి చేశారని, మరో 20 యేళ్ల ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవ చేసేందుకు ఆ భగవంతుడు ఆశీస్సులు, ఆయురారోగ్యాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపు నేతలు బేతంచర్ల కోటి మేస్త్రి, కామిశెట్టి చిన వెంకటేశ్వర్లు, ఆముదాల పెద గంగయ్య, నూతి నారాయణ, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, కొమ్ము మహేష్, బశ్వల ఆజాద్, గుర్రం కోటేశ్వరరావు బ్రదర్స్, స్టూడియో నాగేంద్ర, బేతంచర్ల నాగేశ్వరరావు, భవిరిశెట్టి శ్రీనివాసరావు, కొమిరిశెటిన సతీష్, అమ్ముదాల చిన గంగయ్య, మల్లెల రామాంజి, చింతల శ్రీను, వేపూరి రఘు, కరెడ్ల పవన్, చింతా శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే వికాస్ విద్యా సంస్థల అధినేత మూల్పూరి వెంకటాద్రమయ్య, కేఎస్ఆర్ విద్యా సంస్థలు, పీఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు, నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో గల శ్రీవేంకటేశ్వర స్కూల్ డైరెక్టర్ ఇంటూరి గంగాధర్ ఆధ్వర్యాన కొండమోడు వీరమ్మ కాలనీలో గల దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సస్పైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల జీడీసీసీ మాజీ డైరెక్టర్ వడ్డపల్లి సర్వేశ్వరరావు, పిడుగురాళ్ల టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు, వాణిజ్య విభాగ కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, వనిజ సిల్క్ షోరూం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.






# శబరిమల అయ్యప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల ఆలయాన్ని ఆదివారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తన జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అయ్యప్పస్వామికి అష్టాభిషేకం చేయించారు.

# ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి జగన్‌మోహన్‌రెడ్డికి అభినందన

గురజాల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విజయవాడలోని భాష్యంలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన గురజాల పట్టణానికి చెందిన కేబీఎస్ ప్రగతి కోటేశ్వరరావు చిన్న కుమారుడు కర్రా యెడుగూరి సందింటి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గాను 973 మార్కులు సాధించాడు. 1 నుంచి 10వ తరగతి వరకు పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన జగన్‌మోహన్‌రెడ్డిని వైసీపీ గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మంగళగిరి మాజీ శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధరరెడ్డి, సీనియర్ నేత కొమ్మినేని వెంకటేశ్వర్లు, మేకల శేషిరెడ్డిలు అభినందించారు.



## మృతుని కుటుంబానికి పిన్నెల్లి ఆర్థికసాయం

విజయపురిసౌత్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విజయపురిసౌత్‌లోని సి-టైప్ క్వార్టర్స్ లో నివసిస్తున్న పగిడిమారి కుమార్‌బాబు (టింకు) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు జడ్పీటీసీ మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాతకోటిరెడ్డిలు పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల కోసం రూ.25 వేలు ఆర్థికసాయాం కుటుంబానికి అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ వైకాపా అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, బూడిద సైతులు, సునీల్, సాగర్‌బాబు, సుమన్, బీర్నీడి రమేష్ పలువురు పాల్గొన్నారు.



## చిన్నారికి సూపర్ మెమరీ...!

# ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు

### - జ్ఞాపక శక్తిలో అసమాన ప్రతి చూపిన చిన్నారి హర్షిణి



రెంటచింతల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: రెంటచింతలకు చెందదిన చిన్నారి తన అసమాన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంటోంది. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లుగా.. అద్భుతమైన జ్ఞాపకశక్తితో అదరగొడుతోంది. కేవలం నిమిషాల వ్యవధిలోనే గణిత శాస్త్రజ్ఞుల పేర్లతోపాటు వారి శాస్త్రాల పేర్లు మొత్తం 45 పేర్లను ఒక నిమిషం 19 సెకండ్ల వ్యవధిలోనే చెప్పేసి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తన అద్భుత జ్ఞాపకశక్తితో ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు సంపాదించింది ఈ ఆరేళ్ల చిన్నారి హర్షిణి. మా చిన్నారికి మాట్లాడటం అంటే చాలా ఇష్టం. వాటన్నింటినీ రికార్డు చేసి ఆ వీడియోలను ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపాం. దాంతో హర్షిణి ప్రతిభ గుర్తించిన సంస్థ రికారడ్డుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం , మెడల్, మెమొంటో అందించినట్లు చిన్నారి తల్లిదండ్రులు శ్యామల రవి కిషోర్‌రెడ్డి, సావిత్రి తెలిపారు. మేము ఆటల ద్వారానే ఆమెకు అన్ని నేర్పించేందుకు ప్రయత్నిస్తాం. వివిధ రకాల విషయాల గురించి చెబుతాము. దీంతో ఆమెలో కంఠస్థం ధోరణి పెరుగుతుంది. చిన్నారి సాధించిన ఘనత పట్ల మేమందరం గర్విస్తున్నా అని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. అంతేగాక ఆమె జ్ఞాపకశక్తి మరింతగా వృద్ధి చెందేలా మౌనికశ్రీ అకాడమీలో ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నట్లు వారు వెల్లడించారు. చిన్నారి తండ్రి రవికిషోర్‌రెడ్డి వ్యాపార రీత్యా నల్లపాడులో నివాసం ఉంటుండగా అమ్మ సావిత్రి గృహిణి. రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చేతుల మీదుగా అందుకున్న చిన్నారి హర్షిణిని అందరూ ప్రశంసించారు.

# ఇంటర్ ఫలితాల్లో 55 శాతం ఉత్తీర్ణత

కారంపూడి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మండలంలో గత మార్చి నెలలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో 55 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు అధికారులు శనివారం తెలిపారు. కారంపూడిలోని బీఆర్ అంబేద్కర్ గురుకులం, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాల, బిషప్ భాగ్యయ్య జాన్ క్రిస్టినా కళాశాలకు చెందిన 329 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 214 మంది ఉత్తీర్ణులయ్యారు. 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మోడల్ స్కూల్ బైపీసీ విద్యార్థి పి.షదిక 956, ఎంపీసీలో షేక్ హుమేరా 936 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు.

# ఆచరించేది ఇతర మతం - అపనిందలు, అసత్యప్రచారం మాత్రం టిటిడి పైన : మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: ఆచరించేది ఇతర మతం, అపనిందలు, అసత్యప్రచారం మాత్రం టిటిడి పైన అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూఎక్కడో చనిపోయిన గోవుల ఫోటోలతో టిటిడిని, హిందూ ధర్మాన్ని అన్యమతస్థుడైన భూమన కరుణాకరరెడ్డి బదనాం చేస్తున్నాడని, తాడేపల్లి ఆదేశాలతోనే నాస్తికుడైన భూమనతో ఉన్నపళంగా టిడిపి ప్రతిష్టపై, గోవులపై వాత్సల్యం, ప్రేమ ఉప్పొంగాయా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నిన్నటివరకు తమ స్వార్ధ రాజకీయాలకోసం శవాలని వెతుకుతున్న వైసిపి నేతలు నేడు హిందూ ధర్మంపై విషం కక్కెందుకు, రాష్ట్రంలో విద్వేషాలు రేపేందుకు గో మరణాలను రాజకీయం చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. పరమపవిత్రమైన తిరుమల లడ్డును మున్సిపల్ ఎన్నికలలో లబ్ది పొందేందుకు ఓట్ల కోసం పంచిపెట్టినప్పుడు భూమనకు టిటిడి ప్రతిష్ట గుర్తుకు రాలేదా, కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ఉద్దేశించి వేంకటేశ్వరుడు కేవలం నల్లరాయి, దానిని పెకిలించి వేస్తే మాత్రం తప్పేంది అని తూలనాడిన భూమన,నేడు జరగని దానిని జరిగినట్టుగా ప్రచారం చేస్తూ గోమరణాలతో లబ్దిపొందే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు కాదా అని ప్రత్తిపాటి దుయ్యబట్టారు. జగన్ పాలనలో దేవాలయాలలో రథాలు తగలబడ్డా, విగ్రహాలు నరకేయబడ్డా, ఆలయాలు కూల్చబడ్డా, ఆఖరికి సాదాసీదా దేవాలయాలు మొదలు, ప్రసిద్ధి క్షేత్రాలలో నిధులు స్వంత పార్టీవారే స్వాహ చేసినా తెరవని నోళ్లు నేడు మత విద్వేషాల కోసం ఆవురావురుమంటూ తెరుచుకోవడంస్వార్ధ, విద్వేష రాజకీయ రగడకోసం కాదా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. భూమన ఆయన కుటుంబం ఆచరించేది, విశ్వసించేది ఇతర మతం మరి అపనిందలు, అసత్యప్రచారం టిటిడిపై, హిందూ ధర్మంపై ఎందుకుభూమనా, తన కుమార్తె నేహారెడ్డి పెళ్లిని ఇతర మత పద్ధతిలో భూమన జరిపించింది వాస్తవం కాదా, తన అవినీతి,అక్రమాల కోసం టిడిపి ఛైర్మన్‌గా పనిచేసినప్పుడు టిటిడి సోమ్మును భూమన దారి మళ్లించలేదా?తాను ఛైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించలేదా? ఏడుకొండలను, ఐదు కొండలుగా మార్చే కుట్రలకు తెరలేపింది భూమన కాదా? తాను చేసిన తప్పులను, అపచారాలను కప్పి పుచ్చుకోవడానికి, తన మనిషి హరినాథరెడ్డిపై ఉన్న అభిమానంతోనే భూమన పనిగట్టుకొని మరి తిరుమలపై, గోశాలపై విషం చిమ్ముతున్నాడనేది కాదనలేని సత్యమని ప్రత్తిపాటి వివరించారు. టిడిపి గోశాలకు నిత్యం వచ్చే వేలాది భక్తులకు కనిపించని గోమరణాలు భూమనకే కనిపించడం జగన్మాయ కాదా? టిడిడి గోశాలలో 100 ఆవులు చనిపోయాయయే భూమన, వైసిపి నేతల ప్రచారమంతా అసత్యం, అభూతకల్పనే అని అన్నారు. ఏక్కడో మరణించిన గోవుల ఫోటోలు టిటిడి గోశాలవని నమ్మించేందుకు భూమన చేస్తున్న ప్రయత్నాలు చిన్నపిల్లల కుప్పి గంతులను తలపిస్తున్నాయన్నారు. నిన్నటివరకు శవాలతో రాజకీయం చేసిన వైసిపి నేతలు ఇప్పుడు పవిత్రమైన గోవును వాడుకుంటున్నారన్నారు. పవిత్రమైన టిటిడిని తమ స్వార్ధ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే, జగన్, వైసిపి నేతల పన్నాగమని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# పోతినేని శ్రీనివాసరావు కుమారుడు నిశ్చితార్ధ వేడుకలలో లోకేష్‌తో కలసి దంపతులను ఆశీర్వదించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: చినకాకాని హాయ్‌ల్యాండ్‌లో జరుగుతున్న మంగళగిరి తెలుగుదేశం పార్టీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు కుమారుడు నిశ్చితార్ధవేడుకలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలసి మాజీమంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి, పేదల ఆరోగ్యానికి పెన్నిధి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి, పేదల ఆరోగ్యానికి పెన్నిది అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆర్ధిక సమస్యలు వేదిస్తున్నా ప్రజలకిచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వ పథకాలు, పనితీరు గురించి లబ్దిదారులు తోటివారికి వివరించి ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని ప్రత్తిపాటి కోరారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాదపడుతూ, ప్రభుత్వ సాయానికి ధరఖాస్తు చేసుకున్న 20మందికి ఆదివారం ప్రత్తిపాటి తన నివాసంలో సియంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల అవినీతితో రాష్ట్ర ఆర్ధిక పరిస్దితి క్షీణించినప్పటికి, గత ప్రభుత్వం నిలిపివేసిన సియంఆర్ఎఫ్ సాయాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్దరించిందని, ఆర్ధిక, అనారోగ్య సమస్యలతో పేద ప్రజలు ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సియంఆర్ఎఫ్ పంపిణీలో ఉదారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందించే సియం సహాయనిధి సాయం లక్షలాదిమంది కుటుంబాల ఆరోగ్యానికి పెన్నిదిగా మారిందన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహించాలని, గతంలోమాదిరి తప్పుడు వ్యక్తులు చేసే విషప్రచారాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు. ప్రధానమంత్రి గ్రామీణ అవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించుకొని చిరు వ్యాపారాలతో ఉపాధి పొందాలనుకునే గ్రామీణ ప్రాంతాలవారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నాయని, ఆసక్తి ఉన్నవారు ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధి, చిరువ్యాపారాల నిమిత్తం బ్యాంకులనుండి మంజూరైన రూ 16లక్షల రుణాలని ప్రత్తిపాటి బ్యాంకులు ఎంపికచేసిన 10మంది లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుల షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



# మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి కాలువలును శుభ్రం చేయాలని కమిషనర్ ఆదేశం

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: పట్టణంలో పలు ప్రాంతాలలో మురుగుకాలువలపై ఆక్రమణల కారణంగా పారిశుధ్య సిబ్బందికి ఆ మురుగుకాలువలలో పూడికలు తీయటానికి వీలులేని పరిస్దితులలో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ కమీషనర్ ఆదివారం పట్టణంలోని కస్తూరిబాయి రోడ్,బోస్‌రోడ్, సాలిపేట,కళామందిర్ సెంటర్ తదితర ప్రాంతాలలో పర్యటించి మురుగుకాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వెంటనే ఆ కాలువలలో ఉన్న పూడికను పూర్తిగా తొలగించాలని, పారిశుధ్య అధికారులను, సిబ్బందిని కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, పారిశుధ్య అధికారులు రమణరావు, సునీత, మేస్త్రీలు ఉమర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి నివాళులు అర్పించిన బిజెపి

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: భారతీయ జనతాపార్టీ నియోజకవర్గానికి చెందిన శ్రేణులు డాక్టర్ బిఆర్ ఆంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదిన జరగనున్న సందర్బంగా ముందుగా కేంద్ర, రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ సూచనలతో రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని నరసరావుపేట సెంటర్ వద్దనున్న, కావూరు గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దీపారాధన చేసి ఆయన జయంతిని పురస్కరించుకొని ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డి పుల్లయ్య, గుమ్మా బాలకృష్ణ, అడుసుమల్లి వెంకటేశ్వరరరావు, కుప్పం కళ్యాణ దుర్గారావు, యం పేరయ్యా, ఊటికొండ నాగేశ్వరరావు, జె రాయుడు, మాచర్ల శ్రీనివాసరావు, పంచుమర్తి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



# మిరియాల తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి





కారంపూడి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని మిరియాల గ్రామంలో కొలువుదీరిన శ్రీఆవుదేవర అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీసమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ వేద పండితులచే ఆశీర్వచనాలు అందుకున్నారు. ముందుగా మిరియాల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కారంపూడి మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాటక రంగం ఇంకనూ ప్రేక్షకుల అదరాభిమానాలు చూరగొంటున్నాయి.

యడ్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : నేటి అధునిక ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీలో అనాదిగా వస్తున్న స్టేజీ నాటక రంగానికి ఇంకనూ ప్రేక్షకులు తమ అదరాభివందనాలు చూపటం అభినందనీయమని, ప్రేక్షకుల అభిమానం నాటక రంగ నిరా వ్వాహకులు అభిమానం తగ్గకుండా తదనుగుణంగా రూపొందించటం వారి మెప్పు పొందటం అంటే చాలా మంచి విషయమన్నారు. మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని భరతముని కళా ప్రాంగణంలో జరుగుతున్న రెండవ రోజు 26వ జాతీయ స్థాయి అహ్వాన నాటికల పోటీలను జ్యోతి ప్రజ్వలనను గ్రామ ఎంపీటీసీ తోకల వీర రాఘవయ య్య, నటరాజ పూజను డిఎస్‌పీ సిఐడి గుంటూరు గోలి లక్ష్మయ్య ప్రారంభించారు.





జ్యోతి ప్రదీపనం చేస్తున్న గోలి లక్ష్మయ్య, తోకల వీరరాఘవయ్య, మండెపూడి శ్రీనివాసరావు. అ సత్యం నాటికలోని సన్నివేశం. 27వ మైలు రాయి నాటికలోని సన్నివేశం

అనంతరం జరిగిన సభాకార్యక్రమ అధ్యక్షులుగా కళాపరిషత్ కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం ప్రముఖులు సమావేశానికి విచ్చేసారు. తొలుత శ్రీ సాయి అర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక ప్రదర్శించారు. దీని రచన పిటి మాధవ్, దర్శకత్వం గోపరాజు విజయ్ నిర్వహణలో జరిగింది. రెండవ నాటిక చైతన్య కళాస్రవంతి ఉక్కునగరం విశాఖ వారి అ సత్యం నాటిక ప్రదర్శించారు. రచన పిన్నమనేని మృత్యుంజయరావు, దర్శకత్వం పి బాలాజీ నాయక్ నిర్వహణలో సాగిన నాటికలో కథాసారాంశం దైవత్వమైన, రాక్షసత్వమైనా, స్వార్ధమైనా, పరమార్ధ మైన అది మనిషి హృదయంలో ఉంటుంది. ప్రతి సత్యం వెనుక ప్రతి అసత్యం వెనుక మనిషి స్వార్ధమో భయమో చుట్టుకొని ఉంటుంది. అదే అతనికి ఏదో మేలు చేస్తుంది. అసలు ఏది సత్యం, ఏది అసత్యం కంటికి కనిపించేదంతా సత్యంకాదు, కనిపించనిదంతా అసత్యం కాదు, యదార్ధమైన సరే ఒక చెడు దోహద పడితే అది అసత్యం అబద్ధమైన సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం అవుతుంది. మూడవ నాటిక 27వ మైలు రాయి దీని రచన పిటి మాధవ్ కథా సారంశం, నిజం గెలుస్తుందన్నది, నిజమే కానీ గెలిచేదంతా నిజం కాదు అనేది ప్రధాన అంశంగా రాయబడిన నాటకం. మైలురాయి. 1993వ సంవత్సరంలో జరిగిన యదార్ధ సంఘటనల అధారంగా రాయబడిన నాటకం ఈ 27వ మైలురాయి. న్యాయవాదులు న్యాయం కోసం అన్న సంగతి మర్చిపోయి చాలా కాలమైంది. యిప్పుడున్న వారిలో చాలా మంది క్లయింటు వాధులే. పేరుకు మాత్రమే న్యాయవాదులు, న్యాయవాదులు తమ దగ్గరకు వచ్చేఅడ్డమైన కేసులు వాదించకూడదు. సమాజానికి కీడు చేసే కేసులు వాదించకుండా ఉండటమే ఉత్తమం అనే ప్రధాన అంశంగా రాయబడ్డ నాటికి ఇది. నాటకోత్సవాలను కొండవీటి కళాపరిషత్ నిర్వాహక కమిటి అధ్వర్యంలో పర్యవేక్షణ పనులు నిర్వహించారు.

## చిన్నరథం తిరునాళ్లలో ప్రత్తిపాటి పూజలు



చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వేంచేసియున్న రామాలయంలోని శ్రీ సీతారామస్వామివారి కళ్యాణం అనంతరం ఏర్పాటుచేసిన చిన్నరథం తిరునాళ్లలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు శనివారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు గైకొన్నారు. ఆలయ అర్చకులు దివి రామమాధవాచార్యులు, వేదపండితులు దివి పవనకుమార్, ఈట బి అశోక్‌కుమార్‌లు ప్రత్తిపాటికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మోదుగుల పాపిరెడ్డి చిత్రపటానికి నివాళి

చిలకలూరిపేట,ఏప్రిల్13,ప్రభాతవార్త: మాజీ పార్లమెంట్ సభ్యుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మోదుగుల పాపిరెడ్డి ఇటీవల మరణించారు. కాగా ఆదివారం గుంటూరు పట్టణంలోని రెడ్డిపాలెంలో వారి నివాసంలో పాపిరెడ్డి పెదకర్మను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాపిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వేణుగోపాలరెడ్డిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గట్టినేని రమేష్, గంగా శ్రీనివాసరావు, కందుల రమణలు పాల్గొని నివాళులు అర్పించారు.



## బిసిల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : బిసిల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని బిసి సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం విప్పర్ల కొండలు ఆధ్వర్యంలో ఆయన 44వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిసిల జీవితాలలో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వానికి 40 సిఫార్సులను వారు సూచించారని గుర్తు చేశారు. భారతదేశంలో 39 సిఫార్సులు ఇంకా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు పత్తిపాటి హరిక్రిష్ణ, బాలాజీ, కుమ్మరి దస్తగిరి, అంకమ్మరావు, బెల్లంకొండ చెన్నయ్య, వై.శ్రీనివాస్, షేక్.చిన్నరఫీ, లాజర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



## అన్నదమ్ములపై బీరు సీసాలతో దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలంలోని గుడిపూడి పరిధిలోని ఫణిదం గ్రామంలో వరుణ్‌తేజ్, సురేష్ అనే అన్నదమ్ములపై బీరు సీసాలతో శనివారం రాత్రి దాడి జరిగింది. గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లను తిలకించేందుకు వారు వెళ్లారు. అక్కడి యువకులతో వారికి స్వల్ప వివాదం ఘర్షణకు, దాడికి దారి తీసింది. క్షతగాత్రులను కుటుంబసభ్యులు సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## టిటిడి గోమరణాలపై అసత్య ప్రచారాలు : ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : టిటిడి గో మరణాలపై మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకోవడం సరికాదన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోలేదన్నారు. వృద్ధాప్యం, డెలివరీ, అనారోగ్య కారణాలతో నెలకు పది ఆవులు చనిపోవడం సహజమన్నారు. గత వదేళ్ళ గణాంకాలను చూస్తే ఇదే విషయం తెలుస్తుందన్నారు. మూడు నెలల్లో 40 ఆవులు చనిపోయాయని తెలియజేశారు. గోశాలలో 2668 ఆవులకు జియో ట్యాగ్ చేసి సంరక్షిస్తారని తెలియజేశారు. ఇప్పటికైనా భక్తుల మనోభావాలతో ఆటలు ఆడవద్దన్నారు. ఆవులకు పోస్టుమార్టం చేయడం ఎప్పుడూ జరగలేదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వివరించారు.

## నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ తెలియజేశారు. స్వేచ్ఛ సమానత్వం రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. అయితే పాలకుల విధానాల వలన వాటి మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

## ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

రాజుపాలెం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా కొండమోడు వీరమ్మకాలనీలో ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుపుతున్న అనాథ పిల్లలు, వృద్ధులకు టిఫిన్, భోజనం, కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పిడుగురాళ్ల జెడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ వడ్లమూడి సరేశ్వరరావు, టిడిపి నాయకులు పొందుగల శ్రీనివాసరావు, కనిగిరి శ్రీనివాసరావు, చెన్నారావులు హాజరయ్యారు. కేక్ కట్‌చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. విజన్ విద్యాసంస్థల అధినేత ఎం.వెంకటరామయ్య, పిఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కె.నరసింహారావు, మస్తాన్‌రావులు పాల్గొన్నారు.

# బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

బాపట్ల,ఏప్రిల్13,ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.ఆదివారం బాపట్ల పట్టణం లోని ఆయన నివాస గృహంలో బాపట్ల నియోజకవర్గం నుండి అర్హులైన 11 మంది కి లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం సీయం సహాయ నిధి నుండి రూ. 20,46,896 విలువ గల చెక్కలు ఆయన పంపిణీ



చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మండలం చుండూరు పల్లి గ్రామానికి చెందిన ఐనంపూడి విజయలక్ష్మీ యల్.ఓ.సి రూ.80,000, బాపట్ల పట్టణం ప్యారిస్ పేటకి చెందిన షేక్ నాగూర్ భాషా రూ.50,000, 13వ వార్డుకి చెందిన గద్దం గంగా దేవి రూ.3,74,000,బేతని కాలనీకి చెందిన సోమల సుశాంత్ రూ.1,87,673,చిల్లర గొల్లపాలెం కి చెందిన దాది శ్రీనివాసరావు రూ.1,53,700,ఇమ్మడిశెట్టిపాలెంకి చెందిన ఇమ్మడిశెట్టి సాయి కుమారి రూ.1,43,338, ఇందిరా నగర్ కి చెందిన కొటికలపూడి శ్రీనివాసరావు రూ1,46,461,జమేధార్ పేటకి చెందిన దోనేపూడి పావని రూ.93,390,డ్రైవర్స్ కాలనీకి చెందిన గుడిమెట్ల వినయ శీల రూ.71,834, శృంగారపురంకు చెందిన నూనె శ్రీనివాసరావు రూ.36,608, హనుమంతరావు కాలనీకి చెందిన గరికి శ్రీనివాసు రూ.26,500ల చెక్కులను ఆయన పంపిణీ చేశారన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలికంగా రద్దు



బాపట్ల,ఏప్రిల్13,ప్రభాతవార్త: ఈనెల14వ తేదీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు దినముగా ప్రకటించి నందున సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రజలు ఈ విషయాన్ని గమనించి సుదూర ప్రాంతాల నుండి అర్జీలు ఇవ్వడానికి ప్రజలురావద్దని ఆయన తెలియజేసారు.

# భక్తిశ్రద్ధలతో ప్లామ్స్ డే

బాపట్ల,ఏప్రిల్13,ప్రభాతవార్త: చిన్నారులు భక్తి శ్రద్ధలతో ప్లామ్స్‌డే నిర్వహించారు.ఆదివారం బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డు ,ఆనంద్ నగర్ పునరుద్ధాన లూథరన్ దేవాలయం సుండేస్కూల్ చిన్నారులు, యువకులు భక్తి శ్రద్ధలతో ఈత మట్టలతో వీధులలో తిరుగుతూ ఘనంగా మట్టల



ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సండేస్కూల్ టీచర్ కొప్పోలు అపర్ణ మాట్లాడుతూ ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు పాటిస్తుంటారు. క్రీస్తు ప్రభువును దేవుని కుమారునిగా, శాంతి దూతగా సర్వమానవాళికి రక్షకుడిగా అంగీకరిస్తూ బెతానియా గ్రామం నుంచి యెరుషలేము వరకు గాడిదపై నగర పురవీధుల్లో ఊరేగించినట్లు బైబిల్ చెబుతోందని ఆ ఊరేగింపులో ఆయనను శాంతి దూతగా, దేవునిగా అంగీకరిస్తూ వస్త్రాలను పరచి చేతిలో ఈత మట్టలతో విశ్వాసులు పాల్గొన్నారు. దానిని పాటిస్తూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పర్వదినానికి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా నిర్వహిస్తున్నారు. చిన్నారులు మట్టలకు పూలను అలంకరించి గీతాలు పాడుకుంటూ వీధులలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సండేస్కూల్ టీచర్ కొప్పోలు అపర్ణ,అనురాధ, జ్యోష్న, సుమలత, జాన్సీ, ప్రతిభ, గ్రేసీ, హనీ, అనుదీప్, రవి, హర్ష, చంటి, ప్రిన్స్, సంపత్,నోయెల్,చిన్నూ, సండేస్కూల్ చిన్నారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో గాలివాన దుమారం

### ఇబ్బందులు పడిన ప్రజానీకం


బాపట్ల,ఏప్రిల్13,ప్రభాతవార్త: బాపట్లలో గాలివాన దుమారం జనజీవనాన్ని పరుగులు తీయించింది. అకస్మాత్తుగా వాతావరణం లో వచ్చిన మార్పు,పిడుగుల శబ్దాలు గుండె దడ పుట్టించేలా చేశాయి. ఎక్కడ పడితే అక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడిపోయాయి. భవనాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కూడి గాలికి పడిపోయాయి,అదే విధంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నామరూపాల్లేకుండా పోయాయి. పట్టణంలో పలుచోట్ల షాపులకు ఆసరాగా ఏర్పాటు చేసిన రేకులు చెల్లా చెదురుగా ఎగిరిపడ్డాయి. తీవ్ర గాలి దుమారం నేపథ్యంలో రవాణా వ్యవస్థకు కూడా అంతరాయం ఏర్పడింది. ఉదయం నుండి ఎండ ప్రతాపంతో తల్లడిల్లుతున్న ప్రజలకు చల్లటి వాతావరణం మంచి ఆహ్లాదాన్ని పంచుతూనే ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కంగారు పుట్టించింది. బాపట్ల ప్రాంతంలో చాలా చోట్ల పిడుగులు పడినట్లు సమాచారం అందింది. బాపట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోతకొచ్చిన మామిడికాయలు నేల రాలాయి. కర్లపాలెం మండలంలో వేరుశనగ,మినుము, వరి పంటలను కాపాడుకోవడం కోసం రైతులు తల్లడిల్లిపోయారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ తీగలు తెగిపడిపోవడంతో అంతరాయం ఏర్పడి అనేక గ్రామాల్లో అంధకారం అలముకుంది. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం



వద్ద నిర్మాణంలో ఉన్న ఒక భవన పరంజ విరిగి రోడ్డుమీద పడిపోయింది. నిత్యం జన సంచారం ఉండే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం పెద్ద ప్రమాదమే తప్పింది. మొత్తం మీద గంటన్నర పాటు బాపట్ల జనాన్ని గాలి దుమారంతో కూడిన వర్షం తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

## చదువుతో పాటు క్రమశిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత



కొల్లిపర,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల కోశాధికారి ప్రభాకరరెడ్డి



అన్నారు.స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రధమ,ద్వితీయ సంవత్సరాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేసి సత్కరించారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపు నందు 470 కు 460 మార్కులు సాధించిన అవుతు రత్నకుమారి కి ఎన్ఆర్ఐ గాదె రవీంద్ర రూ.5 వేలు నగదు ప్రొత్సాహక బహుమతిని అందజేసారు.అదేవిధంగా బైపీసీ గ్రూపు నందు 440 కు గాను 420 మార్కులు సాధించిన గుదిబండి బసవ సింధుకు గుదిబండి శ్రీనివాసరెడ్డి రూ.5 వేలు నగదు ప్రొత్సాహక బహుమతిని అందజేసారు.ద్వితీయ సంవత్సరం నందు ఎంపీసీ విద్యార్థిని 1000 మార్కులకు గాను 933 సాధించిన కొల్లిపర దీపికను కళాశాల సెక్రటరీ అవుతు కృష్ణారెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు.అదేవిధంగా మంచి మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించారు.ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను ఇష్టపడి చదుకుంటే మంచి మార్కులు సాంచటమే కాకుండా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు.ప్రిన్సిపాల్ వింతా మోహనరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని సరైన ప్రణాళికతో మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవాలన్నారు.కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కూరపాటి రవిశేఖరరెడ్డి,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

పెదకూరపాడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల ఆదివారాన్ని భక్తి

శ్రద్ధలతో క్రైస్తవ సోదరులు నిర్వహించారు. ఏసురాజుకు జై ...క్రీస్తు రాజుకు జై అంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. ఫాదర్ రాజారెడ్డి మాట్లాడుతూ మట్టల ఆదివారం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఏసుక్రీస్తు శిలువపై పడిన శ్రమలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం

### గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాధి మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపీ భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారన్నారు. గతంలో వేంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచరానికి తెరలేపారన్నారు. అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అస్యత ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించే కుట్రలు చేస్తున్నారన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో, వ్యాధులతో నెలకు సగటున 10 ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు. ఇవి గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమవుతుందన్నారు. గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయన్నారు. కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్‌లో చనిపోయినట్టు చూపిన ఆవుల ఫోటోలు ఇక్కడి కాదని, వాటిని అడ్డుపెట్టుకని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోసంరక్షణశాలపై టీటీడీ దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందన్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలోని 2668 ఆవులకు జియో ట్యాగ్ చేసి ప్రతి రోజూ పర్యవేక్షించడం జరుగుతుంటే ఆవులకు జియో ట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలను గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి రోజూ శుభ్రపరచడం, బ్లీచింగ్ చేయడం జరుగుతుందన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే ఇక్కడ పరిశుభ్రత లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం చేయడం లేదంటూ అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదన్నారు. ఏదైనా ప్రమాదంతోగానీ, అనుమానాస్పదంతో జరిగితే తప్పనిసరిగా పోస్టుమార్టం చేయడం జరుగుతుందన్నారు. జనన, మరణాల రిజిష్టర్‌ను గోసంరక్షణ శాలలో ప్రతి రోజూ క్రమం తప్పకుండా నమోదు చేస్తున్న విషయం తెలిసి కూడా దురుద్దేశపూర్వకంగా రిజిష్టర్‌లో నమోదు చేయడం లేదంటూ వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. లేగ దూడలను పసిబిడ్డలుగా భావిస్తూ గోశాల సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. తాను నాస్తికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం కాదా..? వేంకటేశ్వరస్వామిదేముంది.. ఒక నల్లరాయి.. దానిని పెకిలించేస్తానంటూ గతంలో ప్రకటించలేదా..? కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడలేదా..? కోవిడ్ సమయంలో స్వామి వారి ప్రసాదాలను కూడా దారి మళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిది కాదా..? కరుణాకరరెడ్డి కుమారెడ్డి నీహారెడ్డి పెళ్లిని క్రైస్తవ మత ఆచారాలతో చేసిన మాట వాస్తవం కాదా..? కరుణాకరరెడ్డి అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్లించి కమిషన్లు కట్టేశారన్నారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది.. ఏడుకొండలను ఐదు కొండలుగా మార్చి కుట్ర చేసింది.. టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చే చర్యలకు పాల్పడింది నువ్వు కాదా..? చేసిన తప్పుడు పనులకు విధుల నుంచి దూరం అయిన హరనాథ్‌రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తారా..? మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలను పోలీసులు పరిశీలించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలు

గురజాల, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః గురజాల నియోజకవర్గ ప్రజలు ఆరాధ్య దైవంగా బావించే టీడీపీ సీనియర్ నేత, గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో అంగరంగ వైభవంగా జరిపారు. ముందుగా స్థానిక ఆనిగ్రేస్ వృద్ధాశ్రమం వద్ద శరమాళ్ల చిన్న ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యాన వృద్ధుల మధ్యలో పేదల ఆశాజ్యోతి యరపతినేని జన్మదిన కేక్‌ను కట్ చేశ్వారు. అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అలాగే గురజాల ప్రభుత్వ వైద్యశాల, బ్రహ్మనాయుడు కూడలి వద్ద అన్నదాన కార్యక్రమం, గురజాల గ్రామ దేవత పాతపాటేశ్వరి అమ్మవారి దేవస్థానంలో



ప్రత్యేక పూజలు, మండలంలోని దైద బిలంలో శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, పదో వార్డు కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, శరమాల హనుమంతురావు, నవులూరి శ్రీరామమూర్తి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం చేస్తున్న దివ్యాంగురాలైన మహిళ ..మహిళారైతును దత్తత తీసుకున్న వినియోగదారులు



యడ్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఉన్నవ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన మహిళా రైతు పి కోటేశ్వరమ్మ గత 2018 నుండి ప్రకృతి వ్యవసాయం చేస్తుంది. అంగ వైకల్యాన్ని అధిగమించి భర్త వెంకటేశ్వరరావుతో కలసి కష్టించి పొలం పనులు చేస్తుంది. పత్తి, మిర్చి తదితర ప్రధాన పంటలకు పలు రకాల కూరగాయాలు, అకుకూరలు అంతర పంటలుగా సాగు చేస్తుంది. ప్రకృతి వ్యవసాయ



శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ సొంతగా తయారు చేసిన జీవామృతం, పంచగవ్వ, తదితర కషాయాలను పంటలకు పిచికారీ చేస్తున్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల అవశేషాలు లేని అమె పంట ఉత్పత్తులపై ప్రజల్లో పేరొచ్చింది. కోటేశ్వరమ్మ పండించిన పంటలు తాము కొనుగోలు చేస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన అరోగ్య అవగాహన కలిగిన 19మంది వినియోగదారులు గతేడాది అమెను కలిశారు. రైతుగా దత్తత తీసుకుంటామని ప్రతిపాదించారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా పండిన పంట దిగుబడిని ఇచ్చేలా అమెతో ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. తలా 5వేలు చొప్పున చెల్లించారు. ఒప్పందంలో భాగంగా వినియోగదారులు అధివారం కోటేశరమ్మ ఇంటిని సందర్శించారు. కందిపప్పు, కారం, ఉల్లిపాయలు, శనగ పంట ఉత్పత్తులను కోటేశ్వరమ్మ వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వినియోగదారులు కోటేశ్వరమ్మను పుష్పగుచ్చాలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ధన్యావాదాలు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఐదుగురు రైతులు హాజరయ్యారు. భూమి రక్షణ, అరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం అవశ్యకతపై అవగాహన కల్పించారు.

## పోలేరమ్మ కొలుపుల్లో పాల్గొన్న జనసేన నాయకులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలంలోని భృగుబండ గ్రామంలో ఆదివారం జరిగిన పోలేరమ్మతల్లి కొలుపుల్లో సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారితో పాటు వాల్మీకి, బోయ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

### వైకాపా నుండి జనసేన లోకి పలువురు చేరిక...

భృగుబండ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి జనసేన పార్టీలోకి పలువురు ఆదివారం చేరారు. ఇంకొల్లు శివ, బొజ్జా రామకృష్ణలు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ బైపిసిలో గాయత్రి ప్రతిభ

రాజుపాలెం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : ఇంటర్ ఫస్ట్‌ఇయర్ ఫలితాల్లో స్థానిక ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థిని చెవుల గాయత్రి బైపిసిలో 440 మార్కులకు గాను 430 మార్కులను సాధించారు. జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుండి తమ సంస్థకు గాయత్రి గర్వకారణంగా నిలిచిందని కళాశాల ఛైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి అభినందించారు. తన జీవితంలో గాయత్రి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. అభినందన కార్యక్రమంలో డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి, సిఈవో సన్నీ, డీన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఇంటికే నడిచొచ్చిన కొండంత ధైర్యం

- సిఎం రిలీఫ్ ఫండ్ ...అర్హుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే నసీర్
- స్వయంగా సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత - ఐదుగురికి రూ.14 లక్షలు
- బాధితులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆరోగ్యంపై ఆరా తీసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు, ఏప్రియల్ 13 ప్రభాతవార్త : అనుకోని అనారోగ్యం చుట్టుముట్టి అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులతో పట్టెడు దు:ఖంలో ఉన్న వారికి కొండంత భరోసా ఇంటికే నడిచి వచ్చింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ రూపంలో వారి కష్టంలో తోడుగా ఉంటామనే భరోసా లభించింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆరోగ్యశ్రీ కింద కవర్ కాని వ్యాధులకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మంది చికిత్సలు తీసుకుంటున్నారు. వీరిలో అర్హులైన వారికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే నసీర్ ఎప్పటికప్పుడు వాటి వివరాలు పర్యవేక్షిస్తూ బాధితులకు చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బెల్లంకొండ వరలక్ష్మికి రూ.2,67,680 లు, ఎం.శ్రీనివాసరావుకు రూ.2,20,400 లు, వడ్డి గోపాలకృష్ణకు రూ.3,00,193 లు, చావలి వెంకటేశ్వర్లుకు రూ.2,18,537 లు, వెంకటలక్ష్మి నరసింహారావుకు రూ.3,05,094ల చెక్కులు మంజూరయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే నసీర్ స్వయంగా బాధితుల ఇళ్ళకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. అనారోగ్యం బారిన పడటానికి గల కారణాలను అడిగి తెలుసుకొని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయా కుటుంబాలకు అందజేశారు. ఏ కష్టమొచ్చినా తాను అండగా నిలుస్తానని గుండె ధైర్యమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సిఎం రిలీఫ్‌ఫండ్ తోడుగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అశోక్, మీరావలి, జ్యోతి, శంకూరి శ్రీను, వెంకటేశ్వర్లు, సాదినేని శ్రీనివాస్, వేల్పూరి కిరణ్, అన్వర్, జబీ, పిచ్చిరెడ్డి, శైలజ, సతీష్, వీర్రాజు, కన్నెబోయిన సాయి, నరేష్, ఆంజనేయప్రసాద్, చిన్నా బుజ్జి, బాబు, బాజీ, మంత్రి శ్రీనివాస్, మంత్రి నాగరాజు, మాలకొండయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఆంధ్ర ముస్లిం కళాశాల విద్యార్థుల విజయభేరి

గుంటూరు తూర్పు, ఏప్రియల్ 13 ప్రభాతవార్త : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఆంధ్ర ముస్లిం కళాశాల విద్యార్థులు విజయభేరి మ్రోగించారని ఆంధ్ర ముస్లిం కళాశాల కరస్పాండెంట్, మాజీ శాసనసభ్యులు నంబూరు సుభాని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నంబూరు సుభాని మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఈ ఏడాది కార్పొరేట్ కళాశాలలకు కన్నా మెరుగైన ఫలితాలు సాధించడం విశేషమన్నారు. తమ విద్యార్థులు 95 శాతం మార్కులు సాధించారన్నారు. ఆంధ్ర ముస్లిం కళాశాల పేద మైనార్టీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కోసమే స్థాపించబడిందని, అతి తక్కువ ఫీజులతో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధిస్తు విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మహమ్మదియ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు

గుంటూరు విద్య,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్,ఆంధ్రప్రదేశ్ విడుదల చేసిన జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు మల్లవోలు లిఖిత 500మార్కులకు గాను 494, ఒ.కె.గీతిక 494,మామిడిపాక హారిణి 494 మార్కులు సాధించారు.జూనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు 490ఆపైన మార్కులుసాధించిన వారు 88మంది,480ఆ పైన మార్కులు సాధించిన వారు 495మంది,475ఆపైన మార్కులు సాధించిన వారు 649 మంది విద్యార్థులు ఉన్నారని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సిపి మట్టుపల్లి మోహన్ తెలిపారు.సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థిని నమ్మిడాల సాత్విక 982మార్కులు సాధించింది.ఈ సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు 970ఆపైన మార్కులు సాధించిన వారు 71మంది,960 ఆపైన మార్కులు సాధించినవారు 141మంది విద్యార్థులు ఉన్నారని మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను,సిబ్బందిని అడ్మిన్ అడ్వైజర్ సిపి మట్టుపల్లి మోహన్ అభినందించారు.



## ట్రినిటి గురు మండలంలో మట్టల ఆదివారం

గుంటూరు విద్య,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : యేసుక్రీస్తు ప్రభువు సకల ప్రజల పాపవిమోచన కొరకు రక్షణ కొరకు తనకుతానుగా శిలువలో బలియాగంగా మరణించుటకు అలనాడు యెరుషలేములోనికి జయంగా ప్రజలందరూ ఆయనను రాజుగా ఆహ్వానించగా ఆయన ప్రవేశించారు. ఈ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటూ కుగ్గర్ హాస్పటల్ ఆవరణలో ఉన్న ట్రినిటి గురుమండలంలో మట్టల ఆదివారం పరిశుద్ధ ఆరాధనలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనేకమంది బాప్తిస్మములు పొందారు. నిర...ణాలు పొందుకున్నారు. ఈ పండుగలో రెవ.డాక్టర్ ఆర్.జీవకిషోర్ దేవుని వాక్యం ప్రజలకు దీవెనకరంగా బోధించారు.అనంతరం రెవ.జె.డైనాశీర్వాదం, రెవ.పి.రమేష్ లు ప్రజల కొరకు ప్రార్థనలు చేశారు.ఈ పండుగలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నసీర్ పాల్గొని ప్రభువుని ఆరాధించి ప్రజలకు శుభాలు తెలియజేశారు.బత్తుల లెనిన్ ప్యారిష్ ట్రజరర్,బి.గ్రేస్ సుదర్శన,శీమరాజు శుభాలు తెలియజేశారు.



## ఎడారి ఓడ (వక్రోత్సవ జ్ఞాపిక) పుస్తకావిష్కరణ

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం ఉదయం వ్యవస్థాపక అధ్యక్షులు సహజ సాహితీ,వీరాల వడలి రాధాకృష్ణ రచించిన ఎడారి ఓడ (వక్రోత్సవ జ్ఞాపిక) పుస్తకావిష్కరణ మహోత్సవ సభ జరిగింది.సభకు ముఖ్యఅతిధులుగా సంఘ సేవకులు, నరసరావుపేట బత్తుల మురళి,గౌరవాతిథులుగా రచయిత హైదరాబాద్ గొర్రెపాటి శ్రీను,డాక్టర్ పెరుగుపల్లి బలరామ్,ఎన్. సన్యాసిరావు,అతిథులుగా తెలుగుభాష వికాస సమితి,గుడివాడ డాక్టర్ డి.ఆర్.బి.ప్రసాద్,అమ్మవడి అధ్యక్షులు ఏ.శ్రీనివాసరావు,సమన్వయకర్తగా విశాల సాహితీ సమితి హైదరాబాద్,డాక్టర్ జెల్ది విద్యాదరరావు ఆవిష్కర్తగా కవి రచయిత,అమరావతి ఎం.ప్రభాకర్,తొలిప్రతి స్వీకర్త సనాతన సారధి సంస్థ,సనాతన బాలరాజు,వందన సమర్పణ సామాజిక కార్యకర్త పలకలూరి శివరావు పాల్గొన్నారు.తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,అతిధులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.సభాధ్యక్షులుగా వడలి రాధాకృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# 365 రోజుల్లో వందపడకల ఆసుపత్రి ప్రజలకు అంకితం

## 18నెలల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తాం:

మంగళగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో కేబినెట్ లోనే వందపడకల ఆసుపత్రి శాంక్షన్ చేయించా, ఈరోజు శంకుస్థాపన చేశా. 365రోజుల్లో పూర్తిచేసి మీకు అంకితం చేస్తానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గం ఎర్రబాలెంలో మనఇల్లు - మనలోకేష్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ, సలాం సెంటర్, ఉండవల్లి సెంటర్, సీతానగరం, పద్మశాలి బజార్ కు చెందిన 354 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిలో కమిట్ మెంట్ ఇచ్చా, జిఓ ఇవ్వాలని రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కోరా. ఎప్పుడూ లేనివిధంగా 90రోజుల్లో ఆయన ఫైల్ కేబినెట్ ముందుకు తెచ్చారు. భూగర్భ డ్రైనేజి, నీరు, గ్యాస్, విద్యుత్ ప్రాజెక్టును జూన్ నుంచి ప్రారంభిస్తాం. పార్కులు, చెరువులు అభివృద్ధి చేస్తానని చెప్పినవిధంగానే మొదటి పార్కును ప్రారంభించా. కమ్యూనిటీ భవనాలు కావాలని చాలామంది కోరారు. ఎన్నికల సమయంలో 31 కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తానని హామీ ఇచ్చా, అందులో 17 భవనాలకు భూములు కనుగొన్నాం, రెండింటి నిర్మాణాలు ప్రారంభించాం. 18నెలల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు పూర్తిచేస్తాం. గత ప్రభుత్వంలో రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉండేవో చూశాం. మన ప్రభుత్వం వచ్చాక గుంతలు పూడ్చాం.

### మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

పిపిపి విధానంలో మంగళగిరి - తెనాలి ఫోర్ లైన్ రోడ్డు చేపట్టాం. . . ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా మంగళగిరి పేరే వినపడుతోంది. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల సహకారం అవసరం. స్వచ్ఛ మంగళగిరి శ్రీకారం చుట్టాం, వెయ్యి టన్నుల చెత్త బయటకు వచ్చింది. దానికి మీరంతా ఫుల్ స్టాప్ పెట్టాలి. పారిశుద్ధ్య కార్మికులు కష్టపడుతున్నారు.

స్వచ్ఛతలో మంగళగిరి నెం.1గా ఉండాలి. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం, మీ సహకారం లేకపోతే సాధ్యం కాదు. వచ్చే సంవత్సరం నుంచి మంగళగిరిలో తిరుగుతా. మంగళగిరిలో చెత్త కనపడకూడదన్నది నా లక్ష్యం. ఏ రంగంలోనైనా మంగళగిరి నెం.1గా ఉండాలన్నదే నా లక్ష్యం. మంగళగిరి వందపడకల ఆసుపత్రిపై ఆరుసార్లు అధికారులతో చర్చించి డిజైన్ ఫైనలైజ్ చేశాం. దేశంలోనే మన ఆసుపత్రి నెం.1గా ఉండాలన్నది నా లక్ష్యం. మంచి చేయడానికి కూటమి సిద్ధంగా ఉంది, ఎమ్మెల్యేగా నేను మీకోసం నిలబడతా, పోరాడతా. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని మంత్రి నారా లోకేష్ చెప్పారు.....

## కెఎల్‌యు ఉచిత మెగా వైద్యశిబిరం

తాడేపల్లి,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : కెఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లో రెండు రోజులపాటు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు.స్మార్ట్ విలేజ్ రెవెల్యూషన్ మరియు ఆస్టర్ రమేష్ హాస్పటల్ భాగస్వామ్యంతో తాడేపల్లి మండల పరిధిలో గల నూతక్కి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ ఉచిత వైద్యశిబిరంలో చుట్టుపక్క గ్రామాలైన చిర్రావూరు,రామచంద్రపురం,మెల్లెంపూడి,రేవేంద్రపాడు గ్రామాలకు చెందిన ప్రజలకు నూతక్కి లో ఏర్పాటు చేయడం జరిగింది.వైద్య శిబిరంలో బిపి,షుగరు,ఈసీజీ,2డి ఏకాలజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ సాయి విజయ్ తెలిపారు.గ్రామాల్లో నివసించే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామపెద్ద సర్పంచి సూచించారు.ఇలాంటి కార్యక్రమాలు మరల ఏర్పాటు చేస్తామని యూనివర్సిటీ స్టూడెంట్ యాక్టివిటి సెంటర్ డైరెక్టర్ పి.సాయి విజయ్ ప్రజలకు సూచించారు.కార్యక్రమానికి విశేష స్పందన లభించింది, సుమారుగా 500మందికి పైగా గ్రామస్తులు ఈ సేవలు వినియోగించుకున్నారు.కెఎల్‌యు కి అంకితభావంకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుందని గ్రామపెద్ద సూరిబాబు తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా పట్టణ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ,పరిరక్షణ తగ్గించడానికి ఉపయోగపడుతుందని గుడి చైర్మన్ వెంకటేశ్వర్లు సూచించారు.ఆరోగ్యసేవలు నేరుగా గ్రామంలోనికి తీసుకురావడం వృద్ధులకు చాలా బాగా ఉపయోగపడిందని భీమిరెడ్డి సామిరెడ్డి తెలిపారు.కార్యక్రమానికి సమన్వయకర్తలుగా పి.వి.సత్యనారాయణ,టి.శివకృష్ణ,ఆర్గనైజర్ గా మహ్మద్ నూర్,మహాలక్ష్మీ,సేఫ్ లైఫ్ క్లబ్ టీమ్,విద్యార్థి సమూహం పాల్గొని విజయవంతం చేశారు.



## మంగళగిరి టిడ్కో కాలనీలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన మంత్రి లోకేష్

మంగళగిరి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: మంగళగిరి పట్టణం టిడ్కో కాలనీలో దివీస్ లేబొరేటరీస్ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా టిడ్కో కాలనీకి చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక ప్రజానీకం, కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతి ఇచ్చి మంత్రి లోకేష్ కు స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ప్లాంట్ మొత్తం కలియతిరిగి దివీస్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటర్ క్యాన్ ను మంచినీటితో నింపి మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ సంస్థ సీఎస్ఆర్ హెడ్ జి.నగేష్, కూటమి నేతలు పాల్గొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రూ.3 కోట్ల వ్యయంతో 19 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు..మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా దివీస్ లేబొరేటరీస్ సంస్థ రూ.3 కోట్ల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల 19 ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేయడం జరిగింది. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద 4, మంగళగిరి టిడ్కో కాలనీలో 2, పెనుమాక టిడ్కో గృహసముదాయం వద్ద 2, నిడమర్రు టిడ్కో గృహసముదాయం వద్ద 1, నవులూరు టిడ్కో గృహసముదాయం వద్ద 1, ఇప్పటం గ్రామంలో 1, కాజ వద్ద 2, చిర్రావూరు గ్రామంలో 1, చినకాకానిలో 1, ఆత్మకూరు హౌసింగ్ లేఅవుట్ లో 1, కాటమరాజు కొండూరులో 2, ప్రాతూరు గ్రామంలో 1 మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటుచేయడం జరిగింది.......



## కెఎల్‌యు లో నేడు మహిళా మహోత్సవం

తాడేపల్లి,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : కెఎల్‌యు డీమ్డ్ యూనివర్సిటీలో నేడు ఫెమ్ ఫ్లేర్ పేరుతో మహిళా మహోత్సవం భారీ ఏర్పాట్ల మధ్య జరగనున్నట్లు ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తెలిపారు.ఈ సదస్సుకు ముఖ్యఅతిధులుగా సరిత ఐపిఎస్ అధికారిణీతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఆమె తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆయా విశ్వవిద్యాలయాలు,ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.మహిళా అధ్యాపకులు,విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ,ప్రొఫెసర్ విసీలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,చైర్ పర్సన్ డాక్టర్ రూత్ రమ్య,డాక్టర్ ఐ.గోవర్ధిని,డాక్టర్ సిహెచ్ శ్రీకావ్య,కన్వీనర్లు డాక్టర్ కె.సోని,డాక్టర్ హరిత,డాక్టర్ ఎ.ప్రియా,డాక్టర్ పి.లక్ష్మీప్రసన్న,డాక్టర్ వి.శైలజ,డాక్టర్ పి.రాజరాజేశ్వరీ,డాక్టర్ శాంతిశ్రీ,డాక్టర్ కోనేరు స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌జి గ్రాండ్ గెస్ట్ రూమ్స్ ప్రారంభం

మంగళగిరి,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామ పరిధిలోని తెలుగుదేశం సెంట్రల్ పార్టీ ఆఫీసు దగ్గరలో ఏపిఎస్పీ 6వ పటాలం రోడ్డు నందు ఎల్‌జి గ్రాండ్ గెస్ట్ రూమ్స్ ను గుంటూరు జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,శ్రీగంగా భ్రమరాంభ శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ భోగి కోటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు.కార్యక్రమంలో తాడేపల్లి మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు,తెలుగుదేశం పార్టీ మంగళగిరి పట్టణ తెలుగు యువత భోగి వినోద్,పెనుమాక గ్రామాధ్యక్షుడు బాబీ,4వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నల్లగొర్ల రామకృష్ణ,5వవార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జొన్నాదుల రామాంజనేయులు,తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు చీకుల వెంకటేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం సభ్యులు తోట సాంబయాదవ్,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అదనపు ఆహార స్టోరేజ్‌కి తెలివైన మార్గం

విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : గృహోపకరణాల అగ్రగామి వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా నుంచి భారతదేశపు అత్యంత వేగవంతమైన కన్వర్టబుల్ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది. ఇంటెలిఫ్రెష్ ప్రో శ్రేణి టాప్ మౌంట్ (ఫాస్ట్-ఫ్రీ) రిఫ్రిజిరేటర్లు అదనపు ఆహారాన్ని స్టోర్ చేసుకునేందుకు తెలివైన మార్గాన్ని అందిస్తూ దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి.


## వైభవంగా ప్రారంభమైన డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలు

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : స్థానిక ఎల్‌విఆర్ అండ్ సన్స్ క్లబ్ మరియు రీడింగ్‌రూమ్,కొరిటెపాడు వేదికగా డాక్టర్ మురళీమోహన్ 52సంవత్సరాల కళారంగ ప్రస్థానం,గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి,వైకే నాగేశ్వరరావు సంయుక్తంగా ఏప్రిల్ 13నుంచి 16వరకు నిర్వహిస్తున్న నాటకోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి.తొలుత కార్యక్రమాలను ఉత్సవ కమిటీ చైర్మన్ ఘంటా పున్నారావు,ఎల్‌విఆర్ క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు,కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు తదితరులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.కళాసాధ ఆధ్వర్యంలో బిళ్ళ అశోక్ బృందం మురళీమోహన్ నటించిన చిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలాపించారు.సభా కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డాక్టర్ మాగంటి మురళీమోహన్ పురస్కార గ్రహీతలు గుమ్మడి గోపాలకృష్ణ,మహ్మద్ అహ్మద్ షరీఫ్,పెమ్మసాని రవికుమార్,గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నజీర్,పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, కుమార్ పంప్స్ కొత్త సుబ్రహ్మణ్యం,వైసిని నిర్మాత నన్నపనేని సుధాకర్,ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ కాట్రగడ్డ ప్రసాద్,కళ్ళం సంస్థలు కళ్ళం మోహనరెడ్డి,పలు ప్రాంతాల ఎన్టీఆర్ కళాపరిషత్ అంబటి మధుమోహన్‌రెడ్డి,ఈదర హరిబాబు,అట్లూరి నారాయణరావు,శ్రీమిత్రా సంస్థలు ఎం.వి.చౌదరి,ఎల్.వి.ఆర్.క్లబ్ ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి,కార్యదర్శి యాగంటి దుర్గారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ,మహ్మద్ అహ్మద్ షరీఫ్‌లకు డాక్టర్ మాగంటి మురళీమోహన్ ఆత్మీయ పురస్కారాలను ఆడించి ఘనంగా సత్కరించారు.డాక్టర్ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ తనకు సభలోఉన్న అనేకమందికి అవినాభావ సంభందం ఉందన్నారు.సాంప్రదాయ కళలను ఆదరిస్తూ నాటకరంగ అభివృద్ధికి కృషిచేస్తున్న ఎల్‌విఆర్ క్లబ్ వారిని ప్రత్యేకంగా కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ కృషి అభినందనీయమన్నారు.వై.కే.నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ నిర్వాహకులు లంక లక్ష్మీనారాయణ,డి.తిరుమలేశ్వరరావు,మల్లికార్జునరావు,జానీ భాష తదితరులు పర్యవేక్షించారు.




## వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసెఫ్ పార్టీకి రాజీనామా

గుంటూరు విద్య,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : వైసీపిలో జిల్లా అధికార ప్రతినిధిగా,సంయుక్త కార్యదర్శిగా వివిధ పదవుల్లో పార్టీకి సేవలందించి ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న అత్తోట జోసెఫ్ పార్టీకి రాజీమానా చేసిన విషయాన్ని ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు..కష్టపడి పనిచేసే నాయకులకు,కార్యకర్తలకు తగిన గౌరవం గుర్తింపు లేదని,పార్టీలో ఉంటే ఉండండి పోతే పొండి అంటూ జిల్లా నాయకత్వం కార్యకర్తలు,నాయకులు పట్ల ఉదాసీనత వైఖరిలో ఉండడంవ చాలా బాధాకరమని అత్తోట జోసెఫ్ పేర్కొన్నారు.



## ఘనంగా మట్టల ఆదివారం

ఎ కొండూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం కంభంపాడు సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం పర్వదినాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ కొండూరు ప్లీనరీ చైర్మన్ గంటా రాజేశ్వరరావు, పాస్టర్ మత్తే రాజ్‌కుమార్, సంఘ పెద్ద కొచ్చర్ల రాజు మరియు యూత్ స్త్రీల మైత్రీవార సంఘస్తులు పాల్గొని కంభంపాడు పట్టణ పురవీధులన్నీ తిరిగి దేవుని నామం మహిమ కలిగే విధంగా భారీ ర్యాలీ నిర్వహించారు.



## ఘనంగా సూఫీ ధార్మిక సిద్ధాంత మహాత్మ అతావుల్లా బాబా ఉర్సు తేర్‌వీ షరీఫ్

ఎ కొండూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : అలుపెరుగని అన్నదాత సూఫీ ధార్మిక సిద్ధాంత మహాత్మ నఖీబుల్ ఔలియా హాజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా మహాత్ముల వారి తేర్‌వీ షరీఫ్ ధార్మిక కార్యక్రమాన్ని అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి ఎండి ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అత్యంత ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అతావుల్లా బాబా దివ్య సమాధి సందర్శించి చాదర్ ఈతర్ పూలు సమర్పించి బాబా వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని అల్లాకు దువా (వేడుకోలు) జరిపారు.



## అధ్యాపక ఉపాధ్యాయ సేవలు ఎనలేనివి

గుంటూరు విద్య,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : రాష్ట్రంలోని ప్రైవేట్ అధ్యాపక ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వారి సేవలు ఎనలేనివని తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు.ఆదివారం స్థానిక ఆంధ్రక్రైస్తవ కళాశాల్లోని అసెంబ్లీ హాల్లో సదరన్ ప్రవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అవార్డు 2025 ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిధులుగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్,మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్‌లు హాజరయ్యారు.ఎమ్మెల్యే తెనాలి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గర్వించదగినదని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమానికి గౌరవ అతిధులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.కన్నామాస్టారు,అపూస్మా రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ కాటూరి వేంకటేశ్వరరావు,కంభం కందులు పాలెం,ఎం.జి.కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కరస్పాండెంట్ ఏ.గఫార్,ఏ.గోరీ లాంప్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్,విజ్ఞాన్ భారతీ హైస్కూల్ డైరెక్టర్ కె.ఆర్.శేషాద్రి రావు హాజరయ్యారు.ప్రత్యేకాతిధులుగా ఆంధ్రక్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్,ఆంధ్ర న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.రాణిశ్రీఅమృత వర్షిణి లు హాజరయ్యారు.ఉభయ తెలుగు రాష్ట్రాలనుండి అత్యధిక సంఖ్యలో అవార్డు గ్రహీతలు కార్యక్రమానికి హాజరై అవార్డులు పురస్కారాలను అందుకున్నారు.కార్యక్రమం నిర్వహణ కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.నాగయ్య కె.గోవిందరాజులు,కొండపల్లి విల్సన్,పిఆర్ రతన్‌కుమార్ ఎన్వీఎస్ రఘు ప్రదీప్ ఎం.రాకేష్,పిఎస్ ఆదిత్య డి.నాగమణి ఎస్‌పి రసూల్ తదితరులు విస్తృతమైన సహకారాలు అందించి కార్యక్రమం విజయవంతం కావడానికి దోహదపడ్డారు.



## సామాజిక పరివర్తనా శిఖరం భారతరత్న,జన నాయక్ కర్పూరి ఠాకూర్

--ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు విద్య,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : అత్యంత నిరుపేద నాయీబ్రాహ్మణ సమాజంలో జన్మించి రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా, మండల కమీషన్ చైర్మన్‌గా దేశంలోని వెనుకబడిన ప్రజలకు 27శాతం రిజర్వేషన్లు అమలుకు కృషిచేసి కొట్లాది మంది హృదయాల్లో వెలుగులు నింపిన భారతరత్న జననాయక్ కర్పూరి ఠాగూర్ బిసి వర్గాల ఇలవేల్పని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు కొనియాడారు.జన నాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు ఐటి హాస్పటల్ ఎదురు కీర్తిశేషులు కర్పూరి ఠాకూర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్,నగర ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీలా,పెమ్మసాని రవి,రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివమ్ తదితరులతో కలసి విగ్రహావిష్కరణ అనంతరం జరిగినసభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా బడుగు వర్గాల అభ్యున్నతికి జీవితకాలం పనిచేసిన కార్పొరేట్ ఠాకూర్ జననాయకునిగా ప్రజల నీరాజనాలందుకున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీగుంటూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి కందుకూరి వెంకట్,విగ్రహ కమటీ గో చైర్మన్ సాంబశివరావు,కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ,కోశాధికారి ముక్కాడాల బాలతాత,బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు,డాక్టర్ గడ్డం వేణుగోపాల్,డాక్టర్ నిమ్మల శేషయ్య,బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుంటుపల్లి శివపూర్ణయ్య,స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ,పలు బిసి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భారత సమాజాన్ని నిరంతరం నడిపిస్తున్న మహాశక్తి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త : భారత సమాజాన్ని నిరంతరం నడిపిస్తున్న మహాశక్తి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఆయన భావాలకు మరణం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.ఆదివారం స్థానిక లాడ్జిసెంటర్ లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్ర సంఘటన్ గుంటూరు మరియు జీఎంసి సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం లాడ్జి సెంటర్ కూడలిలో ఘనంగా జరిగాయి.తొలుత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాజ్య సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ రాజ్యాంగ ప్రవేశికను పాల్గొన్న అందరితో చదివించారు.లాడ్జిసెంటర్‌నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు జరిగిన పాదయాత్రకు గళ్ళా మాధవి పచ్చజెండా ఊపి ప్రారంభించారు.సుమారు 5కిమీ జరిగిన ఈ పాదయాత్రలో సుమారుగా 600మందికి పైగా పాల్గొని నినాదాలు,ప్లకార్డులతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## బకాయి చెల్లింపులపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలి

విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :ఉద్యోగులకు గత 5ఏళ్ళుగా బకాయి పడిన రూ.25వేల కోట్ల చెల్లింపులకు సంబంధించి రాబోయే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యవేదిక చైర్మన్ కెఆర్ సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం నిర్వహించారు ఇప్పటికి ప్రభుత్వం 2023 జులై నుండి అమలుకావాల్సిన 12వ వేతన సవరణ సంఘానికి ఎలాంటి కమీషన్ ఏర్పాటు చేయలేదని వెంటనే హైకోర్ట రిటైర్ జడ్జి నేతృత్వంలో త్రిసభ్య కమిటీతో కూడిన వేతన సవరణ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఐద్యవేదిక కో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, పెన్షన్ సంఘాల అధ్యక్షుడు రామచంద్రరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ విఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు, ఐక్యవేదిక వైస్ చైర్మన్ కేదారేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ రవీంద్రబాబు, సెక్రటరీ జనరల్ నరసింహరావ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు, ఐక్యవేదిక సభ్య సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఘనంగా మట్టల ఆదివారం ఉత్సవం

తిరువూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : తిరువూరులో ఆర్‌సిఎం చర్చి వద్ద నుండి పట్టణ పురవీధుల్లో మట్టల ఆదివారం సందర్భంగా ఫాదర్ జంగం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.



14-4Pg5.qxd:14-4Pg5.qxd 14/04/25 10:44 PM Page 1




# కాలుష్య కాసారాలుగా భారత్‌నగరాలు

## వర్షపాతం సైతం ఆమ్లభరితంచేస్తున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** వాయు కాలుష్యం దేశంలోని అనేక నగరాల్లో వర్షపాతాన్ని మరింత ఆమ్లంగా మారుస్తున్నట్లు తేలింది. దేశంలోని పలు నగరాల్లో వాయు కాలుష్యంపై భారత వాతావరణ సంస్థ (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ(ఐఐటీఎం) కలిసి కీలక విశ్లేషణ చేశాయి. విశాఖపట్నం, అలహాబాద్, మోహన్ బారి (అసోం) వంటి నగరాల్లో వాయుకాలుష్యం వర్షపాతాన్ని మరింత ఆమ్లంగా మారుస్తుందని విశ్లేషణలో తేలింది. థార్ ఎడారి నుంచి వచ్చే దుమ్ము జోధ్‌పుర్, పుణె, శ్రీనగర్‌లో వర్షపాతాన్ని మరింత క్షారంగా మారుస్తున్నట్లు అధ్యయనంలో తేలింది. దేశంలోని పది నగరాల్లో నమోదయ్యే వర్షపాతం తాలుక ఆమ్లత్వం, క్షారత్వాన్ని కొలిచే పీహెచ్ విలువలను ఐఎండీ ఖిమెట్ మోనోగ్రాఫ్‌గా తెలిపింది. వాతావరణ పరిస్థితులు, స్థానిక ఉద్గారాలు వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పిన ఐఎండి ఆమ్ల, క్షార వర్షం రెండూ విషపూరిత ప్రభావాలను కలిగిస్తాయని పేర్కొంది. 'ఆమ్ల, క్షార వర్షాలు జలచరాలు, వృక్షజాల జీవితంపై ప్రభావితం చేస్తాయి. చమురు శుద్ధి కర్మాగారం, విద్యుత్ ప్లాంట్, ఎరువుల కర్మాగారం వల్ల విశాఖపట్నంలో కురిసే వర్షాల్లో ఆమ్లత్వం ఉంటుంది. మోహన్ బారిలో అక్కడి నేల ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంది. థార్ ఎడారి నుంచి వచ్చే దుమ్ము వల్ల జోధ్ పుర్, శ్రీనగర్‌లోని వర్షపు నీరు ఆమ్ల స్వభావంతో ఉంటుంది. తద్వారా ఈ నగరాల్లో వర్షాల పీహెచ్ విలువ పెరుగుతుంది. వర్షాకాలం కంటే ఎండాకాలంలో వర్షపాతం కొంచెం ఎక్కువ ఆమ్లం స్వభావంతో ఉంటుంది. అయితే దేశంలోని పది నగరాల్లో వర్షపాతం కాలక్రమేణా మరింత ఆమ్లంగా మారింది." అని పరిశోధనలో తేలింది.ఐఎండీ అనాలసిస్ ప్రకారం 1987-2021 వరకు 10 గ్లోబల్ అట్మాస్ఫియర్ వాచ్ స్టేషన్లలో నిర్వహించిన పరిశోధనలో చాలా ప్రదేశాల్లో కాలక్రమేణా వర్షపు పీహెచ్ విలువ తగ్గుతోంది. ఈ ధోరణి వర్షపు నీరు మరింత ఆమ్లంగా మారుతున్నట్లు సూచిస్తుంది. ముఖ్యంగా అధిక వాయు కాలుష్యం ఉన్న పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో ఈ మార్పు కన్పిస్తోంది. వైజాగ్, మోహన్ బారి, అలహాబాద్ వంటి గ్లోబల్ అట్మాస్ఫియర్ వాచ్ స్టేషన్లు ఎక్కువ ఆమ్ల సగటు పీహెచ్ విలువలను నమోదు చేస్తున్నాయి. జోధ్ పుర్, శ్రీనగర్ ఎక్కువ ఆల్కాలీన్ విలువలను కలిగి ఉన్నాయి. ఇది వాతావరణ పరిస్థితులలో వైవిధ్యాన్ని, వర్షపు నీటిని ప్రభావితం చేసే విలువలను సూచిస్తుంది అని అనాలసిస్‌లో తేలింది.

# ట్రంప్ కేబినెట్ మీట్‌లో మస్క్ 'టాప్‌సీక్రెట్' నోట్?




**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ కి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారిథిగా వ్యవహరిస్తున్నారన్నది తెలిసిందే. ఇటీవలే ట్రంప్ క్యాబినేట్ సమావేశం నిర్వహించగా అందులో పాల్గొన్న మస్క్ షాకింగ్ నోట్ రాశారు. ముఖ్యంగా టాప్ సీక్రెట్ అని తన నోట్ ప్యాడ్‌పై రాసి పెట్టుకున్నారు. ఇది కాస్తా మీడియా కంట్లో పడగా క్లిక్ మనిపించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అయితే అలా ఎందుకు రాశారని మస్క్‌ను అడగ్గా.. షాకింగ్ రిప్లై ఇచ్చారు. అగ్రరాజ్యం అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్)ని ఏర్పాటు చేసి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను అధినేతగా ప్రకటిం చారు. అయితే ఈశాఖ ఇచ్చిన సలహాలతో అమెరికాలోని అనేక మంది ఫెడరల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు.ఇలా పెద్ద మొత్తంలో వ్యయాన్ని తగ్గించగల్గారు. దీంతో తమ ఉద్యోగాలు పోవడానికి మస్క్ కారణం అంటూ అనేక మంది ఆయనపై విమర్శలు గుప్పించారు. ఆయనకు సంబంధించిన టెస్లా కంపెనీలపై దాడులకు తెగబడ్డారు. టెస్లాను బహిష్కరించాలని కోరుతూనే మరోవైపు ఆ కార్లను తగుల బెట్టారు. ఇంత వ్యతిరేకతగా వస్తుండగా ఆయన్ను ట్రంప్ పదవి లోంచి తొలగించ బోతున్నారంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే అవి నిజమేనని తెలుస్తోంది. ముఖ్యంగా మస్క్ పదవీ కాలం వచ్చే నెలతోనే ముగియబోతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తాజాగా డొనాల్డ్ ట్రంప్ క్యాబినేట్ సమావేశం నిర్వహించారు. అయితే ఆ మీటిం గ్‌కు వెళ్లిన మస్క్ మీడియా కళ్లన్నీ తనవైపుకు తిప్పుకున్నారు. అధికారులు అంతా చర్చిస్తుండగా మస్క్ మాత్రం తన వద్ద ఉన్న నోట్ ప్యాడ్ పై టాప్ సీక్రెట్ అని రాసి పెట్టారు. దాన్ని గుర్తించిన మీడియా ప్రతినిధులు ఫొటోలు తీయగా ప్రస్తుతం అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇది చూసిన ప్రతీ ఒక్కరూ.. దానికి అర్థం ఏంటని అడుగుతున్నారు. మరి కొందరు అయితే కావాలనే మస్క్ ఇలా రాసిపెట్టారని, ఎప్పుడూ మీడియాను ఆడుకోవడం ఆయనకు ఇష్టం అంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే తాజాగా మస్క్ దీనిపై స్పందించారు. దీన్ని రీపోస్ట్ చేస్తూ.. నవ్వుతున్న ఎమోజీని పెట్టారు. అసలు ఆయన అలా ఎందుకు పెట్టారు, టాప్ సీక్రెట్ అని రాయడానికి కారణం ఏంటా అని అనేక మంది ఆలోచిస్తున్నారు.

# వక్ఫ్ బిల్లుపై ఆగని నిరసనలు: బెంగాల్‌లో ముగ్గురు మృతి, 150 మంది అరెస్టు



**కోల్‌కతా, ఏప్రిల్ 13:** వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టంగా మారినప్పటికీ దానిపై ఇంకా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ బిల్లు విధ్వంసం సృష్టిస్తుంది. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా రెండు రోజుల క్రితం అనగా శుక్రవారం నాడు పశ్చిమబెంగాల్.. ముర్షిదాబాద్, మాల్డా, హుగ్లీ, దక్షిణ 24 పరగణా జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ముర్షిదాబాద్ ప్రాంతంలో ఇప్పటికీ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. విధ్వంసకర ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలు మోహరించేలా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే కేంద్ర బలగాల రాకను రాష్ట్ర ప్రభుత్వం తప్పు పట్టగా హైకోర్టు మాత్రం స్వాగతించింది. పశ్చిమ బెంగాల్లోని పలు జిల్లాల్లో జరుగుతున్న విధ్వంసం గురించి నివేదికలు అందాయి. వాటిని చూశాక కూడా కళ్లు మూసుకుని ఉండలేమని వ్యాఖ్యానించింది. ఇక ఇప్పటి వరకు జరిగిన అల్లర్లలో ముగ్గురు చనిపోయారని.. సుమారు 150 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం సుతి, ధులియాన్, సంసెర్ గంజ, జంగీపూర్ ప్రాం తాలలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు తెలిపారు. నిరసనలపై బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందువులు "సురక్షితంగా లేరని" ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శాంతి భద్రతల కోసం విజ్ఞప్తి చేస్తూనే.. కొన్ని రాజకీయ పార్టీలు" "రాజకీయ లబ్ధి కోసం మతాన్ని దుర్వినియోగంచేయడానికి ప్రయత్నిస్తున్నాయని" ఆరోపణలు చేయడం ఆమె వక్రబుద్ధికి నిదర్శనం అంటూ విమర్శించారు. ఇక మృతి చెందిన వారిలో ఇద్దరు తండ్రీకొడుకులు ఉండగా వారిని హర్‌గోబింద్ దాస్, చందన్ దాస్‌గా గుర్తించారు. కొందరు దుండగులు వీరిని నరికి చంపినట్లు పోలీసులు తెలిపారు. మరొక నిరసన కారుడు బుల్లెట్ గాయాలతో మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇక ముర్షిదాబాద్ ప్రాంతంలో 300 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. హైకోర్టు అత్యంత సున్నిత ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలను మోహరించేలా ఆదేశాలు జారీ చేసింది.

# కొత్తచట్టం వచ్చాక దర్గా వక్ఫ్ భూమిపై దర్యాప్తు



**సంభాల్, (యుపి), ఏప్రిల్ 13:** దేశంలో వక్ఫ్ భూముల ప్రాముఖ్యత వేరే చెప్పనక్కరలేదు. ప్రస్తుతం ఈ భూములపై చాలా సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సంభాల్ జిల్లాలోని చందౌసి వద్ద ఉన్న ఒక దర్గా వక్ఫ్ భూమి ఆక్రమణపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇటీవల సంభాల్ జిల్లాలోని జానెటా గ్రామ పంచాయతీ వద్ద ఉన్న దాదా మోజ్మియా షా దర్గా, వక్ఫ్ భూమిని అక్రమ ఆక్రమణ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ భూమిపై షాహిద్ మియాన్ అనే వ్యక్తి అనధికారంగా ప్రవేశించి, అక్కడ వైద్య క్లినిక్ నిర్వహిస్తున్నాడని ఫిర్యాదుదారు జావేద్ తెలిపారు. 2019 నుంచి ఈ భూమి "ముతవల్లి" లేకుండా ఖాళీగా ఉందని, అక్కడ జరిగే వార్షిక ఉర్స్ పండుగ నుంచి ఆదాయం పొందుతున్నారనే విషయాలు వెల్లడయ్యాయి. సంభాల్ జిల్లా తహసీల్దార్ ధీరేంద్ర ప్రతాప్ సింగ్ ఈ అంశంపై వివరణ ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ భూమి వక్ఫ్ భూమిగా నమోదు కాలేదని ఆయన పేర్కొన్నారు. అక్కడి నుంచి జరిగే ఆర్థిక లావాదేవీలు ఇప్పుడు దర్యాప్తు దృష్టిలో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా, ఈ భూమి వక్ఫ్ భూమిగా ఎందుకు క్లెయిమ్ చేయబడిందనేది కీలక ప్రశ్నగా మారింది. ఏప్రిల్ 3, 2019 నుంచి వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చింది. అందులో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. వక్ఫ్ భూముల అక్రమ ఆక్రమణ, అన్యాయ వాడకంపై కఠిన చర్యలు తీసుకోవడం అనేది ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత, వక్ఫ్ భూములపై వచ్చే ప్రతి ఫిర్యాదు తీసుకుని, సంబంధిత పత్రాలను పరిశీలించి, సమగ్ర దర్యాప్తు చేపట్టడం ప్రారంభమైంది. ఫిర్యాదు చేసిన జావేద్ ప్రకారం, వక్ఫ్ భూమిపై అక్రమంగా వైద్య క్లినిక్ నిర్వహించబడుతున్నప్పుడు, అది అనేక ప్రశ్నలను వెలుగులోకి తెస్తుంది. ఈ విషయంపై దర్యాప్తు కొనసాగుతున్నప్పుడు, షాహిద్ మియాన్ దగ్గర నుంచి అవసరమైన పత్రాలు సమర్పించాలని అధికారులు కోరారు. ఈ పత్రాలను పరిశీలించడంతో తరువాతి చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ విషయం దర్యాప్తు సమయంలో మరింత క్లారిటీ ఇచ్చేందుకు, భూమి గత లావాదేవీలు, అక్కడ జరిగే ఆర్థిక కార్యకలాపాలు వంటి అంశాలపై కసరత్తు చేయనున్నారు. వక్ఫ్ భూములపై జరిగిన అక్రమ ఆక్రమణలు, సమాజంలో తీవ్ర దుష్ప్రభావాలను కలిగిస్తాయి. ఇది ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తి కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, సామాజిక సేవల కోసం కూడా ఉపయోగపడాలి. కానీ, ఈ ఆక్రమణల వల్ల, నిజమైన వారికి ఈ భూములు అందుబాటులోకి రావడం లేదు.

ఈ క్రమంలో వక్ఫ్ భూముల విషయంలో సమాజంలో అవగాహన పెంచడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే అనేకచోట్ల కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉంది.

# ఉక్రెయిన్‌లోని భారత్ మందుల కంపెనీపై రష్యాదాడులు



**క్యీవ్, ఏప్రిల్ 13:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని భారతదేశానికి చెందిన ఓ ఔషధ కంపెనీ గోదాముపై రష్యా దాడి చేసింది. కుసుమ్ అనే కంపెనీకి చెందిన గోదాముపై శనివారం ఈ దాడి జరిగిందని దిల్లీలోని ఉక్రెయిన్ రాయబార కార్యాలయం పేర్కొంది. రష్యా కావాలనే ఇండియన్ కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించింది. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల కోసం ఔషధాలు నిల్వ చేసిన గోదాములపై రష్యా ఇలా దాడులు చేస్తోందని విమర్శించింది. భారత్‌కు తాము మిత్రులము అని చెప్పుకుంటున్న రష్యా, కావాలనే ఇలా దాడులు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించింది. అంతకుముందు ఉక్రెయిన్‌లోని బ్రిటన్ రాయబారి మార్టిన్ హారిస్ కూడా రష్యా చేసిన దాడిని ధ్రువీకరించారు. రష్యా డ్రోన్ల దాడిలో ఫార్మా కంపెనీ గోదాము పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్‌తో సహా 29 దేశాల్లో తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని కుసుమ్ హెల్త్‌కేర్ వెబ్‌సైట్‌లో ఉంది. గత కొన్ని రోజులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్, రష్యాలు కాల్పులు విరమణ చేయాలని ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. అయినప్పటికీ రష్యా, ఉక్రెయిన్‌లోని అనేక లక్షిత ప్రాంతాలపై దాడులు చేస్తూనే ఉంది. కాల్పుల విరమణపై చర్చించడానికి అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ సెయింట్ పీటర్స్ బర్గ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. అమెరికా ప్రతిపాదించిన తాత్కాలిక కాల్పుల విరమణను రష్యా నిరాకరించి నేటికి సరిగ్గా నెల రోజులు అయ్యింది. దీనితో రష్యా చేస్తున్న దాడులే శాంతికి ఏకైక అడ్డంకి అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా ఆరోపించారు. జెడ్డాలో అమెరికా మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలను సిబిహా ప్రస్తావిస్తూ, కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. కానీ రష్యా మాత్రం దీనికి నిరాకరించింది. బదులుగా షరతులు, డిమాండ్లను మా ముందు ఉంచిందని అన్నారు. ఈ మార్చి 11 నుంచి ఏప్రిల్ 11 వరకు రష్యా, ఉక్రెయిన్‌పై ఏకంగా 70 రకాల క్షిపణులను, 2,200 కంటే ఎక్కువ షాహెద్ డ్రోన్‌లను, 6,000 కంటే ఎక్కువ గైడెడ్ వైమానిక బాంబులను ప్రయోగించిందని సిబిహా అన్నారు.

# యుఎస్ సందర్శన ఓ హక్కు కాదు

## వీసా విధానంపై విదేశాంగమంత్రి మార్కో రుబియో



**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనలను మరింత కఠినంగా మార్చిన సంగతి తెలిసిందే. చిన్నచిన్న తప్పులను ఎత్తి చూపుతూ అక్కడి ప్రభుత్వం వీసాలను రద్దు చేస్తోంది. దీంతో ఎన్నో ఆశలతో చదువుకునేందుకు విదేశాల నుంచి అక్కడికి వెళ్లిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలోనే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పందించారు. వీసా విధానంపై తన వైఖరిని తెలియజేశారు. 'అమెరికా భద్రత విషయంలో ట్రంప్ విధానం సరైనదే. మా దేశాన్ని సందర్శించడం ఒక హక్కు మాత్రం కాదు. మా చట్టాలు, విలువలను గౌరవించే వారికి మాత్రమే ఇది ప్రత్యేక సౌకర్యం. విదేశాంగమంత్రిగా ఈ విషయాన్ని నేనెప్పటికీ పాటిస్తూనే ఉంటా. అమెరికా చట్టప్రకారం ఉగ్రవాద సంస్థలు, తీవ్రవాదాన్ని ప్రోత్సహిం చడం, మద్యం తాగి వాహనాలు నడపడం, చట్టవిరుద్ధంగా ప్రవర్తించడం, అమెరికన్ల రక్షణకు భంగం కలిగించినా వారి వీసాలను రద్దు చేసేందుకు హక్కు ఉంది. అమెరికా జాతీయ భద్రతను కాపాడడంతోపాటు చట్టబద్ధంగా మా దేశాన్ని సందర్శించే వారిని రక్షిస్తాం. ఎవరైనా హాని కలిగించాలని భావిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడము' అని రూబియో 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కాగా భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పలు అమెరికా కళాశాలలు పేర్కొన్నాయి. వారిలో చాలామందికి క్యాంపస్‌లలో జరుగుతోన్న పాలస్తీనా అనుకూల ఆందోళనలతో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ గతంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారనే కారణం చూపించి వీసాలను రద్దు చేసినట్లు ఇటీవల మీడియా కథనాలు వెల్లడించాయి. గతంలో చేసిన తప్పులను ఎత్తి చూపి వీసాలను అక్కడి ప్రభుత్వ యంత్రాంగం రద్దు చేస్తోంది. తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశిస్తోంది. దీంతో విద్యార్థుల్లో ఆందోళనలు మొదలవుతున్న నేపథ్యంలో స్పందించిన మార్కో రుబియో వీసా విధానంపై తమ వైఖరిని వెల్లడించారు.

# నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తునకు ఇడి నోటీసులు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కాంగ్రెస్‌కు సంబంధించిన నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. దిల్లీ, ముంబయి, లఖ్‌నవూలో ఉన్న రూ. 661కోట్ల విలువైన స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు రిజిస్ట్రార్లకు నోటీసులు పంపింది. ఈ మేరకు దిల్లీలోని హెరాల్డ్ హౌజ్, ముంబయిలోని బాంద్రా, లఖ్‌నవూలోని బిశ్వేశర్ నాథ్ రోడ్‌లోని మూడు ప్రాంతాలకు శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు ఈడీ పేర్కొంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం 2002 రూల్ 5(1), సెక్షన్ 8 ప్రకారం జారీ చేసినట్లు వివరించింది. కాగా, 2023లోనే ఈ స్థలాలను ఈడీ అటాచ్ చేసుకుంది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ సంబంధిచిన ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిందితులుగా ఉన్నారు.కాంగ్రెస్‌కు చెందిన నేషనల్ హెరాల్డ్ పత్రిక, అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (తిరిలి) సంస్థలో మనీ లాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సంబంధించిన యంగ్ ఇండియన్ ప్రైవేట్ కంపెనీ తిరిలి సంస్థకు చెందిన రూ.2000 విలువైన స్థలాలను కేవలం రూ.50 లక్షలకే దక్కించుకున్నట్లు తేలింది. నేషనల్ హెరాల్డ్ బకాయి ఉన్న రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును పొందేందుకు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరపూరితమైన కుట్ర పన్నారని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి గతంలో ఆరోపించారు. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన షేర్ హోల్డర్లుగా ఉన్నారు. వీరిద్దరికి 38శాతం వాటా ఉంది.

# ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పిపంపిస్తున్న పాకిస్థాన్



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 13:**తమదేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆఫ్ఘన్‌దేశస్తులపై పాకిస్థాన్ బహిష్కరణ వేటు వేస్తోంది. 2023 సెప్టెంబరులో తొలిసారి ఈప్రక్రియ ప్రారంభించినప్పటినుంచి ఇప్పటివరకూ దాదాపు 8.60 లక్షల మందికి పైగా ఆఫ్ఘన్ శరణార్థులు పాకిస్థాన్‌ను వీడినట్లు తెలుస్తోంది. వీరిలో సుమారు ఐదు లక్షలమంది ఖైబర్ ఫక్తూంఖ్వాలోని రెండు సరిహద్దుక్రాసింగ్‌లద్వారా స్వదేశానికి తరలివెళ్లినట్లు పాకిస్థాన్ విదేశాంగశాఖ వెల్లడించింది. దేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆఫ్ఘన్ శరణార్థులను దశలవారీగా వారి స్వదేశానికి తిరిగి పంపించేయాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా 2023లో మొదటిదశ ప్రారంభించింది. సరైన ధృవపత్రాలు లేకుండా అక్రమంగా ఉంటున్నవారిని మాత్రమే తొలిదశలో తిరిగి పంపినట్లు పాక్ హోంమంత్రి తలాల్ చౌదరి ప్రకటించారు. అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఎంవొ) వివరాలను ప్రస్తావించిన పాక్ 2023 సెప్టెంబ 15నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ ఉన్న లెక్కలను పరిశీలిస్తే మొత్తం 8,61,763 మంది ఆఫ్ఘన్ దేశస్తులు పాకిస్థాన్‌ను వీడి తమ స్వదేశం వెళ్లిపోయినట్లు తేలింది. ఆఫ్ఘన్ సిటిజన్ కార్డు ఉన్నవారంతా మార్చి 31నాటికి తమ దేశం విడిచి వెళ్లాలని లేదంటే వారిపై బహిష్కరణ వేటు తప్పదని జనవరిలో పాకిస్థాన్ హెచ్చరించింది. తాజాగా వారిని బహిష్కరించే చర్యలను ఏప్రిల్ ఒకటినుంచి ప్రారంభించింది. దీనికింద ఇప్పటి వరకూ 16 వేలమందికిపైగా ఆఫ్ఘన్ సిటిజన్ కార్డుదారులు పాకిస్థాన్ వీడివెళ్లారు. వారిలో తొమ్మిదివేలమందికిపైగా స్వచ్ఛందంగానే వెళ్లపోగా ఆరువేలమందిపై పాకిస్థాన్ బహి ష్కరణ వేటువేసింది.

# తజకిస్థాన్‌లో భూకంపం: రిక్టర్‌స్కేలుపై 6.4గా నమోదు




**దుషాన్‌బే(తజకిస్తాన్), ఏప్రిల్ 13:** తజికిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.4గా నమోదైంది. ఉదయం 9.54 గంటలకు ఇది సంభవించింది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. మయన్మార్‌లో మరోసారి భూకంపం సంభవించింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం, ఆదివారం ఉదయం మయన్మార్‌లోని చిన్న నగరమైన మెయిక్టిలా సమీపంలో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. వాస్తవానికి గత నెలలో సంభవించిన భూకంపం ధాటికి దెబ్బతిన్న మాండలే, రాజధాని నగరం నేపిడా మధ్య తాజా భూకంప కేంద్రం ఉన్నట్లు సమాచారం. మార్చి 28న మయన్మార్‌లో 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం భారీ ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం కలిగించింది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 3,649 మందికి పైగా మృతి చెందగా, 5,018 మంది గాయపడ్డారని మయన్మార్ సైనిక ప్రభుత్వ ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ తున్ తెలిపారు. తీవ్ర భూకంపంతో అతలాకుతలమైన మయన్మార్‌లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మాండలే, నేపిడాలో రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా శోధిస్తున్నారు. సహాయక చర్యల కోసం ఇప్పటికే "ఆపరేషన్ బ్రహ్మను" ప్రారంభించిన భారత్, తాజాగా రెస్క్యూ ఆపరేషన్ కోసం నాలుగు కాళ్లుండే రోబోటిక్స్ మ్యూల్స్‌ను, నానో డ్రోన్లను పంపింది. వీటి సాయంతో శిథిలాల కింద వెతుకుతున్నారు. సిబ్బంది వెళ్లలేని చోటుకి వీటిని పంపి గాలిస్తున్నారు. భారత్ ఇప్పటికే ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా 31 టన్నుల సామగ్రిని సీ17 గ్లోబ్‌మాస్టర్ విమానంలో మయన్మార్‌కు పంపింది. మాండలేలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భారత ఆర్మీ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని కూడా అందజేసింది. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ ఆసుపత్రి భూకంప క్షతగాత్రులకు వైద్య సేవలను అందిస్తోంది. భారత నౌకాదళానికి చెందిన "ఐఎన్ఎస్ ఘరియాల్" వందల టన్నుల ఆహారాన్ని తిలావా ఓడరేవుకు చేర్చింది. మరోవైపు క్వాడ్ దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్‌లు మయన్మార్‌ను ఆదుకునేందుకు ఇటీవల 20 మిలియన్ డాలర్ల మానవతా సాయాన్ని ప్రకటించాయి.

# రాజ్యాంగేతర శక్తిగా ఢిల్లీ సిఎం భర్త మనీష్ గుప్తా

## మాజీ సీఎం అతిశి సోషల్‌మీడియా ఫొటో వైరల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** దేశరాజధాని ఢిల్లీ రాజకీయాలు ప్రస్తుతం మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా భర్త మనీష్ గుప్తాపై ఆరోపణలు చేసిన ప్రతిపక్ష నేత మాజీ సీఎం అతిషి సోషల్ మీడియాలో ఒక ఫోటోని షేర్ చేశారు. అందులో, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, ఢిల్లీ జల్‌బోర్డు, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ , ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న వ్యక్తి రేఖ గుప్తా భర్త మనీష్ గుప్తా అని అతిషి పేర్కొన్నారు. మనీష్ గుప్తా ప్రభుత్వ అధికారులు సమావేశంలో పాల్గొన్నట్లు కనిపిస్తున్నారు. ఈ క్రమంలో అతిషి తన పోస్టులో ఇలా పేర్కొన్నారు. ఒక మహిళ గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి తర్వాత, ప్రభుత్వ పనులన్నీ ఆమె భర్తే చూసుకుంటారని ఇది వరకు చూశాం. కానీ ఇప్పుడు ఢిల్లీకి ఒక మహిళ ముఖ్యమంత్రి కావడం, ప్రభుత్వ పనులన్నీ ఆమె భర్తే చూసుకోవడం ఇదే మొదటిసారి అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలకు ఢిల్లీ బీజేపీ స్పందించింది. బీజేపీ నేత వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ అతిషి స్వయంగా ఒక మహిళ అయినప్పటికీ, మహిళా నాయకురాలిని అవమానించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అయితే రేఖ గుప్తా భర్త మనీష్ గుప్తా ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త. రేఖ గుప్తా ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ ప్రకారం,వృత్తిరీత్యా వ్యాపారవేత్త అయిన మనీష్‌గుప్తా సంస్థ పేరు నికుంజ్ ఎంటర్‌ప్రైజెస్.మనీష్ గుప్తా కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఏజెన్సీ అసోసియేట్ కూడా. ఈ సంవత్సరం ప్రారంభంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత, రేఖ గుప్తా తన విజయానికి తన భర్తే కారణమని చెప్పుకొచ్చారు. ఈ వివాదం మరింత పెరుగుతుందా లేదా అనేది చూడాలి మరి.

14-4Pg6exHMNWJQE.qxd:14-4Pg6exHMNWJQE.qxd 14/04/25 11:50 PM Page 1



# హిందువుల మనోభావాలతో భూమన ఆటలు: మంత్రి సవిత

**విజయవాడ.ఏప్రిల్13.ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది మంది హిందువుల మనోభావాలతో వైకాంగ్రెస్ నాయకుడు భూమన కరుణాకర రెడ్డి ఆటలాడు కుంటున్నారని, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు పన్నుతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. ప్రజల ఛీత్కారానికి గురైనా బుద్ధి రాలేదని, అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడానికి వెనుకాడడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ గోశాలలో వంద గోవులు మరణించాయంటూ తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందువుల ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వెంకన్నపై గతంలో భూమన కరుణాకరెడ్డి అవాకులు చవాకులు పేలారన్నారు. అదో నల్లరాయి...దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలు ఎవరూ మరిచిపోరన్నారు. అటువంటి దిగజారుడు వ్యక్తి నేడు టీటీడీ గోశాలలో గోవులు మరణించాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.



ఎక్కడో మృతిచెందిన పశువుల మృతదేహాల ఫొటోలను చూపిస్తూ తిరుమలలో చనిపోయాయంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. హిందువుల దైవాన్ని కించపరిచిన భూమన వ్యాఖ్యలను, వైసీపీ నాయకులను ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తిరుమల తిరుపతిలో అన్యమత ప్రచారానికి వెన్నుదన్నుగా భూమన నిలిచిన విషయం ప్రజలకు తెలుసన్నారు. నాస్తికుడిని అని స్వయంగా ప్రకటించికున్న కరుణాకరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఫ్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు అమ్ముకోవడం వంటి దుశ్చర్యలకు భూమన పాల్పడ్డారని మంత్రి సవిత ఆరోపించారు. తెలుగు ప్రజల కుల దైవంతో రాజకీయాలు చేయడం మానుకోవాలని, లేకుంటే సరైన గుణపాఠం నేర్పుతామని ఆ ప్రకటనలో భూమనకు మంత్రి సవిత హెచ్చరించారు.

**త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు విడుదల చేయాలి**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 2024- 25 బడ్జెట్లో చేనేతకు త్రిఫ్ట్ ఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని జయభేరి అపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గత నిధులను విడుదల చేయకపోగా 202526 బడ్జెట్లోనూ రూ.5 కోట్లు కేటాయించినట్లు శాసన మండలిలో మంత్రి చెప్పారని గుర్తు చేశారు. చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్, పావలా వడ్డీ రిబేటు కింద ఇవ్వాల్సిన రూ.156 కోట్లు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. నాబార్డ్‌కు వడ్డీలు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీస్తున్నాయన్నారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు మార్గదర్శకాలను విడుదల చేయాలని, 30 శాతం రిబేటును ఏడాది మొత్తం కొనసాగించాలని, మగ్గం వేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రయివేట్ సెక్టార్‌లో చేనేత కార్మికులకు త్రిఫ్ట్ అమలు జరపాలని, పట్టు, జరీ నూలు ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శివదుర్గారావు, కార్యదర్శి డి.రామారావు, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి దుర్గేష్

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం: మంత్రి దుర్గేష్

**విజయవాడ ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** భారతరత్న డా. భీమ్‌రావు అంబేద్కర్ 135వ జయంతిని మంత్రి కందుల దుర్గేష్ నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ గారు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రపం చంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రచించి ప్రజల అవసరాలు, హక్కులను తెలిపిన మహానుభావుడిగా అభివర్ణించారు. భారతదేశంలో అణగా రిన కులాల సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి ప్రకటనలో పేర్కొన్నారు. అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం, దురహంకారంపై గొంతెత్తిన స్వరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వివరించారు. న్యాయశాఖ మంత్రిగా సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి వివిధ చట్టాలు, సంస్కరణలు రూపొందించడంలో అంబేద్కర్ పాత్ర మరువలేనిది అన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు, సర్వస మానత్వానికి కృషిచేసిన కారణజన్ముడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన పోరాటాలు అనన్య సామాన్యమని తెలిపారు. భారతదేశ సమాజానికి అంబేద్కర్ చేసిన సేవలను గౌరవించి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం అని ఈ సందర్భంగా మంత్రి ప్రజానీకానికి సూచించారు.



సభలో మాట్లాడుతున్న పీఠాధిపతులు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

## ఆశల మాయలో జీవితం నరకప్రాయం

### సర్వాత్మానందగిరి స్వామి

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** జీవుడు ఆశల మాయలో చిక్కుకొని తన బంగారు మయమైన జీవితాన్ని నరక ప్రాయం చేసుకుంటున్నారని ఈ మాయ నుంచి బయటపడాలంటే గురుబోధనల ఆచరణ ఎంతో అవసరమని సర్వాత్మానందగిరి స్వామి అన్నారు. ఇక్కడి శుక బ్రహ్మాశ్రమంలో జరుగుతున్న గీతామకరంద రచయిత,ఆశ్రమ వ్యవస్థాపకుల 112వ జన్మదిన సందర్భంగాను ఆశ్రమ 75వ వార్షికోత్సవం సందర్భంగా సాధువుల సమ్మేళనం ఏర్పాటు చేసారు. ఆదివారం ఆశ్రమంలోని వేదికపై పలువురు పీఠాధిపతులు హాజరై మానవుడు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం స్వార్థం, ఇహలోక మోజుకు సంబందించి భక్తుల్ని చైతన్యవంతుల్ని చేసారు. ఈ సభకు ఆశ్రమ నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆకట్టుకున్నారు.

**మనలోని బ్రహ్మను గుర్తించాలి:** ఈ సభలో ఆశ్రమ నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ మనిషిలో తమలో నిగూడంగా దాగిని బ్రహ్మను గుర్తించలేకపోతున్నారన్నారు. కర్మ బుద్ధి అనుసారం జీవుడు నడచుకుంటాడని భగవంతుని ఆశీస్సులు లభించాలంటే కఠోర సాధన ఎంతో అవసరం అన్నారు. మనం చేసే మంచిపనులే మనల్ని కాపాడుతాయని మానవ జన్మ అత్యుత్తమైనదనే విషయం విస్మరిస్తున్నామని వివరించారు.

మనస్సును ఆదుపులో పెట్టు కున్నవాడు ప్రశాంత జీవితం గడుపుతాడన్నారు. ఈ సభలో పలు ఆశ్రమాలకు సంబంధించి పీఠాధిపతులు స్వస్వరూపానందగిరి స్వామి, విష్ణుసేవానందగిరి స్వామి శ్రీహరి తీర్థ స్వామి, శివానందగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల కొలిమిలో మెరిసిన జాహ్నవి



**విడపనకల్లు,ఏప్రిల్ 13 ప్రభాతవార్త :** శ్రమను నమ్ము కున్న వారు ఎప్పుడూ జయిస్తారు అన్న నానుడి సాక్షాత్కారమైన కథ ఇది. గడేకల్లు గ్రామానికీ చెందిన జెట్టి జాహ్నవి ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ (ఎంపీసీ)లో అత్యుత్తమంగా 990 మార్కులు సాధించి, తన ప్రతి భను నిరూపించుకుంది. బతుకు తెరువు కోసం బొంబాయికి వలస వెళ్లిన తల్లిదండ్రులు శ్రీనివా సులు, లీలావతి దంపతులు కుమార్తె విద్యా భ్యాసానికి ఎంతో కష్టపడుతున్నారు. వీరికి జాహ్నవితో పాటు ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ, తమ పిల్లల విద్యకు ఎటువంటి రాజీ పడకుండా వారిని ఉన్నత చదువులు చదివించాలనే తపనతో వారు బొంబాయిలో కష్టపడి పని చేస్తున్నారు. వారి కష్టానికి ప్రతి ఫలంగా జాహ్నవి ఈ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. అతి సామాన్య కుటుంబానికి చెందిన జాహ్నవి, తల్లిదండ్రులు దూరంగా ఉన్న ప్పటికీ, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ చదువులో అసాధారణమైన ప్రతిభ కనబరిచింది. ఆమె సాధించిన మార్కులు ప్రతి గ్రామీణ విద్యార్థికి ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ నా తల్లిదండ్రులే నాకు ఆదర్శం. వారి కష్టాలే నాకు బలం. వారి కలలను నెరవేర్చే దిశగా నేనుముందుకెళ్తాను అంటూ భావోద్వేగానికి లోనయ్యింది. జాహ్నవి భవిష్యత్తులో ఇంజనీరింగ్ చదవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆమె తన కలలను సాకారం చేసుకో వడానికి మరింత కష్టపడతానని ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జాహ్నవికి కుటుంబసభ్యులు, కళాశాల యాజమాన్యం, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.




## నదీవిహారంతో కటాక్షించిన స్వామివార్లు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుండి జరుగుతున్న చైత్రమాస బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి నిర్వహించి స్వస్తి పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల పవిత్ర మూర్తులకు వసంతోత్సవం జరిపారు. తదుపరి ధాన్యకోట్నోత్సవం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పవిత్ర కృష్ణానదిలో శ్రీ సా ్వమి అమ్మవార్లకు నదీవిహారం జరపించారు. వేదపండితులు వేదనాదాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా పవిత్ర కృష్ణానదికి తీసుకెళ్ళి అక్కడ అవభథోత్సవం జరిపిన తరువాత తిరిగి శ్రీమల్లేశ్వర స్వామివార్ల మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మూకబలి, ధ్వజావరోహణం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య వి.శివప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహక ఇంజనీర్ వైకుంఠరావు, పిఆర్ఓ గంగాధర్, ఆలయాధికారులు నరసింహారాజు, చందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అద్భుతంగా నృత్యనీరాజనం:** దుర్గమ ్మవారి ఆలయంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీ నటరాజ నృత్యనికేతన్ నాట్యాచార్యులు దుర్గాభవాని నేతృత్వంలో శిష్యబృందం అధ్భుతంగా నృత్యనీరాజనాలర్పించారు. 18 మంది కళాకారుల బృందం నృత్యనీరాజనాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, ప్రసాదం, చిత్రపటం అందించారు.

## జయప్రద ఫౌండేషన్ సేవలు విస్తృతపర్చాలి

### నేత్ర వైద్యశిబిరానికి అనూహ్య స్పందన




జయప్రద ఫౌండేషన్ మెగా నేత్ర వైద్యశిబిర ప్రారంభోత్సవంలో ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నిర్వాహకులు తొండెపు దశరధజనార్ధన్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర.

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఎన్‌టి రామారావు అందించిన స్ఫూర్తితో ఆవిర్భవించిన జయప్రద ఫౌండేషన్ సేవాసంస్థ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు మరింతగా విస్తృతపర్చాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణ శివారులోని పివిఆర్ ఫంక్షన్‌హాలులో ఆదివారం సాయంత్రం మాజీఎంఎల్‌సి, జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండెపు దశరధజనార్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శంకర్ నేత్ర చికిత్సాలయ ఎండి డాక్టర్ స్వాతి, రోటరీక్లబ్ ఆఫ్ అమరావతి చెన్నుపాటి వినయ్, జయప్రద ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు గౌతమి సరోజ, ఆపరేటివ్ ఆఫీసర్ చాముండేశ్వరి పాల్గొన్నారు. జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ దశరధజనార్ధన్ మాట్లాడుతూ తాను తెలుగుదేశం పార్టీ పాలిట్‌బ్యూరో సభ్యునిగా, పొలిటికల్ సెక్రటరీగా నిత్యం పది గంటల పైబడి పనిచేస్తున్న పరిస్థితుల్లో తన కుమారుడు, కుమార్తె కలిసి ప్రజలకు సేవ చేసేందుకు ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తన సతీమణి పేరుతో స్థాపించిన ఈ సంస్థ వితరణశీలుల సహకారంతో అసంఖ్యాక సేవా కార్య క్రమాలను నిర్వర్తించుకోవటం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగివున్న జనార్ధన్ ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తారన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జనార్ధన్ ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా ఒక ఉద్యోగిలా నిరంతరం పార్టీకి సేవ చేస్తున్నారన్నారు. ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కూడా ప్రసంగిస్తూ పేదలకు, ఆర్తులకు, విద్యార్థినీ-విద్యార్థులకు అవసరమైన విషయాలను గుర్తించి వారికి ప్రయోజనం కలిగించే విధంగా ఈట్రస్టు పనిచేస్తుండటం ప్రశంసనీయమని అభినందించారు. కాగా కార్యక్రమాల్లో జయప్రద ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు గౌతమి సరోజ, ఆపరేటివ్ ఆఫీసర్ చాముం డేశ్వరి, టిడిపి నేతలు కట్టా వెంకటనరసిం హారావు, వైవిఎస్ రెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బోయకొండ రోప్ వేకు గ్రీన్ సిగ్నల్

### రాష్ట్రంలోని మరో ఐదు ప్రాంతాల్లో ..





**పుంగనూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలు పుణ్యక్షేత్రాలలో రోప్ వే ఏర్పాటుకు కేంద్ర పర్యాటక శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయి. ప్రధానంగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు సమీపంలో శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళ్లేందుకు 0.68 కిలోమీటర్ల ఎత్తు వరకు రోప్ వే నిర్మించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు చోట్ల రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఏపీలో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఏపీలోని ఐదు ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి గానూ డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ ఐదులో చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, కర్నూలు అహోబిలం దేవస్థానం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దిగువ ఆలయం నుంచి హిల్ టాప్ వరకూ 0.68 కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి కసరత్తు ప్రారంభం కానుంది. అలాగే అహోబిలం దేవస్థానం వద్దఎగువ అహోబిలం నుంచి జ్వాల నరసింహస్వామి ఆలయం వరకూ 1.28 కిలోమీటర్లు. కోటప్పకొండ వద్ద కొండ దిగువ నుంచి ఎగువకు, పాత దేవాలయం వరకూ 1.23 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే విజయవాడలో కృష్ణా నది మీదుగా బెర్మ్ పార్క్ నుంచి భవానీ ఐలాండ్ వరకూ 0.85 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. కోరుకొండ లక్ష్మినరసింహస్వామి ఆలయం వద్ద ఆలయం ముందు నుంచి శిఖరాగ్రం వరకు 0.25 కిలోమీటర్లు రోప్‌వే ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ తయారీలో కన్సల్టెన్సీ సేవల కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు. మరోవైపు ఏపీలోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పర్యాటకులతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి సందర్శకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో ఏపీటీడీసీ ఈ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా ప్రముఖ దేవాలయాల వద్ద రోప్ వేలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఏపీటీడీసీ ఉంది. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ దేవాలయం కు వెళ్లడానికి రోప్ వే త్వరలో అందుబాటులోకి రాబోతుండ డంతో అమ్మవారి భక్తులు ఆనందోత్సా హాలు వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: ఎస్ కే రమణారెడ్డి**

ప్రముఖ శక్తిక్షేత్రం బోయ కొండ గంగమ్మ ఆలయానికి రోప్‌వే ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందదాయకమైన విషయమని బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్ కే రమణారెడ్డి వర్షం వ్యక్తం చేశారు. రోప్ వే ఏర్పాటు చేయడం వల్ల మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

## మైలేజీ కోసం మాజీ ఎంపి గోరంట్ల దురుసు ప్రవర్తన?

**అనంతపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి తరపున ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు ఉన్న హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విషయం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ సోషల్ మీడియాలో వైసిపి అధినేత సతీమణి వైయస్ భారతి పై సోషల్ మీడియాలో చేసిన కామెంట్లపై రాష్ట్రంలో కూటం ప్రభుత్వం తీవ్రంగా స్పందించి చేబ్రోలు కిరణ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కటకటాలోకి నెట్టింది. మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే ఎవరి పైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఒక హెచ్చరిక చేసే విధంగా చంద్రబాబు సర్కార్ చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు కిరణ్ అరెస్ట్ చేసి తీసుకొని వెళ్లే సమయంలో వైసిపి నాయకుడు, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహరించిన తీరు వివాదాస్పతమైంది. గోరంట్ల మాధవ్ గతంలో ఒక పోలీస్ అధికారిని భావించి పలు సందర్భాల్లో పోలీసులు సున్నితంగా వ్యవహరించి చేబ్రోలు కిరణ్ ను తీసుకెళ్లే సమయంలో తమకు అడ్డు రావద్దని చెప్పిన దృశ్యాలు, గోరంట్ల మాధవ్ అడ్డుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చర్చ నీ అంశం అయ్యాయి. ఈ సంఘటన నేపథ్యంలో గోరంట్ల మాధవ్ పై కేసు నమోదు చేయడం, ఆ తర్వాత అరెస్ట్ చేయడం, కోర్టుకు హాజరు పరచడం, రాజమండ్రి జైలుకు శుక్రవారం తరలించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఎందుకు చేబ్రోలు పై దాడి విషయంలో ఎక్కువ హడావిడి చేశారు? నిజంగా తమ నేత పై ఆరోపణ చేసినందుకేనా? లేక పార్టీ పార్టీ ముఖ్యుల వద్ద క్రెడిట్ కొట్టేందుకే అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి,మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మధ్య ఆధిపత్య పోరు ఉంది. రాప్తాడు నియోజకవర్గంలో పట్టు కోసం ఆ రెండు వర్గాలు పోటీ పడుతున్నాయి. రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య గొడవలు, వైసీపీ ఎంపీటీసీలను పోలీసులు బెదిరిస్తున్నారని ఆరోపణలు వచ్చినప్పుడు పెనుగొండ పట్టణం, ఇతర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పోలీసులపై దూసుకెల్లడం, ఇతర సమయాల్లో తనదైన శైలిలో వ్యవహరించి వైసిపి కార్యకర్తల్లో మైలేజీ సంపాదించినట్లు అభిప్రాయం ఉంది.

ఇందులో భాగంగా తాను కూడా హీరోగా వ్యవహరించి పార్టీ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వద్ద పేరు తెచ్చుకునేందుకు చేబ్రోలు కిరణ్ పై పోలీసుల సమక్షంలో దాడి చేసేందుకు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ యత్నించి ఉంటాడని అభిప్రాయం ఉంది. అయితే ఈ వ్యవహారం ఎంతోమంది పోలీసులకు, పోలీసు అధికారుల మెడకు చుట్టుకోవడం గమనిం చదగ్గ విషయం.. చేబ్రోలు కిరణ్ కదలికల పైన గోరంట్ల మాధవ్ కు పోలీసుల సమాచారం ఇచ్చారని, హాస్పటల్లో, ఇతర ప్రాంతాల్లో గోరంట్ల మాధవ్ ఫోన్ మాట్లాడుతుంటే పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించాలని, ఈ వ్యవహారంలో పలు సందర్భాల్లో పోలీసు అధికారులు సరైన రీతిలో స్పందించలేదని రాష్ట్ర ప్రభుత్వం భావించి 11 మంది పోలీసులు, అధికారులపై చర్యలు తీసుకోవడం ఆ టాపిక్ గా మారింది. గోరంట్ల మాధవ్ ఎఫెక్ట్ ఎంతోమంది పోలీస్ అధికారులపై పడడం తెలుగు రాష్ట్రాల్లో చర్చిని అంశంగా మారింది. గోరంట్ల మాధవ్ వ్యవహారంలో పోలీసు అధికారుల సీరియస్....పోలీస్ సిబ్బందిపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడు, వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గుంటూరు కోర్టులో హాజరుపర్చే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై విచారణకు గుంటూరు సౌత్ డీఎస్పీ భానోదయను నియమించారు.

మాధవ్‌ను జీజీహెచ్‌లో వైద్య పరీక్షలకు తీసుకెళ్లినప్పుడు అక్కడ ఆయన ఫోన్‌లో మాట్లాడినా బందోబస్తు సిబ్బంది అడ్డు చెప్పలేదు. మీడియా ముందు ప్రవేశపెట్టే ముందు ముసుగు వేసుకోవటానికి నిరాకరించి, తనకే ముసుగు వేస్తారా అంటూ పోలీసులపై కన్నెర చేశారు. కోర్టు వద్ద పోలీస్ వాహనంలోంచి దిగి నేరుగా న్యాయ స్థానంలోకి వెళ్లిపోయారు. ఇవన్నీ పోలీసుల వైఫల్యమేనని ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో ఆ రోజు బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ, ఎస్సైలు, సిబ్బంది నుంచి డీఎస్పీ భానోదయ వాంగ్మూలాలు నమోదు చేశారు. కస్టడీలో ఉన్న వ్యక్తికి మరో వైఎస్సార్సీపీ నాయకుడు ఫోన్ తీసుకొచ్చి ఇచ్చినా అక్కడున్న పోలీసులు పట్టించుకోకపోవడానికి కారణాలేంటీ? ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో ఆరా తీశారు.

## జగన్ నెవర్ ఎగైన్.. ఇదే నా నినాదం: ఎబివి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 13ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు వల్ల అనేక వ్యవస్థలు, ఎంతో మంది తీవ్రంగా నష్టపోయారని అందుకే ఇకపై జగన్ నెవర్ ఎగైన్ అన్నదే తన నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ఏపీ మాజీ ఇంటిలిజెన్స్ ఛీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన పలు ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావించారు.




జగన్ మళ్లీ వస్తే రాష్ట్ర అధోగతి పాలవుతుందన్నారు. త్వరలోనే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు. తన జీవితంలో కాళ్లు, చేతులు ఆడినంత వరకు సమాజంకోసం పనిచేస్తానని తన రిటైర్మెంట్ పంక్షన్‌లో చెప్పానని, అదే కొనసాగిస్తానన్నారు. రాజకీయాల్లోకి రావడం వెనుక ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రయత్నిస్తానన్నారు. గత అయిదేళ్లపాలనలో జగన్ పార్టీ విధ్వంసం సృష్టించిందని వెంకటేశ్వరరావు అన్నారు. జగన్ ఒక మోనాస్టార్ అంటూ అక్రమాలు చేసే వారికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. జనుపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తి శ్రీను జగన్ వీరాభిమాని అని, అయితే ఆయన కోసం బలి అయిన మొదటి వ్యక్తి కోడికత్తి శ్రీను అని అన్నారు. జగన్ అధికారంలో వచ్చేందుకు సాను భూతికోసమే ఆయనపై దాడికి పాల్పడినట్లు శ్రీను విచారణలో తెలిపాడని, అయితే అయిదు సంవత్సరాలు జెలులో పెట్టించి అతని జీవితాన్ని నాశనం చేశాడని, కోడికత్తి శ్రీనుకు న్యాయస్థానంలో కూడా అన్యాయం జరుగుతోందన్నారు. కోడికత్తి శ్రీనుకు తన వంతు సహ కారాన్ని అందిస్తానన్నారు. విజయ సాయిరెడ్డి సహకారంతో రూ.25కోట్లుతో మొదలు అయిన సండూర్ పవర్ ప్రాజెక్టు నెడు రూ.759 కోట్లకు చేరిందని, ఆతరువాత సాక్షిఛానెల్, భారతి సిమెంట్స్ ఇంకా అనేక అక్రమ కంపెనీలకు పెట్టుబడులు ఇప్పటికే బయటపడ్డా యని, మరిన్ని అక్రమాలు బట్టబయలవుతాయన్నారు. కోకల్లులుగా ఉన్న జగన్ కేసులపై పోరాడతాన న్నారు. జగన్ తనకు వ్యక్తిగతంగా నష్టం చేశాడు. ఆ అకౌంట్ క్లోజ్ అయ్యింది. జగన్‌పై పోరాడే విషయంలో వ్యక్తిగతమైనది ఏమీ లేదని, జగన్ సమాజానికి చేసిన కీడుపై మాత్రమే పోరాటం చేస్తానన్నారు.

## చదివింది ఆంగ్ల మాధ్యమంలో

### అన్ని సబ్జెక్ట్‌ల్లో 99శాతం, ఇంగ్లీషులో 5 మార్కులు!

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే దండే రాజేశ్వరి ఫలితాలు ఆశ్చర్యకరంగా వచ్చాయి. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఆమెకు 530 మార్కులకు 431 మార్కులొచ్చాయి. వాస్తవంగా మిగతా అన్ని పేపర్లలో 99.06శాతం మార్కులు వచ్చాయి. కానీ ఇంగ్లీష్‌లో మాత్రం 100కు కేవలం ఐదు మా ర్కులే వచ్చాయి. దీంతో ఆ విద్యార్థిని ఫలితాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. పోనీ ఆ అమ్మాయి ఇంగ్లీషు రాదమోననుకుంటే ఆమె ఇంగ్లీషు మాధ్యమంలో ఇంటర్ చదివింది. పరీక్ష పత్రం దిద్దడం, లేదంటే మార్కులు వేయడంలో పొరపాటు జరిగి ఉండొచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ 60కు 60చొప్పున వచ్చాయి. సంస్కృతం వందకు 98, మ్యాథ్స్ 2ఏ పరీక్షలో 75కి 73, మ్యాథ్స్ 2బిలో 75కి 75 మార్కులొచ్చాయి. ప్రాక్టికల్స్ 60కి 60 వచ్చాయి. కేవలం ఇంగ్లీష్‌లో మాత్రమే ఐదు మార్కులు రావడం కచ్చితంగా పొరపాటు జరగడం వల్లనేనని అంతా భావిస్తున్నారు. అయితే రీకౌంటింగ్ ప్రక్రియతో నిమిత్తం లేకుండా ఇంటర్‌బోర్డు తక్షణం స్పందించి ఈ వ్యవహారంపై ప్రకటన చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

14-4P▯g7exHMNWJQE.qxd:14-4P▯g7exHMNWJQE.qxd 14/04/25 11:51 PM Page 1



# జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి

## మూడు పైలట్ మండలాల ఎంపిక
## నేడు జాతికి అంకితం
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అందరి భూములకు భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని, భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ఈ భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో రైతుల భూముల పరిరక్షణ బాధ్యత ఈ ప్రభుత్వానిదే. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికారంలో వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని మేమిచ్చిన హామీని విశ్వసించి ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ధరణిని బంగాళాఖాతంలో వేసి అందరికీ ఆమోదయోగ్యమైన భూ భారతి చట్టాన్ని తీసుకురావడం ఇందులో రెవెన్యూశాఖ మంత్రిగా తనకు భాగస్వామ్యం అయ్యే అవకాశం వచ్చినందుకు తన జన్మ ధన్యమైందన్నారు. రాష్ట్రంలో తొలుత మూడు జిల్లాలలోని మూడు మండలాలలో ప్రయోగాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలుచేయబోతున్నామని, ఈ మూడు మండలాలలో వచ్చిన ఫలితాలను దృష్టిలో పెట్టుకొని జూన్ 2వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. భూభారతి చట్టం 2029 శాసనసభ ఎన్నికలకు మాకు రిఫరెండమని గతంలో శాసనసభ లోనే ప్రకటించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూములపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి ఒక భరోసా, భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టం రూపొందించామన్నారు. గతంలో మాదిరిగా రాత్రికి రాత్రే ఇద్దరు వ్యక్తులు కలిసి చట్టాన్ని రూపొందిస్తే మా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రైతులు మేధావులు నిపుణులతో చర్చించి చట్టాన్ని రూపొందించాం. గతంలో చెప్పినట్లుగానే భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని తెలిపారు. ఒకే సారి పోర్టల్‌లో ప్రవేశించవద్దు ఒకేసారి భూ యజమానులు తమ భూమి వివరాలు తెలుసుకునేందుకు పోర్టల్‌ను సందర్శించవద్దని మంత్రి పొంగులేటివిజ్ఞప్తి చేశారు. దీంతో మొత్తం పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. అంతేగాక కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను స్టక్ చేయాలని భావిస్తే తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికేముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారని మంత్రి తెలిపారు. కేంద్రప్రభుత్వ ఎన్ ఐ సి ఆధ్వర్యంలో నిర్వహించే పోర్టల్ లో ఆధునిక అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా పోర్టల్ అభివృద్ధి సాగుతుంది. వచ్చేనెల మొదటివారంలో గ్రామ రెవెన్యూ పాలనా అధికారులను అమలులోకి తెస్తామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామన్నారు. గతంలో ధరణిని తీసుకువచ్చిన సమయంలో దాదాపు 4 నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఇప్పుడాపరిస్థితి లేకుండా క్రమక్రమంగా పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ భూభారతి చట్టం, పోర్టల్ అమలుకు సంబంధించి ఎంపిక చేసిన ప్రయోగాత్మక గ్రామాలలో స్వయంగా తాను పర్యటిస్తానని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అదేవిధంగా సంబంధిత మంత్రులు కూడా పర్యటిస్తారని తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సిసిఎల్ వరకు సుమారు ఐదు స్థాయిలలో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాలు వికేంద్రీకరణ చేశాం. అంతేగాక ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తాం. తర్వాత కాలంలో సమస్యలు తగ్గితే ట్రిబ్యునల్స్‌ను కుదిస్తాం. ధరణిలో గతంలో ఉండే 33 మాడ్యూళ్లను ఆరు మాడ్యూల్స్‌కు తగ్గించామని దీంతో అందరికీ ఈ పోర్టల్ సులభతరంగా ఉంటుందన్నారు.



సన్నబియ్యం భోజనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

## సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు: మంత్రి శ్రీధర్‌బాబు

**కాటారం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం కాటారం మండలం, కొత్తపల్లి తండా గ్రామ నివాసి అయిన వాంకుడోతు సమ్మక్క ఇంట్లో సన్నబియ్యంతో చేసిన బోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ కార్డులున్న నిరుపేదల కుటుంబాలు సన్నబియ్యం ఆహారాన్ని భుజించాలనే సంకల్పంతో ఉగాది పండుగ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాంకు దోతు సమ్మక్క కుటుంబ సభ్యులతో ముకాముఖీ. మాట్లాడారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయి, దొడ్డు బియ్యానికి సన్నబియ్యానికి తేడా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పేదలు కడుపునిండా సన్నబియ్యంతో భోజనం చేయాలని అందుకు సన్న రకం ధాన్యం అవసరమని భావించిన ప్రభుత్వం సన్నరకం ధాన్యం సాగు చేసిన రైతులకు బస్తాకు రూ.500 బోనస్ చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారి, డిఆర్డీఓ నరేష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, ఎంపివో వీరస్వామి కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు దండు రమేష్, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షులు చీమల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కెకె మనవడు వీరంగం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు మనవడు ధృవ్ విప్లవ్ హల్‌చల్ చేశారు. మద్యం మత్తులో ఆదివారం ర్యాష్ డ్రైవింగ్ చేశారు. ఓ ట్రాలీ ఆటోను ఢీకొట్టి.. అలాగే దూసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ధృవ్ కారును ఛేదించారు. అనంతరం ధృవ్‌ను అదుపులోకి తీసుకొని బ్రీత్ అనలైజర్‌తో బంజారాహిల్స్ పోలీసులు టెస్టులు నిర్వహించారు. ఈ బ్రీత్ అనలైజర్ టెస్టులో 150కి పైగా పాయింట్లు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో కారును సీజ్ చేసి ధృవ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# బిపి మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాజ్యాంగ బద్ధంగా నియమించిన బిపి మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అమలు చేయాలని, రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ చేసిన 40 సిఫార్సులలో కేవలం 3 సిఫార్సులు మాత్రమే అమలు చేస్తున్నారని, మిగతా సిఫార్సులను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. బిపి మండల్ వర్ధంతిని పురస్కరించుకుని యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బిసి మండల్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలోని బిసిలను ప్రభుత్వాలు బిచ్చగాళ్ళగా చేశారని ధ్వజమెత్తారు. బిసిల కోసం దేశవ్యాప్తంగా పర్యటించి 40 సిఫార్సులను రూపొందించిన బిపి మండల్ కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో బిపి మండల్ మనువడు ప్రొఫెసర్ సూరజ్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బిసి నాయకులు చిన్న శ్రీశైలంయాదవ్, రాందేవ్, రామకృష్ణ, లింగస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిజిపిఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేశ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 13:** పూర్తి ఆధారాలతో గ్రూప్1 అవకతవకలు బయట పెట్టామని, టిజిపిఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని బిఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి అన్నారు. అవకతవకలపై ప్రశ్నలకు టిజిపిఎస్సీ సమాధానాలు చెప్పట్లేదని, నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలని విమర్శించారు. తానే టిజిపిఎస్సీపై పరువు నష్టం దావా వేయబోతున్నానని తెలిపారు. టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా ఎందుకు లేదు? ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టిక్కెటున ఎందుకిచ్చారు? మహిళ, పురుషులకు వేర్వేరు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారు? మొత్తం 16 సెంటర్లుంటే 2, 3 సెంటర్ల నుంచే టాపర్స్ ఎందుకు వచ్చారు? రిటైర్డ్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో గ్రూప్1 పేపర్లు దిద్దిస్తారా? అని ప్రశ్నించారు. గ్రూప్1 అవతవకలపై పోరాటం కొనసాగిస్తాం, దీనిపై న్యాయ విచారణ జరిపిస్తే అన్ని ఆధారాలు చూపిస్తాం అని పేర్కొన్నారు.

# బాలనగర్‌లో ట్రాఫిక్ పోలీసుల నిరక్ష్యానికి వాహనదారుడు మృతి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రోడ్డుపై రన్నింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ చలాన్ విధించేందుకు ఆపే క్రమంలో అదుపుతప్పి ద్విచక్రవాహనం కింద పడింది. దీంతో వెనుక నుండి వచ్చిన ఆర్టీసీ బస్సు అతనిపై నుండి వెళ్లడంతో వాహన చోదకుడు మృతి చెందిన సంఘటన బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివేకానంద నగర్ ప్రాంతానికి చెందిన కార్పెంటర్‌గా పని చేసే జోష్ బాబు (37) ఆదివారం షాపూర్ నగర్ నుండి బాలనగర్‌కు వెళుతుండగా ఐడిపిఎల్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బైకును చలన్ వేసేందుకు ఆపే ప్రయత్నం చేశారు. కానిస్టేబుల్‌కి జోష్‌బాబుకు మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో బైక్ నడుపుతున్న జోష్ బాబు కింద పడడంతో బాలనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జోష్ బాబు తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికంగా ఉన్న వాహన చోదకులు ట్రాఫిక్ పోలీసుల నిరక్ష్యం వల్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఆందోళన కారణంగా బాలానగర్ నుండి నర్సాపూర్ వెళ్లే రహదారిలో పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ట్రాఫిక్ పోలీసుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా చలాన్ కోసం ఓ వ్యక్తి మరణానికి కారణమైన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని, అలాగే పోలీసులు ప్రజలపై అమానుషంగా ప్రవర్తించి లాఠీచార్జి చేసేందుకు ప్రయత్నించారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వక్ఫ్ చట్టానికి నిరసనగా 19న నిరసన బహిరంగ సభ

## బిజెపి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకం: ఎంపి అసదుద్దీన్‌ఓవైసీ



**హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింలకు వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ఎటువంటి లాభం కలగదని ఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. దారు సలాం లోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 19వ తేదీన రాత్రి 7 గంటలు నుంచి 10 గంటలు వరకు దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిరసన బహిరంగ సభ జరగుతుందని తెలిపారు. దారుసలాంలో జరగనున్న నిరసన బహిరంగ సభలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం మత ప్రముఖు పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చిందని, వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు ఎటువంటి ఉపయోగం లేదని ఆయన తెలిపారు. వక్ఫ్ బిల్లు వల్ల ముస్లింలు తీవ్రంగా నష్ట పోయే అవకాశం ఉందని, కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని ఆయన తెలియజేశారు. ఈ నెల 19వ తేదీన రాత్రి ఏడు గంటలు నుంచి పది గంటలు వరకుదారుసలాంలో ప్రశాంతంగా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన సభను నిర్వహించనున్నామని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తెలియజేశారు.

# వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించేంత వరకు ఉద్యమం





బషీర్‌బాగ్‌లో రోడ్డుపై బైఠాయించిన ముస్లింలు

## వేలాది మంది ముస్లింలు భారీ ర్యాలీ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ముస్లింలు ఆదివారం బషీర్‌బాగ్‌లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది జాతీయ జెండాలను, నల్ల జెండాలను చేబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని, బిజెపి, ప్రధాని నరేంద్రమోదీ డౌన్, డౌన్ అంటూ బషీర్‌బాగ్ దద్దరిల్లేలా నినాదాలు చేశారు. బషీర్‌బాగ్‌లో కొంత సేపు రోడ్డుమీద, అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు మీద బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను వివిధ మార్గాలకు మళ్లించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉస్మాన్ బింగ్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ఆలీ, పార్లమెంట్ సభ్యుడు ఉస్మాన్‌బింగ్ మహ్మద్‌ఆల్‌అజ్రి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ తదితరులు మాట్లాడారు. దేశంలోని కోట్లాది మంది ముస్లింలకు అన్యాయం జరిగేలా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఉందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ముస్లింలు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని వారు తెలిపారు. బిల్లును ఉపసంహరించేంత వరకు ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పేదల పక్షపాతి.. పాలనలో మహిళలకు ప్రాధాన్యం

## రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపితమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం బూర్గుపల్లిలో గ్రామంలోని దళిత కుటుంబం సడిమెల పద్మ బాలయ్య దంపతుల ఇంట్లో రేషన్ కార్డు ద్వారా తీసుకున్న సన్న బియ్యం భోజానాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తిన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కడుపు నింపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు నిరంతరం కృషి చేస్తుందన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సర్కారు నిరంతరం కొనసాగిస్తుందన్నారు.

కాంగ్రెస్ సర్కారు మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, కలీం, భిక్షపతి, ఎల్లం యాదవ్, అంజయ్య, వాహబ్, రేణుక, రజిని, మమత, నవీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, చిత్రంలో విసి ప్రొ.కుమార్

# మహనీయుల సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్ల బిల్లు తెచ్చాం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (తార్నాక), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** నాలుగు రోజులుగా ఒయులో జరుగుతున్న మహనీయులు జయంత్యుత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, వారు చూపిన మార్గాలపై లోతైన చర్చ జరగాలన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ల జీవితం, వారు నడిచిన మార్గం పై విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలని కోరారు. మహనీయులు ఇచ్చిన సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, 42శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాల నుంచి పరిపక్వత కలిగిన భవిష్యత్తు నాయకత్వం ఎన్నికల ద్వారానే సాధ్యమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యున్నతి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి తోనే తెలంగాణ రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమన్న పొన్నం ప్రభాకర్... ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. నాలుగు రోజులపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం చేపట్టిన మహనీయుల జయంత్యుత్సవాల కార్యక్రమాలను ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం వివరించారు. మహాత్మా జ్యోతిబా పూలే జీవితంపై ఒయూలోని ఫూలే పరిశోధనా కేంద్రం తీసుకొచ్చన పలు పరిశోధనా పత్రాలతో కూడిన తొమ్మిది పుస్తకాలను మంత్రి పొన్నం ప్రభాకర్, ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం చేతులమీదుగా ఆవిష్కరించారు.

# సమాజానికి ఆదర్శం.. వనజీవి జీవితం



## ఆయన మరణం బాధాకరం, తీరని లోటు

## కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త:** వనజీవి రామయ్య మొక్కలు నాటి, చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించి సమజానికే ఆదర్శవంతంగా నిలిచారని, ఆయన మరణం తీరని లోటని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని వనజీవి స్వగృహంలో ఉంచిన పార్థివ దేహాన్ని సందర్శించి మంత్రి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డితో కలిసి నివాళులర్పించారు. రామయ్య రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం విదితమే. ఆయన అంత్య క్రియల కార్యక్రమానికి హాజరైన మంత్రి పొంగులేటి.. వనజీవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమాజ హితంకోరే రామయ్య జీవించి ఉన్నంతకాలం పర్యావరణ పరిరక్షణ లో తన వంతు పాత్ర పోషించిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ... వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తి దాయకమని అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిగూడెం లో దివంగత పద్మశ్రీ వనజీవి(దరిపల్లి) రామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వనజీవి రామయ్య మృతి చాలా దురదృష్టకరం, బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పక్షాన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్షాన, స్థానిక శాసనసభ్యునిగా తన పక్షాన వనజీవి రామయ్య ఆత్మ శాంతించాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న, వాటన్నిటినీ అధిగమించి, కోటి మొక్కలకు పైగా నాటారని అన్నారు. వేలాది కోట్ల విత్తనాలను, వందలాది ఎకరాల్లో జీవం పోశారన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, రూరల్ తహసిల్దార్ రాం ప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పవన సుతునికి భక్తజన హారతులు

## కొండగట్టులో అర్ధరాత్రి పోటెత్తిన అంజన్న దీక్ష స్వాములు

## ముగిసిన చిన్నహనుమాన్ జయంతోత్సవాలు

**మల్యాల (జగిత్యాల జిల్లా), ప్రభాతవార్త :** రామ లక్ష్మణ జానకి.. జై బోలో హను మాన్‌కి.. జైశ్రీరామ్ జై హను మాన్ నినాదాలతో తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండ గట్టు అంజన్న క్షేత్రం దద్దరిల్లిపోయింది. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా దీక్షలు చేపట్టిన భక్తులు మాల విరమణకు శనివారం రాత్రి నుండి వేలాదిగా వాహనాలలో కొండపైకి చేరడంతో అంజన్న క్షేత్రం కాషాయ దండు తో పులకరించిపోయింది, తమ దీక్ష విరమణ కోసం వందలాది కిలోమీటర్ల నుండి పాదయాత్రలు చేస్తూ నగర సంకీర్తనలతో హనుమాన్ నామస్మరణతో కొండపైకి వచ్చిన భక్తులతో శనివారం రాత్రి 8 నుండి తెల్లవారు 4 గంటల వరకు అంజన్న క్షేత్రం ఒక్కసారిగా రద్దీమయం కాగా, దీక్షల విరమణ, కోనేరులో స్నానం, శ్రీ స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉన్నారు,, జయంతి పురస్కరించుకొని దీక్షలు చేపట్టిన భక్తులు మాల విరమణకు వేల సంఖ్యలో కొండగట్టు చుట్టుముట్టడంతో ఒకవైపు భక్తుల రద్దీ, మరొకవైపు దీక్ష స్వాములతో పోటెత్తగా, అదుపు చేసేందుకు అర్ధరాత్రి వేళ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జయంతిని సాఫీగా కొనసాగించేందుకు ఎప్పటికప్పుడు వాకీ టాకీలతోచర్యలు తీసుకున్నారు, దొంగల మరి రోడ్డు నుండి వైద్య జంక్షన్ వారికి అర్ధరాత్రి వేళ వాహనాలు భక్తులతో ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు వాటిని నియంత్రించేందుకు రెండు గంటలు పట్టింది, గుంపులుగా వచ్చిన దీక్ష చేపట్టిన స్వాములు మాల విరమణ చేసుకుని ముడుపులు చెల్లించుకుని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా సుమారు రెండు లక్షలకు పైగానే భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నట్టు అంచనా వేస్తున్నారు,,

### అంజన్న భక్తుల నగర సంకీర్తన హోరు

జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్షలు చేపట్టిన భక్తులు కొండపైకి చేరే సమయంలో నగర సంకీర్తనలు, జైశ్రీరామ్ ,,జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు, వివిధ ప్రాంతాల నుండి బైక్ ల ద్వారా హనుమాన్ జంటలతో నినాదాలు చేస్తూ ర్యాలీ ద్వారా చేరుకున్నారు, కాలినడకన వచ్చే భక్తులు, సోదర ప్రాంతాల నుండి వాహనాలను వచ్చిన కాషాయ దండు కొండగట్టు శనివారం రాత్రి ఆలయం చుట్టూ ముట్టడంతో కొండగట్టు అంజన్న నామస్మరణతో భక్తులు తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

### శ్రీస్వామివారికి విశేష పూజలు పూజలు

అంజన్న జయంతి ఉత్సవాల భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ స్వామివార్లకు ఆలయ అర్చకులు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా మూల విరాట్ కి పట్టు వస్త్రాలు అలంకరణతో పాటు ప్రత్యేక అభిషేకాలు, సహస్ర పుష్పాలంకరణ, అరటి పండ్లు సమర్పించి, సహస్ర నాగవల్లి అర్చన, విశేష పూజలను నిర్వహించారు, అదేవిధంగా ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ బేతల స్వామి వారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనేకమంది భక్తులు బేతల స్వామి వారిని కూడా దర్శించుకున్నారు. అక్కడే ఉన్న అల్లుబండ వద్ద కూడా తమ కోరికలను నెరవేరాలని భక్తులు రూపాయి బిళ్ళతో అల్లు బండతో తమ బహారాన్ని స్వామివారికి సమర్పించుకున్నారు,

### కొండగట్టులో మకాం వేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

కాగా జయంతి సందర్భంగా ఎటువంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య



ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్లు శనివారం అర్ధరాత్రి నుండి కొండగట్టులోనే మకాం వేశారు, అర్ధరాత్రి పోటెత్తిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు, ఆయనతోపాటు ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, డిఎస్పి రఘు చందర్ సిఐ నీలం రవి మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ లతోపాటు 900 మంది సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సిబ్బంది అహర్నిశలు ఉత్సవాల విధుల్లో కృషి చేశారు,

### భక్తుల సేవలో ఉత్సవ కమిటీ సభ్యులు

అంతేకాకుండా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు ఎండోమెంట్ కమిషనర్ నియమించిన జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు సంతప్రకాష్ రెడ్డి, కంచర్ల లక్ష్మణ చారిలు కూడా ఉత్సవానికి హాజరైన భక్తులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి తమ సేవలందించారు.

14-4pg10ff.qxd:14-4pg10ff.qxd 14/04/25 12:19 AM Page 1



## వరల్డ్ బిలియర్డ్స్‌లో పంకజ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ దిగ్గజం పంకజ్ అద్వానీ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నమెంట్ ఫైనల్లో పంకజ్ హోరాహోరీగా పోరాడి ఓడాడు. ఐర్లాండ్ వేదికగా జరిగిన తుదిపోరులో పంకజ్ 7-8 (100-19, 100-0, 47-100, 52-100, 100-19, 0-100,100-49, 3-100, 100-34, 100-4, 85-100, 100-31, 53-100, 43-100, 28-100) ఫ్రేమ్‌ల తేడాతో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ కాసియర్ చేతిలో పరాజయం పాలయ్యాడు. బిలియర్డ్స్, స్నూకర్ క్రీడాంశాల్లో వివిధ విభాగాల్లో కలిపి 28 సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన పంకజ్ బెస్ట్ ఆఫ్ 15 పోరులో ఆరంభంలో చక్కటి ఆధిపత్యం కనపర్చినా, చివర్ల పుంజుకున్న ఇంగ్లండ్ క్యూయిస్ట్ విజయం సాధించాడు.

## వరల్డ్‌కప్ ఆర్చరీలో జ్యోతి, రిషబ్ జోడీకి పసిడి

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో భారత్ ఖాతలో పసిడి పతకం చేరుకుంది. ఇప్పటికే రెండు పతకాలు ఒక రజతం, ఒక కాంస్య భారత్‌కు రాగా, తజాగా స్వర్ణ పతకం లభించింది. ఈ టోర్నీలో భాగంగా కాపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ ద్వయం జ్యోతి సురేఖ-రిషబ్ యాదవ్ 153-151 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ ఐజు-చెన్ చియో లున్ జంటపై విజయం సాధించింది. తుది పోరులో ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన భారత్ జోడీ రెండో సీడ్ చైనీస్ తైపీని వెనక్కి నెడుతూ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తొలి రెండు సిరీస్‌లను 37-38, 38-39తో కోల్పోయిన భారత్ ఆర్చర్లు మూడో సెట్‌లో 39-38తో తిరిగి పోటీలోకి వచ్చారు. నాలుగో సిరీస్‌లో 39-36తో సునాయాసంగా నెగ్గి పసిడి పతకం చేజిక్కించుకున్నారు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ కాంపౌండ్ విభాగాన్ని చేర్చిన అనంతరం ఈ విజయం విశ్వ క్రీడల్లో భారత్ పతక ఆశలను మరింత పెంచింది. ఇక ఈ టోర్నమెంట్‌లో బారత్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకు ముందు కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ జట్టు కాంస్య పతకాన్ని నెగ్గగా, రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ జట్టు ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది.





## రాయల్ ఛాలెంజర్స్ నాలుగో విక్టరీ

### రాజస్థాన్ రాయల్స్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ సీజన్‌లో సొంతగడ్డపై చతికిలపడుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జైపూర్‌లో అదరగొట్టింది. ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 174 పరుగుల ఛేదనలో ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (65) విధ్వంసక ఆర్ధ శతకంతో మెరిశాడు. సాల్ట్ మెరుపులతో విజయానికి పునాది వేయగా, ఆ తర్వాత విరాట్ కోహ్లి (62 నాటౌట్) సైతం బౌండరీలతో చెలరేగాడు. సందీప్ శర్మ వేసిన 4వ ఓవర్లో కోహ్లి గాల్లోకి లేపిన బంతిని అందుకున్న రియాన్ పరాగ్ ఒడిసిపట్టుకోలేక వదిలేశాడు. పవర్ ప్లేలో ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా 65 రన్స్ చేసింది. లైఫ్ లభించడంతో రెచ్చిపోయిన సాల్ట్ సందీప్ వేసిన 6వ ఓవర్లో సిక్సర్ బాదాడు. 7వ ఓవర్లో బౌండరీతో అర్ధ శతకం సాధించిన సాల్ట్ ఆ తర్వాత మరింత స్పీడ్ పెంచాడు. అయితే కుమార్ కార్తికేయ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడి యశస్వీ చేతికి చిక్కాడు. దాంతో, 92 వద్ద బెంగళూరు మొదటి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్(40 నాఔటట్) బౌండరీలతో చెలరేగాడు. సందీప్ వేసిన 18వ ఓవర్ మూడో బంతికి ఫోర్ కొట్టిన పడిక్కల్ జట్టుకు 9 వికెట్ల విజయాన్ని అందించాడు. ఫలితంగా ఆర్సీబీ నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. ఈ విక్టరీతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ నిదానంగా మొదలైంది. పవర్ ప్లేలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు.

దాంతో, రాజస్థాన్ ఓపెనర్లు సంజూ శాంసన్(15), యశస్వీ జైస్వాల్(75 47 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లు)లు ధాటిగా ఆడలేకపోయారు. ఓవర్‌కు ఒక బౌండరీ చొప్పున సాధించగా 45 రన్స్ మాత్రమే వచ్చాయి. అయితే శాసన్‌ను కృనాల్ పాండ్యా వెనక్కి పంపాడు. అతడి బౌలింగ్‌లో వికెట్ కీపర్ జితేశ్ శర్మకు క్యాచ్ ఇచ్చి సంజూ ఔటవ్వడంతో తొలి వికెట్ 49 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత రియాన్ పరాగ్(30) సహకారంతో యశస్వీ దూకుడుగా ఆడాడు. కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో సింగిల్ తీసి యశస్వీ అర్ధ శతకం సాధించాడు. రియాన్ పరాగ్(30)తో 55 పరుగుల కీలక భాగస్వామ్యం నిర్మించాడు. వీళ్లిద్దరూ దూకుడుగా ఆడడంతో 13 ఓవర్లకు రాజస్థాన్ వికెట్ నష్టానికి 104 రన్స్ చేసింది. యశ్ దయాల్ బౌలింగ్‌లో పరాగ్ కవర్స్‌లో విరాట్ కోహ్లీకి సులవైన క్యాచ్ ఇచ్చాడు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచి ఆడుతున్న యశస్వీని హేజిల్‌వుడ్ ఎల్బీగా ఔట్ చేసి రాజస్థాన్ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివర్లో ధ్రువ్ జురెల్(35 నాటౌట్), హెట్‌మైర్(9)లు ధాటిగా ఆడారు. 20వ ఓవర్లో ఆఖరి బంతిని నితీశ్ రానా(4 నాటౌట్) బౌండరీ సాధించడంతో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 173 పరుగులకే పరిమితమైంది.

# చెన్నై సూపర్ కింగ్స్ ఔట్!

### ఐపిఎల్‌లో ఏదైనా అద్భుతం జరిగేనేతే ప్లే ఆఫ్ ఛాన్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, 18వ సీజను నుండి చెన్నై సూపర్ కింగ్స్ నిష్క్రమించడం దాదాపు తప్పనిసరి కానుంది. ఈ ఐపీఎల్ సీజనులో చెన్నై జట్టు ఇప్పటివరకు చాలా నిరాశ కలిగించింది. ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 ఓటములు చవి చూసింది. ఈ సీజన్‌లో మొదటి మ్యాచ్‌లో గెలిచిన తర్వాత, వరుసగా 5 మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ఇన్ని మ్యాచ్‌లలో ఓడిపోవడం ఇదే తొలిసారి. చివరకు సొంత మైదానంలో కూడా జట్టు గెలవలేకపోతోంది. చెపాక్‌లో గత మూడు మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ అవమానకరమైన ప్రదర్శన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్లే ఆఫ్ రేసు నుండి నిష్క్రమించిందా? ముంబై ఇండియన్స్ లాంటి అద్భుతం పునరావృతం అవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టికలో సూపర్ కింగ్స్ జట్టు ప్రస్తుతం 6 మ్యాచ్‌లలో 1 విజయం, 2 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. దాని నెట్ రన్ రేట్ మైనస్ 1.554గా ఉంది. అయితే, ఈ పేలవమైన ప్రదర్శన తర్వాత కూడా జట్టు ప్లే ఆఫ్ రేసు నుండి నిష్క్రమిం చలేదు. కానీ, ప్లే ఆఫ్‌కు చేరుకోవడం అనేది చెన్నై జట్టుకు అద్భుతం కంటే తక్కువేమీ కాదు. ఐపీఎల్ లీగ్ దశలో అన్ని జట్లు 14-14 మ్యాచ్‌లు ఆడతాయి, కాబట్టి చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇంకా 8 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మిగిలిన మ్యాచ్‌లలో జట్టు బాగా ఆడితే, సీజన్‌లో పునరాగమనం చేయవచ్చు. అయితే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఈ సీజన్‌లో పునరాగమనం చేయడం అంత సులభం కాదు. ఐపీఎల్ చరిత్రలో ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 మ్యాచ్‌లు ఓడిపోయి ప్లే ఆఫ్‌కు అర్హత సాధించి, టైటిల్ గెలిచిన జట్టు ఒక్కసారి మాత్రమే ఉంది. ఈ అద్భుతం 2015లో ముంబై ఇండియన్స్ జట్టు చేసింది. ఐపీఎల్ 2015లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 మ్యాచ్‌లు ఓడిపోయింది. ఆ తర్వాత జట్టు పునరాగమనం చేసి తర్వాతి 8 మ్యాచ్‌లలో 7 మ్యాచ్‌లు గెలిచి ప్లే ఆఫ్‌లో స్థానం సంపాదించింది. ఆ తర్వాత క్వాలిఫయర్, ఫైనల్ మ్యాచ్‌లలో చెన్నై జట్టును ఓడించి టైటిల్ గెలిచింది. మళ్లీ ఈ సీజనులో అటువంటి అద్భుతం చెన్నై సూపర్ కింగ్స్‌కు జరిగిన ప్లే ఆఫ్‌కు చేరుకుంటుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న అయింది.

## ఛాంపియన్ సూపర్ జైయింట్స్




**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)-2024-2025లో మోహన్ బగాన్ సూపర్ జైయింట్స్ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో సూపర్ జైయింట్స్ జట్టు 2-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. 2024-25 సీజన్ లీగ్ దశలో అద్వితీయ ఆట తీరుతో పాయింట్ల పట్టికలోఅగ్రస్థానంలో నిలిచి లీగ్‌షీల్డ్ దక్కించుకున్న సూపర్ జైయింట్స్ జట్లు ఫైనల్లోనూ అదే జోరు కనపరచింది. తుది పోరులో సూపర్ జైయింట్స్ జట్టు తరపున జాసన్ కమిన్స్ 72వ నిముషంలోను, జేమీ మెక్‌లారెన్ 96వ నిముషంలోనూ చెరో గోల్ చేశారు. మోహన్ బగాన్ జట్టు స్ట్రయికర్ అల్బెర్టో రోడ్రగ్జ్ 49వ నిముషంలోనే బెంగళూరు గోల్స్ ఖాతా తెరవగా, ద్వితీయార్ధంలో చెలరేగిపోయిన సూపర్ జైయింట్స్ జట్టు రెండు గోల్స్‌తో విజయ పతాకాన్ని ఎగురవేసింది. జూపర్ జైయింట్స్ జట్టు 20 షాట్స్ ఆడగా, అందులో ఆరింటిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై సంధించగలిగింది.ఇకబెంగుళూరు జట్టు 18 షాట్స్‌లో నాలుగింటిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పైకి కొట్టింది. మ్యాచ్‌లో అత్యధిక శాతం బంతిని తమ నియంత్రణలో ఉంచుకోగలిగిన బెంగళూరుఫినిషింగ్ లోపాలతోగోల్స్ చేయలేకపోయింది. స్టార్ స్టయికర్ సునీల్ ఛెత్రి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం బెంగుళూరు విజయావకాశాలపై ప్రభావం చూపింది. ఓవరాల్‌గా మ్యాచ్లఓ 62 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న బెంగుళూరు జట్టు 512 పాస్‌లు కొట్టగా, 38 శాతం బంతిని నియంత్రించిన మోహన్ బగాన్ జట్టు 318 పాస్‌లు ఇచ్చుకుంది. పాస్‌ల కచ్చితత్వంలోనూ బెంగుళూరు 78 శాతంతో మెరుగైన ప్రదర్శన కనబర్చగా, సూపర్ జైయింట్స్ 65 శాతంతో వెనుకబడింది. ఇక 2022-23 సీజన్‌లోనూ ఈ రెండు జట్ల మధ్యే ఐఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్ జరగ్గా అప్పుడు కూడా బెంగుళూరుపై సూపర్ జైయింట్స్ జట్టు గెలుపు సాధించి టైటిల్‌ను దక్కిందించుకుంది.

# పెరుగుతున్న క్రెడిట్ కార్డు బకాయిలు: ఆర్‌బిఐ

**ముంబై, ఏప్రిల్ 13:** గత కొన్ని సంవత్సరాలుగా క్రెడిట్ కార్డ్ వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రధానంగా వినియోగదారుల వ్యయం పెరగడం, డిజిటల్ చెల్లింపులకు పెరుగుతున్న ప్రజాదరణ దీనికి కారణం. అయితే, డిసెంబర్ 2024తో ముగిసిన 12 నెలల కాలంలో క్రెడిట్ కార్డ్ విభాగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) కూడా 28.42 శాతం పెరిగి రూ.6,742 కోట్లకు చేరుకున్నాయని తాజా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డేటా చెబుతోంది. ఆర్‌బిఐ డేటా ప్రకారం డిసెంబర్ 2023లో రూ.5,250 కోట్ల నుండి ప్రస్తుత స్థాయికి స్థూల ఎన్‌పిఎలు




పెరిగాయి. ఇది దాదాపు రూ.1,500 కోట్ల పెరుగుదల ఉంది. ఇది డిసెంబర్ 2024లో వాణిజ్య బ్యాంకుల క్రెడిట్ కార్డ్ విభాగంలో ఉన్న రూ.2.92 లక్షల కోట్ల స్థూల రుణంలో దాదాపు 2.3 శాతం. ఇది గత సంవత్సరం ఉన్న రూ.2.53 లక్షల కోట్ల క్రెడిట్ కార్డ్ బకాయిలలో 2.06శాతంగా ఉంది. ఆర్థిక సవాళ్లు, దూకుడుగా రుణ విధానాలు, తక్కువ ఆర్థిక అక్షరాస్యత కారణంగా భారతదేశ క్రెడిట్ కార్డ్ రుణం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా గిగ్ వర్కర్లు, ఎంఎస్‌ఎంఇలలో క్రమరహిత ఆదాయాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. ఉదాహరణకు, 2023లో 8 మిలియన్లకు పైగా ఉద్యోగాలు పోయాయి. ఆదాయ అస్థిరత 2024 వరకు కొనసాగింది. ఈ అస్థిరత వల్ల చాలా మంది అవసరమైన ఖర్చుల కోసం క్రెడిట్ కార్డులపై ఆధారపడవలసి వస్తుందని రుణ చెల్లింపు వేదిక అయిన జావో వ్యవస్థాపకుడు కుందన్ షాహి చెప్పారు. బ్యాంకులు దూకుడుగా కార్డులు జారీ చేస్తున్నాయి. 2024లో 102 మిలియన్లకు పైగా కొత్తవి ఉన్నాయి. తరచుగా తక్కువ ఆదాయం ఉన్నవారిని లేదా మొదటి సారి రుణగ్రహీతలను లక్ష్యంగా చేసుకుని బల మైన క్రెడిట్ తనిఖీలు లేకుండానే జారీ చేస్తు న్నాయి. ఈ సులభమైన యాక్సెస్ హఠాత్తుగా ఖర్చు చేయడానికి ఆజ్యం పోస్తుంది. కానీ చాలా మందిని రుణ ఉచ్చులకు గురి చేస్తుందని జావో నుండి షాహి చెబుతున్నారు. ఆర్థిక అక్షరాస్యత లేక పోవ డం కూడా పరిస్థితిని మరింత దిగజార్చుతుం ది. కొంత మంది విని యోగదారులు క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపుల చివరి తేదీలకు కట్టుబడి ఉండటం ప్రాముఖ్యతను అర్థం చేసుకోరు. యువ వినియోగదారులు ముఖ్యం గా అనవసరమైన ఖర్చు లకు గురవుతారు. రూపే క్రెడిట్ కార్డులతో యుపిఐని అనుసంధానించడం వల్ల లావాదేవీలు సజావుగా జరి గాయి. అయితే ఖర్చు పర్యవేక్షణ కూడా తగ్గింది" అని షాహి చెప్పారు. ఆర్థిక విద్య, రుణ నిబంధనలను పరిశీలించక పోతే ఈ విభాగంలో హద్దులేని వృద్ధి దీర్ఘ కాలిక పరిణా మాలను కలిగిస్తుంది. జోక్యం చేసుకోకపోతే, పెరు గుతున్న డిఫాల్ట్‌లు, ఆర్థిక ఒత్తిడి కారణంగా లోతైన రుణ సంక్షోభం పెరిగే ప్రమాదంఉంది. అయితే, స్కోరును మెరుగుపరచుకోవడానికి మీకు తగినంత సమయం అవసరం. అయితే, పేలవమైన క్రెడిట్ స్కోరుకు కారణమైన కారణాలను మీరు ముందుగా గుర్తించాలి. క్రెడిట్‌కార్డును పొందడంలో, అనుకూలమైన నిబంధనలపై వ్యక్తిగత రుణాన్ని పెంచడంలో క్రెడిట్ స్కోరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

## వాణిజ్యం

## స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారత్ రికార్డు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారతదేశంలో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 54 శాతం పెరిగాయి. ఈ వృద్ధి వరల్డ్ వాల్యూ చైన్‌లో భారత దేశానికి సంబంధించిన ఏకీకరణను ప్రతిబింబిస్తుందని, అలాగే భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని కేంద్రమంత్రి వైష్ణవ్ తెలిపారు. భారతీయ ఎంఎస్ఎంఈలు ఇప్పుడు ప్రపంచంలో కీలకంగా మారుతున్నాయని వివరించారు. దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ఎగుమతుల పెరుగుదలకు ప్రధానంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎల్ఐ స్కీమ్ ప్రధానం కారణమని ఆయన పేర్కొన్నారు. పీఎల్ఐ స్కీమ్ వల్ల స్థానిక ఉత్పత్తిని గణనీయంగా పెరిగిందని వివరించారు. ముఖ్యంగా భారతదేశం దిగుమతి చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌లపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడింది. ప్రస్తుతం భారతదేశంలో అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్‌లలో దాదాపు 99 శాతం దేశీయంగా తయారవుతున్నాయని తెలిపారు. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ అంచనాలు 2025 ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 20 బిలియన్ యూఎస్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. అయితే తుది సంఖ్య ఈ అంచనాను సులభంగా అధిగమించింది. దీన్ని బట్టి ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీలో భారతదేశ పాత్రను అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో ఆపిల్ అగ్రస్థానంలో ఉంది. మొత్తం షిప్‌మెంట్‌లలో దాదాపు 70శాతం వాటాతో అగ్రగామిగా ఉంది. ముఖ్యంగా తమిళనాడులోని ఫాక్స్‌కాన్ సౌకర్యం ఒక ప్రధాన ఎగుమతి కేంద్రంగా మారింది. భారతదేశం నుంచి ఎగుమతైన ఐఫోన్ షిప్‌మెంట్‌లలో దాదాపు సగం ఎగుమతులు



ఫాక్స్‌కాన్ నుంచే ఎగుమతయ్యాయి. అలాగే ఈ ఎగుమతులు సంవత్సరానికి 40 శాతం వృద్ధిని నమోదు చేస్తుంది. అలాగే టాటా ఎలక్ట్రానిక్స్ కూడా స్మార్ట్‌ఫోన్ రంగంలో తన మార్క్‌ను చూపిస్తుంది. కర్ణాటకలోని విస్ట్రాన్ సౌకర్యంలో దాని వాటా, పెగాట్రాన్ తమిళనాడు యూనిట్‌లో 60 శాతం వాటా భారతదేశంలో ప్రధాన ఐఫోన్ తయారీదారుగా దాని స్థానాన్ని బలోపేతం చేసుకున్నాయి. అలాగే సుంకాల విషయంలో అమెరికా తీసుకున్న నిర్ణయం వలల్ భారతదేశం నుంచి ఐఫోన్‌ల ఎగుమతులు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఆరోగ్య బీమాతో ఆర్థిక ధీమా..

**ముంబై, ఏప్రిల్ 13:** సాధారణంగా 20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసులో ఆరోగ్య బీమాను తీసుకోవడం ప్రారంభించాలి. చిన్న వయస్సులో ఎక్కువ కవరేజ్ ఎంచుకోవడం వల్ల ఎక్కువ వయస్సులో పెద్దబీమా మొత్తం లభిస్తుంది. రెగ్యులర్ చెకప్‌లు, టీకాలు, వెల్నెస్ బెనిఫిట్లను అందించే ప్లాన్లను తీసుకోవాలి. చాలా సంస్థలు ఎన్సీబీని అందిస్తాయి. అంటే ప్రతి క్లెయిమ్ రహిత సంవత్సరానికి మీ బీమా మొత్తం పెరుగుతూ ఉంటుంది. కాలక్రమీణాఎక్కువ ప్రయోజనాలను పొందటానికి ఇది మంచి మార్గం. 30ఏళ్ల నుంచి 40ఏళ్లలోకి అడుగు పెట్టేసరికీ బాధ్యతలు పెరుగుతాయి. వివాహం, పిల్లలు కారణంగా ఖర్చులు ఎక్కువవుతాయి. ఈ సమయంలో ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు కొన్ని విషయాలను పరిశీలించాలి. వ్యక్తిగత పాలసీలకు బదులుగా భార్య, పిల్లలకు కలిపి ఒకే బీమాను అందించే ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ ఎంచుకోవాలి. ఈ పాలసీలు ఇంకా నిర్ధారణ కాని వ్యాధులకు కూడా కవరేజీ అందిస్తాయి. ప్రినేటల్, ప్రసవానంతర ఖర్చులు, డెలివరీ ఖర్చులు, నవజాత శిశువులకు టీకాలు వేసి పాలసీలను తీసుకోవాలి. క్యాన్సర్, గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం తదితర వాటికి ఒకేసారి చెల్లింపులను అందించే యాడ్ - ఆన్ లను పరిగణించాలి. కీమోథెరపీ, డయాలసిస్ వంటి డేకేర్ చికిత్సలు, ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ఖర్చులను కవర్ చేసే పాలసీని తీసుకోవాలి. కొన్ని పాలసీలు మధ్యంతర కాలంలో, పునరుద్దరణ సమయంలో కొత్త సభ్యులను చేర్చుకునే అవకాశం కల్పిస్తాయి. సాధారణంగా 40 నుంచి 50 ఏళ్లకు మధ్య వయస్సుగా పరిగణిస్తారు. ఈ సమయంలో హైపర్ టెన్షన్, డయాబెటీస్, గుండె వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. వీటి కవరేజీ పాలసీలను తీసుకోవాలి. దీర్ఘకాలికవ్యాధులకు వైద్యచికిత్సలు ఖరీదుగా ఉంటాయి. కాబట్టి అధికమొత్తం బీమా మొత్తం కలిగిన పాలసీని ఎంపిక చేసుకోవాలి. చాలా బీమా సంస్థలు వార్షిక ఆరోగ్య పరీక్షలు, వెల్నెస్ ప్రోత్సాహకాలను అందిస్తాయి. బీమా సంస్థలు 60 ఏళ్ల పైబడిన వ్యక్తుల కోసం ప్రత్యేక పాలసీలను అందిస్తాయి. వయస్సు సంబంధిత వ్యాధులను కవర్ చేస్తాయి.




## పెట్రోల్ బంకుల్లో పెరుగుతున్న మోసాలు..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కారు, బైక్‌లో పెట్రోలు నింపే ముందు, తర్వాత పంపుపై మీటర్ రీడింగ్‌ను గమనించాలి. మీకు కొనుగోలు చేసిన ఇంధన పరిమాణం దానిలో చూపిన అంకెలతో సరిపోయిందో, లేదో చూసుకోండి. డిస్‌ప్లేలో ముందుకు దూకినట్టు అనిపించినా, అస్తవ్యస్తంగా కనిపించినా వేరే పంపు కోసం అడగండి. అక్కడి స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేయండి. నాణ్యమైన ఇంధనంతో మీ వాహనం మన్నిక, మైలేజీ బాగుంటాయి. తక్కువ నాణ్యత గల ఇంధనాన్ని వాడితే అనేక సమస్యలు వస్తాయి. వాహనం మైలేజీ తగ్గడం, ఇంజిన్ హార్డ్‌గా మారడం, పరుగులో తేడా కనిపిస్తాయి. కాబట్టి నమ్మకమైన పెట్రోలు బంకుకు వెళ్లడం చాలాముఖ్యం. సాధారణంగా పెట్రోలు ధర అన్ని చోట్లా ఒకేలా ఉంటుంది. కానీ చుట్టుపక్కల బంకుల కంటే తక్కువ ధరకు ఇంధనం అందిస్తుంటే అప్రమత్తంగా ఉండాలి. అది మిమ్మల్ని మోసం చేయడానికి చేసే ప్రయత్నం కావచ్చు. కాబట్టి ఎల్లప్పుడూ ధరలను గమనించాలి. మీ వాహనంలో ఇంధనం నింపే సహాయకుడి చర్యలను గమనించాలి. అతడు పంపును తారుమారు చేయకూడదు, సరైన అనుమతి లేకుండా మీటర్‌ను సర్దుబాటు చేయకూడదు. పెట్రోల్ బంకులో సహాయకుడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే అప్రమత్తమవ్వాలి. పెట్రోలు బంకులో ఇంధనం కొట్టించుకున్న తర్వాత రశీదును తీసుకోవడం మర్చిపోవద్దు. కొలతల్లో వ్యత్యాసాలు, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి రశీదు ఎంతో ఉపయోగపడుతుంది.



## టెక్ రంగంలో మహిళలకు డిమాండ్

**ముంబై, ఏప్రిల్ 13:** భారత్‌లో టెక్, బిజినెస్ రంగాల వృద్ధి కొనసాగుతూనే ఉంది. దీంతో ఈ రంగాల్లో నియామకాలు కూడా ఫుల్ జోష్ లో ఉన్నాయి. తాజాగా టీమ్‌లీజ్ డిజిటల్ విడుదల చేసిన నివేదికలో ఈ రెండు రంగాల్లో మహిళలకు అధిక డిమాండ్ ఉన్న ఉద్యోగాల జాబితాను వెల్లడించింది. అనుభవం, నైపుణ్యానికి పెద్దపేట వేస్తూ అధిక జీతాలతో ఆకర్షణీయమైన కొలువులు ఈ రంగాల్లో మహిళలకు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా ఫ్రెషర్స్ నుంచి అనుభవజ్ఞులైన నిపుణుల వరకు.. డేటా సైన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, క్లౌడ్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో మహిళలకు కెరీర్ అవకాశాలు దండిగా ఉన్నాయి. భారత్ టెక్ రంగంలో ఒక ప్రొడక్ట్‌ను దాని ప్రారంభ దశ నుంచి కస్టమర్ వరకు నడిపించడంలో ప్రొడక్ట్ మేనేజర్ కీలక పాత్ర పోషిస్తారు. వారు కస్టమర్ అవసరాలు, వ్యాపార లక్ష్యాలు రెండింటికీ అనుగుణంగా ఉండేలా ప్రొడక్ట్‌ను పోటీ కంటే ముందుండేలా చేస్తారు. ఈ రంగంలో అడుగుపెట్టే ఫ్రెషర్లకు (0 నుంచి 3 యేళ్లకు) రూ. 22.1లక్షల వార్షిక ఆదాయం లభిస్తుంది. కెరీర్ ప్రారంభంలో ప్రొడక్ట్ మేనేజర్లు, మార్కెట్ రీసెర్చ్, వినియోగదారు అవసరాలను గుర్తించడం, వారి ఆలోచనలకు ప్రాణం పోసేందుకు డెవలప్‌మెంట్ టీంకు మద్దతుతెల్పడం వంటి అంశాలపై దృష్టిసారించవల్సి ఉంటుంది. అనుభవం పెరిగేకొద్దీ వీరి జీతం అంటే 8 యేళ్ల అనుభవం ఉన్న సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్లు, డైరెక్టర్లకు రూ.160 లక్షల వరకు వార్షిక ఆదాయం పొందొచ్చు. ముడి డేటానువిలువైన అంతర్దృష్టులుగా మార్చడంలో డేటా సైంటిస్టులు కీలకపాత్ర పోషిస్తారు. కంపెనీలు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి డేటాపై ఎక్కువగా ఆధారపడటంతో, ఈ రంగం అత్యంత ప్రతిఫలదాయకమైన కెరీర్ ఆప్షన్‌లలో ఒకటిగా మారింది. డేటా సైన్స్ రంగంలో ఫ్రెషర్లకు రూ.18 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుంది. ఇందులో కొత్త డేటా సైంటిస్టులు పెద్ద డేటాసెట్‌లను ఎలా నిర్వహించాలో, ప్రాథమిక యంత్ర అభ్యాస పద్ధతులను ఎలా వర్తింపజేయాలో, డేటా ఆధారిత పరిష్కారాలతో వాస్తవ ప్రపంచ సమస్యలను ఎలా పరిష్కరించాలి వంటి వాటిని నేర్చుకుంటారు. అలా 8 యేళ్ల తర్వాత సీనియర్ డేటా సైంటిస్టులకు రూ. 150లక్షల వార్షిక వేతనం లభిస్తుంది. పిఎంఒ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఆఫీస్) నిపుణులు బడ్జెట్‌ను మించకుండా సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, సంస్థాగత లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తారు. ప్రాజెక్ట్ ప్రక్రియలను క్రమబద్ధీకరించడంలో, సామర్థ్యాన్ని నిర్ధారించడంలో వీరి నైపుణ్యాలు ఏ వ్యాపారానికైనా కీలకంగా ఉంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14